ISSN No:2581-7477

# సాహిత్యప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 1 సంచిక - 12 సెప్టెంబర్ - 2020 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి


ఫొటో: ఎస్.ఎస్.బి. గేరా - 9492922492

# సాహిత్య ప్రస్థానం

సంపాదకీయం


## ఆన్‌లైన్... లైఫ్‌లైన్!

అనిసెట్టి అరవై అయిదేళ్ల కిందటే అన్నమాట అన్నా మనకీ లోకం పన్నిన పద్మ వ్యూహం గుర్తుచేస్తుంది జీవితం. ఏడు మాసాలు గడిచినా తగ్గని కరోనా వైరస్ తాకిడి. అందులోనూ రోజువారి పెరుగుదలలో ప్రపంచ రికార్డు చేదించిన ఇండియా. వాక్సిన్ పై ఆశలు అలా ఆలస్యమవుతూనే వున్న వాస్తవం. ప్రజారోగ్య వ్యవస్థ కొరతలు కార్పొరేట్ వైద్యం వాతల మధ్య గిజగిజ. అన్‌లాక్ 4 అంటున్నా జీవిత సమస్యల గడియలు తెరుచుకునే తాళం దొరకని స్థితి. ఉపాధి పోయినవాళ్లు, ఉద్యోగాలు చేస్తున్నా జీతం పూర్తిగా చేతికి రానివాళ్లు, నియామకాలు నిలిచిపోయి చిరు వ్యాపారాలు ఆగిపోయి భవిష్యత్తు అగమ్యమైన వాళ్లు, గ్రామసీమల్లో పనులు లేని లక్షలాది శ్రామికులు, ఇంతటి కల్లోలంలోనూ పంటలు బ్రహ్మాండంగా పండించికూడా బతుకు నిలిపే గిట్టుబాటు ధర నోచని కర్షకులు., ఇంటినుంచే పని పర్వంలో ఇంటెడు పనీ అదనంగాచేయడమే గాక గృహ హింస పెరుగుదలకు గురవుతున్న స్త్రీలూ పిల్లలూ, సాహిత్య కారుల కలాలను నిరంతరం పలకరించే వృద్ధ తరం పెద్దలూ ఒకరేమిటి ఎవరికి వారు బాధల బంధీలైన దుస్థితి. ధరల పెరుగుదల పున: ప్రారంభమయ్యే ఇఎంఐలు కట్టడమెలా అని మధ్యతరగతి మానవులు మదనపడుతుంటే జిఎస్‌టి లోటు పోటుతో రాష్ట్రాలే తలకిందులవుతున్న పరిస్థితి. మైనస్ ధరలో పడిపోయిన పెట్రోలుపై 18 లక్షల కోట్ల మిగులు వాటితో పంచుకోవడానికి సిద్ధంగా లేని కేంద్రం అప్పుల మార్గమే చూపిస్తున్న విచిత్రం. ఇవన్నీ గాక ఎపిలో అదనంగా రాజధాని ప్రతిష్టంభనలో రాజకీయ పరిభ్రమణం. మరోసారి ప్రాంతాల కులాల కుటిల కృత్రిమ రాజకీయాల విజృంభణ. ఇవన్నీ పన్నిన పద్మవ్యూహం కావచ్చుగాని కవిత్వమొక తీరని దాహం అనిన్నీ అనలేదా మన మహాకవి! కాబట్టి జంకుగొంకు లేక ముందుకు సాగిపోవాల్సిందే. జీవిత పోరాటం సాగించాల్సిందే. ఈ కరోనానే కవి కట్టిన వారూ, పాటలు పాడిన వారూ ఎందరో! ఏలినవారు సెప్టెంబరు 21 తర్వాత వందమందికి మించకుండా సభలూ సమావేశాలు జరుపుకోవచ్చన్నారు గనక సాహిత్య జీవులు ఆన్‌లైన్ నుంచి మళ్లీ లైఫ్‌లైన్‌లోకి రావచ్చు. జాగ్రత్తలు మాత్రం మర్చిపోకూడదు సుమా! ◆


ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
వొరప్రసాద్

సంపాదకవర్గం:
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి ◆ కెంగార మోహన్
మేనేజర్: కె.లక్ష్మయ్య

బొమ్మలు:
తుంబలి శివాజి
చిదంబరం
ముఖచిత్రం ఫోటో:
మైఖేల్ బ్లాంకెట్టా

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akualvari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


ఉద్యవామి – డా॥ ఎం. ప్రగతి........................ 5
అమ్మ – ఎ. అన్నపూర్ణ................................. 23
మామిడి తోపు – మూగాటి శబరీష్..................... 38
అనూహ్యం – పి.ఎల్.ఎన్. మంగరత్నం................ 51


## కవితలు


మేకిన్ ఇండియా – రాధేయ............................ 11
చుక్..చుక్ బండీ పోతుంది.!
– పోతగాని సత్యనారాయణ...................... 16
జ్ఞాపకాల సంతకం – సాంబమూర్తి లండ............ 16
అన్ని గుండెలూ అమ్మవే
– అడిగోపుల వెంకటరత్నమ్..................... 22
చీకటిలాంటి బాధ – హరి.............................. 26
గాయపడ్డ పిడికిళ్ళు – మల్లారెడ్డి మురళీమోహన్...... 32
గాయాల దండయాత్ర – వల్లభాపురం జనార్దన........ 33
మౌన రోదన – సి. శేఖర్............................... 33
జ్ఞాపకాల నిశీధి – సునీత గంగవరపు.................. 37
ఎదురు దాడి – డా॥ బి. నాగశేషు...................... 42
పురుటి మట్టి – శ్రీనివాస్ అంకే........................ 47
జ్ఞాపకాలు – సింహాద్రి పద్మ............................ 47
మేం నిద్రపోతున్నాం – హిందీ: మంగళేష్ డబలార్
– తెలుగు: పాయల మురళీకృష్ణ.................. 50
నాన్న – కొత్తపల్లి మణీత్రినాథరాజు..................... 54
దిగులు మబ్బు – తిరునగరి శరత్‌చంద్ర................ 60
మనిషితనాన్ని తట్టిలేపుతూ
– మామిడిశెట్టి శ్రీనివాసరావు..................... 63


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం ఆగస్టు 2020 పురస్కారాలు....... 10
ఒక విషాద జీవన కావ్యం – పిరదౌసి
– మందరపు హైమవతి.......................... 12
పాలనాభాషగా తెలుగు
– నందివెలుగు ముక్తేశ్వరరావు................... 17
వంగపండు ప్రసాదరావు కన్నుమూత................. 22
విద్యుత్ సమరం...సహస్రాబ్ది స్వరం @ 20
– తెలకపల్లి రవి.................................. 27
వలసజీవుల యధార్థ గాథ – డా॥ ఎ.ఎ. నాగేంద్ర.... 28
కలువకొలను సదానంద కన్నుమూత................. 32
దేవరాజు మహారాజు వైజ్ఞానిక నాటికలు
– కె. పి. అశోక్ కుమార్.......................... 34
ఆలోచనాత్మక అనుభూతుల కవిత్వం
– డా॥ స్వర్ణలత గొట్టిముక్కల..................... 43
రాయలసీమ మట్టి పరిమళం – కొత్తపల్లి సురేష్...... 48
గిరిజన సాహిత్యాన్ని నిజంగా ప్రోత్సహిస్తున్నామా?
– పలమనేరు బాలాజీ............................ 55
అద్దేపల్లి కవిత్వంలో ప్రపంచీకరణ ప్రస్తావన
– ఎస్. ఆర్. పృథ్వీ.............................. 61
సుఖము..సురక్షితం..మీ ప్రయాణం కథలు
– ఎస్. వి. ఆర్. కృష్ణారావు ...................... 64
స్వీకారం.............................................. 66



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002,
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000/ ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

# కథ



# ఉద్భవామి!

- డా॥ ఎం. ప్రగతి
9440798008

2019 నవంబరు నెల. హేమంతపు చలిగాలులు మెల్లగా పరుచుకుంటున్నాయి. మరో రెన్నెల్లల్లో తమ ద్విదశాబ్దపు విజన్ ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అంచనా వేసుకునే పనుల్లో వివిధ దేశాధినేతలు నిమగ్నమై ఉన్నారు.

మరోవైపు ఓ ప్రాచ్య దేశపు మూల ఓ 'ఊహా' నగరంలో నానో సూక్ష్మ జీవుల గ్లోబల్ సమ్మిట్ జరుగుతోంది. ఎబోలా, రోటా, హంటా, ఇన్ ఫ్లూయెంజా, నిపా, సార్స్ తదితర వైరస్లన్నీ కళ్ళు విప్పార్చి చూస్తున్నాయి. తమ కుటుంబంలో కొత్త ప్రాణి ఉద్భవించబోతోంది. అంత చలికాలంలోనూ సీజన్లు సైతం అన్ సీజన్ అయిపోయినట్లు ఆకాశంలో తళతళమంటూ మెరుపులు, ఫెళఫెళమంటూ ఉరుములు. అందరి దృష్టి కేంద్రీకృతమై ఉన్న నానో బిందువు నుంచి చిన్నగా బుడిపె ఒకటి పొడుచుకొచ్చింది. మెల్లగా ఒక్కో బుడిపె విచ్చుకుంటూ ఊలు బంతి లాంటి సూక్ష్మప్రాణి, మెరుపులతో పోటీ పడుతూ రెక్కలు విప్పుకుంది.

"వెల్కమ్ బుజ్జి తండ్రీ... సూక్ష్మ జీవ ప్రపంచంలోకి హార్థిక స్వాగతం." ముసలి వైరస్లు ఆనందంగా కొత్త జీవికి ఆహ్వానం పలికాయి.

ఈ కొత్త ప్రాణి కంటే కొంత ముందుగా పుట్టిన వైరస్లు బోడిగా, కళావిహీనంగా ఉన్న తమ శరీరాలకేసి చూసుకున్నాయి. అందంగా రత్నాలతో పొదిగినట్టున్న కిరీటాన్ని కలిగిన తమ తోబుట్టువు శరీరాన్ని చూసి మనసులోనే కుళ్ళుకున్నాయి. అందంగా ఉన్న తన శరీరాన్ని చూసుకొని కొత్త ప్రాణి గర్వంగా నవ్వింది. తన అన్నలు, అక్కల కేసి ఓరగా చూసింది.

"ఆ... పెద్ద అందంగా ఉన్నాననీ. మేం గుండుగా ఉన్నా, సన్నగా, నాజూగ్గా ఉన్నాం. ఇంత లావు వొళ్ళు, మళ్ళీ పైన ముళ్ళు వికారంగా..." అసూయను ఉక్రోషంగా బయట పెట్టుకున్నాయి తోబుట్టువులు. "ఇంతకూ ఈ వికృత రూపం పేరేమిటో..." రాగం తీశాయి ఉమ్మడిగా.

"కొరోనా...." పలికాయి పెద్ద జీవులు.

"ఊహూ... నవీన కొరోనా!" పలికింది మూల విరాట్టు వైరస్. "వీడు కారణ జన్ముడు. ఇప్పటి దాకా మన నడ్డి విరగ్గొట్టి మూల కూచోబెట్టిన మనిషి మీద పగ తీర్చుకోడానికి మన జన్యువుల్లో అద్భుతమైన మార్పులు జరిగి సరికొత్తగా ఉద్భవించాడు. మానవ జాతిని సమూలంగా నాశనం చేయడమే వీడి పుట్టుక లక్ష్యం. ప్రపంచమంతా పాకుతూ పోయి మొత్తం అన్ని దేశాల్లోని మనుషులందరినీ మట్టుపెట్టేస్తాడు."

"ఆ... ఎన్నాళ్ళులే. నూరేళ్ళ క్రితం నేనూ ఇలాగే మిడిసి

పడ్డా. పోయినోళ్ళు పోయినా మళ్ళీ నా అంతు చూసిందాకా మనుషులు వదల్లేదు. అసలీ విశ్వంలో మనిషిని మించిన ప్రమాదకరమైన జంతువు మరొకటి లేదు. ప్రకృతిని, సమస్త జీవరాశులనీ తన అధీనంలో ఉంచుకొని, మొత్తం సర్వనాశనం చేసేస్తున్నాడు." స్పానిష్ ఫ్లూ వైరస్ పెదవి విరిచింది.

అప్పటి దాకా అందరినీ పరిశీలనగా చూస్తూ ఉన్న న. కొ. (నవీన కొరోనా) నోరు విప్పాడు.

"అందుకే కదా నేనుద్భవించాను. నన్ను నాశనం చేయాలంటే ముందు నన్ను అర్థం చేసుకోవాలి గదా. ఈలోపల నేను నానో నుంచి విశ్వరూపం చూపించనూ. చూస్తూ ఉండండి, నా దెబ్బకు మనుషులు ఎలా గిలగిలలాడిపోతారో. తమకంటే గొప్పవాళ్ళు లేరని గప్పాలు కొట్టుకునే వాళ్ళు, సంఘజీవులమని చాటుకునే హిపోక్రాట్లు వాళ్ళ అసలు రూపాలు బయట పెట్టుకుంటారు. ఒకరినొకరు ముట్టుకోవడానికే భయపడేలా చేస్తాను. నేనసలే వరం పొంది (జన్యు మార్పిడి జరిగి) పుట్టిన వాణ్ని, నన్నంతం చేయడం అంత సులువు కాదు." న.కొ. వొళ్ళు విరుచుకొని ప్రపంచ యాత్రకు బయలుదేరాడు ఓ ముసలి వైరస్ తోడుగా.

◆◆◆

ఒక మనిషి నుంచి మరో మనిషికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి విస్తరిస్తూ, దేశాలన్నిటినీ కబళిస్తూ జైత్రయాత్ర చేస్తున్నాడు న.కొ. ఆవురావురుమంటూ జనాన్ని ఆవాహనం చేసుకుంటూ కదులుతున్నాడు. మానవజాతి కొత్తగా తమకు వచ్చిన ప్రమాదాన్ని గుర్తించింది గానీ, దాన్ని ఎలా అధిగమించాలో అర్థం కాలేదు. చిన్న చిన్న దేశాలను గడగడలాడించిన 'మెగా' రాజ్యాలన్నీ 'మైక్రో' ప్రాణి దెబ్బకు ఉసూరుమని ఊపిర్లొదులుతున్నాయి. కనిపించని ఈ కొత్త శత్రువుతో పోరాటం ఎలా చేయాలో తెలియని మనుషులు కనీసం కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్దామని నిర్ణయించుకొని తలుపులు బిడాయించుకున్నారు.

హేమంతరుతువు చివరి చలి దినాల్లో రెక్కలు కట్టుకుని భరత ఖండంలో దేవుని స్వంత భూమిపై అడుగు పెట్టాడు న.కొ. ప్రమాదాన్ని గుర్తించిన కొందరు పాలకులు పూర్వానుభవం వల్ల కాస్త జాగ్రత్త పడ్డారు. మిగతా ప్రాంతాల్లో ప్రజలు మాత్రం విలవిల్లాడిపోతున్న దేశాలను చూసి విస్తుపోయారు, జాలిపడ్డారు, నవ్వుకున్నారు.

"మన వేడికి ఏ వైరస్సూ ఏమీ చేయదు." "మనకు ఇమ్యూనిటీ చాలా ఎక్కువ, మన జోలికి ఏ వైరస్సూ రాదు, తెల్లోళ్ళు శుద్ధ వేస్టు" ఇలా సాగుతున్నాయి జనాల ఆలోచనలు.

షేక్ హ్యాండులిచ్చుకోటాలూ, కౌగిలించుకోటాలూ మన సంప్రదాయం కాదంటే విన్నారూ...? మర్యాదగా నమస్కారం అని చేతులు జోడిస్తే ఎంత సంస్కారం! వైరస్లే కాదు, ఏ దుమ్మూ, ధూళీ మనల్నంటుకోవు.'' దీర్ఘాలు తీశారు సంప్రదాయవాదులు.

అంత ధీమాగా ఉన్నా విమానాల్లో సెలెబ్రిటీల రూపంలో ఎగిరొచ్చిన న.కొ.ముసిముసినవ్వులు నవ్వుకుంటూ అక్కడ కాస్త, ఇక్కడ కాస్త అవకాశం చూసుకొని పాగా వేశాడు. ప్రమాదాన్ని పసిగట్టిన నాయకులు పరిస్థితి దాటిపోకూడదని మొత్తం లాక్ డౌన్ ప్రకటించి, ప్రజలను ఇళ్ళకు పరిమితం చేశారు. రోడ్లు, రైళ్ళు సమస్తం బందయి, నగరాలు కొత్త ఊపిర్లు పీల్చుకుంటున్నాయి. మనిషి తప్ప మిగిలిన అన్ని ప్రాణులు స్వేచ్ఛా విహారం మొదలెట్టాయి.

మహమ్మారిని తరిమికొట్టేందుకు ఓ సాయంకాలం దీపాలు పెట్టమని కోరారు ఏలికలు. వీర విధేయులైన ప్రజలు బాణసంచా కూడా పేల్చి, విధేయతను చాటుకున్నారు. గంటలు మోగించమనీ, ఆ శబ్దాలకు సూక్ష్మజీవి పారిపోతుందనీ కూడా పిలుపునిచ్చారు. ప్రజలు మరికొంత ముందుకెళ్ళి గుంపులుగా చేరి, తప్పెట్లు మోగించి, రంగులు చల్లుకొని ఆనంద తాండవం చేశారు విజయం సాధించినట్లు. తనకు ఘనంగా ఆహ్వానం పలుకుతున్న జనాలను చూసి న.కొ. బిగ్గరగా నవ్వాడు.

నెల రోజులు గడిచేసరికి ఊపిరాడని జనం మెల్లగా తాళాలు తెరచుకున్నారు. సమస్య తీవ్రత అర్థం చేసుకోలేక. మరోపక్క జరుగుబాటు లేక బీదాబిక్కీ విలవిలలాడారు. బతుకుతెరువు కోసం వలసలు పోయిన కూలిజనం బతికుంటే బలుసాకైనా తిందాం. చావోబతుకో సొంతూర్లోనే తేల్చుకుందాం అంటూ కాళ్ళను నమ్ముకొని హైవేల బాట పట్టారు. ఆదాయాలు తగ్గిన ప్రభుత్వాలు "మరో దారి లేదు, మందుతోనే లోటు పూడ్చుకుందామం"టూ మద్యం షాపుల షట్టర్లు తెరిచారు. నలభై రోజులు ఉగ్గబట్టుకోనున్న మందుబాబులు బజార్లెక్కి, కిందామీదా పడ్డారు. అంతా తను అనుకున్నట్టే జరుగుతున్న వైనం చూసి న.కొ. ఏ మాస్కూ లేకుండానే వికటాట్టహాసం చేశాడు. దెబ్బకు వందల కేసులు

వేలయ్యాయి, వేలు లక్షలయ్యాయి. కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రభుత్వాలు కొత్త మార్గం కనిపెట్టాయి. "టెస్టులు చేయవద్దం"టూ హుకుం జారీ చేశాయి. రోగమొస్తే వెతికి పట్టుకొని ద్వీపాంతర వాసం (ఐసోలేషన్) పంపిన రోజులొదిలేసి, ఇంట్లోనే ఉంటూ కషాయం తాగమని సలహా ఇచ్చాయి.

రెన్నెల్ల క్రితం జాలిపడిన ప్రజలు ఇప్పుడు ద్వేషించడం నేర్చుకున్నారు. "ఆ సందులోకి వెళ్ళొద్దు." "ఆ ఇంట్లో వాళ్ళతో మాట్లాడొద్దు." "వీళ్ళని ఇంట్లోకి రానివ్వొద్దు." "వాళ్ళని ఈ బజర్లోంచి తరిమేయాలి." ఒకరిని చూస్తే మరొకరికి అనుమానం.. భయం.. ఆందోళన.

జరుగుతున్న విచిత్రాలన్నీ చూస్తూ తెలుగు రాష్ట్రాలలో విహంగ వీక్షణం చేస్తున్నాడు న.కొ. తన తాతతో కలసి.

♦♦♦

నాలుగొందలేళ్ళ చరిత్ర గలిగిన భాగ్యనగరం. జాతిపిత పేరు మీదున్న సర్కారు దవాఖానాలో మహమ్మారిపై పోరాడిన వైద్యులు, ఇతర సిబ్బంది మీద గగనతలం నుండి పూల జల్లులు కురుస్తున్నాయి. ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ సతీష్‌కు వారం రోజుల నుంచి నిద్రలేదు. మరొక డాక్టరుకు డ్యూటీ బదిలీ చేసి, తన గదిలోకి వెళ్ళి, మొత్తం రక్షణ కవచం తొలగించి, శుభ్రంగా స్నానం చేసి ఇంటికి చేరాడు. ఇంటి ఓనరు బయటే కాచుక్కూచున్నాడు.

"ఇదుగో డాక్టరూ, నువ్వు ఇంట్లోకి రావటానికి లేదు. కాదూ, కూడదు అంటే ఇల్లు ఖాళీ చేయండి." తెగేసి చెప్పాడు.

"నేను అన్ని జాగ్రత్తలు తీసుకొనే వచ్చానండి. మొత్తం పి.పి.ఇ. కిట్లు అక్కడే వదిలేసి, శుభ్రంగా స్నానం చేసి వచ్చానండి." సతీష్ బతిమాలుకుంటున్నాడు.

"అదంతా కుదరదయ్యా. నువ్వు రావడానికి వీల్లేదు, అంతే." మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. చోద్యం చూస్తున్న ఇరుగూ పొరుగు నోరు కూడా విప్పలేదు. లోపలి నుంచి కళ్ళ నీళ్ళు నింపుకొని తొంగి చూస్తున్న భార్యనూ, గుక్కపెట్టి ఏడుస్తున్న నాలుగేళ్ల పసివాణ్ణి దూరం నుంచే చూసి, అలాగే వెళ్ళిపోయాడు సతీష్ భారంగా.

"చూశావా తాతా, తమ ఆరోగ్యం కోసం ప్రాణాలకు తెగించిన వైద్యుల పట్ల జనాల ధోరణి." న.కొ. నిట్టూర్చి తాతతో సహా కదిలాడు.

♦♦♦

ఆంధ్ర రాష్ట్ర సాంస్కృతిక రాజధాని, నవ్యాంధ్ర నవ రాజధానికి సమీప నగరం విజయవాడ వినువీధుల్లో తేలారిద్దరూ.

అరవై అయిదేళ్ళ అలివేలమ్మ కంకిపాడులో కూరగాయలమ్ముకుంటూ జీవిస్తోంది. కొడుకు చిన్నతనంలోనే భర్త చనిపోవడంతో, ఒంటరిగానే కొడుకును పెంచి పెద్ద చేసి, పెళ్లి చేసింది. కొడుకూ, కోడలూ రెడీమేడ్ గార్మెంట్స్ దుకాణం నడుపుకొంటున్నారు. పదిహేను రోజుల క్రితం బైక్ మీద వెళ్తుండగా యాక్సిడెంటయి తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు కొడుకు. ప్రభుత్వాసుపత్రి కోవిడ్ సెంటర్ కావడంతో ఐదు రూపాయల వడ్డీకి అప్పు చేసి మరీ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించింది. ఖర్చు తడిసి మోపెడయింది గానీ మనిషి దక్కలేదు. కొడుకుకు అంత్యక్రియలు జరిపించడానికి అయిన వాళ్ళందర్నీ ఆశ్రయించింది అలివేలమ్మ. సొంత అన్న మొహం మీదే తలుపేసుకున్నాడు. ఇరుగు పొరుగు అసలు వీధిలోకి బాడీ తీసుకు రావడానికి వీల్లేదన్నారు.

"నా కొడుకు యాక్సిడెంటయి చనిపోయాడు, కరోనా లేదు, కనికరం చూపండ"ని మొత్తుకున్నా ఎవరూ దయచూపలేదు. ఏడ్చి ఏడ్చి అలివేలమ్మ గుండెలవిసి పోయాయి. కొడుకు అనాథ శవంలా పడుండటం చూడలేక, తనూ కృష్ణా నదిలో శవమై తేలింది.

"బంధాలూ, అనుబంధాలూ అన్నీ బూటకాలని నిరూపించుకున్నారు కదా జనాలు. కొంచెం కూడా సానుభూతి లేదు. ఎవరెట్లపోతే మనకేం, మనం క్షేమంగా ఉంటె చాలు అనుకునే స్వార్థపరులు." వైరస్ తాత ఈసడించుకున్నాడు.

"సర్లే తాతా... నే చెప్పా కదా, మనుషుల అసలు రంగు బయట పెడతానని. మరి బయల్దేరదామా?"

♦♦♦

విజయపురి నుంచి అమరధామంలా విలసిల్లే రాజమహేంద్రికి చేరుకున్నారు.

పేరుగాంచిన ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది పార్వతి. సంవత్సరం క్రితం శివను ప్రేమించి, పెద్దలందరినీ ఎదిరించి పెళ్లి చేసుకుంది. శివ చిన్న ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. లాక్ డౌన్ పుణ్యమాని ఆసుపత్రి మూసేసి, డాక్టర్లు క్షేమంగా ఇంట్లో సేద తీరారు. సిబ్బందికి పనీ లేదు, జీతమూ లేదు పొమ్మన్నారు. అటు శివకూ ఉద్యోగం పోయింది. ఇన్నాళ్ళూ దాచిపెట్టుకున్న సేవింగ్సన్నీ ఖర్చయిపోయాయి.

ఇక ఎన్నాళ్ళిలా అనుకుంటూ మార్కెట్ నుంచి కూరగాయలు తెచ్చి తమ వీధిలో అమ్మడం మొదలుపెట్టాడు శివ. ఓ రోజు చిన్నగా జ్వరం మొదలై, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలు కనిపించాయి. పార్వతి ఎందుకైనా మంచిదని కోవిడ్ టెస్టు చేయిద్దామంది. శివ భయపడి పోయాడు ఆ మాట వినగానే.

"నాకే టెస్టు వద్దు." ముడుచుకున్నాడు.

"అలా అనొద్దు. ఇదేమీ భయపడాల్సినంత జబ్బు కాదు. నేను కూడా మీతో పాటు టెస్ట్ చేయించుకుంటాను." పార్వతి ఒప్పించింది.

ఇద్దరూ టెస్ట్ చేయించుకున్నారు. ఆమె భయపడ్డట్టే శివకు పాజిటివ్ వచ్చింది. అయితే గుడ్డిలోమెల్ల పార్వతికి నెగటివ్ రావడం. శివకు నచ్చజెప్పి108 కు ఫోన్ చేసింది. ఎన్ని సార్లు చేసినా అంబులెన్స్ రాలేదు. ఇరుగుపొరుగు అసహనంగా "ఏందమ్మా ఇది, ఎంత సేపని ఇక్కడే పెట్టుకుంటారు? ఎలాగోలా పంపించాలి కదా!" ఒత్తిడి చేశారు. ఈలోగా అక్కడికి చేరుకున్న ఆరోగ్య కార్యకర్తకు చెత్తను తీసుకెళ్ళే మునిసిపాలిటి బండి కనిపించింది. "ఏమీ అనుకోవద్దమ్మా, వీళ్ళు నన్ను ఇబ్బంది పెడుతున్నారు. నాకు ఇంత కంటే మార్గం లేదు." అంటూ మునిసిపల్ వర్కర్స్‌ను పిలిచి శివను చెత్త బండి ఎక్కించబోయింది. "ఏంటిది, చెత్తను మోసుకెళ్ళే బండ్లో పేషంటును తీసుకెళ్తారా? ఇదేమన్యాయం? అంబులెన్సు లేకపోతే ఇంట్లోనే ట్రీట్మెంట్ ఇప్పిస్తాను. అంతే కానీ చెత్త బండ్లో తీసుకెళ్లడానికి లేదు." పార్వతి అడ్డు పడింది. "ఏందమ్మా బలే చెప్తున్నావు? రోగమొచ్చి మీద బడితే కూడా జనాల మధ్యలోనే ఉండాలా? అదంతా కుదరదు, పంపించాల్సిందే." బలవంతంగా చెత్త బండిలోకి ఎత్తేయించారు శివను పార్వతి ఏడుస్తున్నా వినకుండా.

"ఆఖరికి తోటి మనిషిని కూడా చెత్త బండ్లో ఎత్తి పారేయడమే. ఏం మనుషులు తాతా వీళ్ళు?" న.కొ.తాతతో అన్నాడు.

"మనుషుల సంగతి అటుంచుమనవడా! కనీసం అంబులెన్సు కూడా సమకూర్చలేని సర్కార్లను ఏమనాలి?" తాతమనవడితో పాటు రాయలసీమ వైపు కదిలాడు.

♦♦♦

రాయలేలిన రతనాల సీమ రాయలసీమ. ప్రస్తుతం పిలిస్తే పలుకుతుందట కరువు. పిలవకుండానే వచ్చేది అనంతపురానికి. ఆ అనంతపురం జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ కాలనీలో...

ఇళ్ళల్లో పాచిపనులు చేస్తూ పొట్టపోసుకుంటోంది ఖైరున్నీసా. కట్టుకున్నవాడు దగాచేసి, ఇంకో పెళ్లి చేసుకుని వెళ్ళిపోతే, అష్టకష్టాలు పడి ఇద్దరాడపిల్లలను పెంచి పెద్ద చేసి, పెళ్ళిళ్ళు చేసింది. ఇప్పుడు నెలలు నిండిన చిన్న కూతురు పర్వీన్ ప్రసవానికి ఇంటికొచ్చింది. అప్పటికే తనుంటున్న కొట్టంలో తనతో పాటు సూర్యచంద్రులు కాపురముంటున్నారు. ఇప్పుడు చినుకులు కూడా తోడయ్యాయి. మూడు రోజుల నుంచీ ఖైరున్నీసాకు ఒకటే దగ్గూ, జ్వరం. ఆరోగ్య కార్యకర్త పట్టుబట్టి కోవిడ్ టెస్టు చేయించింది. మూడు రోజుల తర్వాత ఫలితం పాజిటివ్‌గా తేలింది. అంబులెన్సు కోసం ఫోన్ చేస్తే సాయంత్రానికి వచ్చింది. కానీ ఆస్పత్రిలో చేర్చుకోవడానికి బెడ్ లేదంటూ చేర్చుకోమన్నారు. చివరికి వాళ్ళనూ, వీళ్ళనూ పట్టుకొని చెప్పిస్తే, బత్తలపల్లి ఆస్పత్రికి తీసుకెళ్ళారు.

మరోపక్క నెలలు నిండిన పర్వీన్ ఒక్కసారిగా నొప్పులు మొదలై కూలబడి పోయింది. పర్వీన్ అక్క నసీమా ఆటోలో పర్వీన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్ళింది. ఆసుపత్రిలో మొత్తం కరోనా కేసులు నిండిపోయి, పర్వీన్‌ను పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ఆస్పత్రి గేటు దగ్గరే దాదాపు ఆరు గంటలు నరకయాతన అనుభవించినా ఏ ఒక్కరూ వచ్చి చూసిన పాపాన పోలేదు. నొప్పులు తీవ్రమయ్యే సరికి, చుట్టుపక్కలున్న ఆడవాళ్ళు దుప్పట్లతో చుట్టుకుంటే, పర్వీన్ గేటు దగ్గరే మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ పుట్టాక వాళ్ళూవీళ్ళూ గొడవ చేస్తే అప్పుడు సిబ్బంది వచ్చి ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ఆశ్చర్యకరంగా పర్వీన్‌కు, పుట్టిన బిడ్డకూ కరోనా సోకలేదని పరీక్షలో తేలింది. రెండో రోజు ఆసుపత్రి నుంచి డిశ్చార్జయి బిడ్డనెత్తుకొని పర్వీన్ అక్కతో పాటు ఇంటికొస్తే, ఇరుగుపొరుగు వీధిలోకి రావడానికి వీల్లేదన్నారు. భర్త కనీసం బిడ్డను చూడటానికొచ్చూడా రాలేదు. కబురు పెడితే ఇంటికి తీసుకెళ్ళే సమస్యే లేదన్నాడు.

"తల్లి నుంచి బిడ్డకు రాలేదని గ్యారంటీ ఏంది? మళ్ళా మా ఇంట్లో వాళ్ళకు అంటుకుంటే యెట్లా? ఆడనే ఎట్లన్నా సావండి. నాకు సంబంధం లేదు" భర్త మాటలతో నోట మాట రాలేదు పర్వీన్‌కు.

నసీమా తన ఇంటికి తీసుకెళ్దామంటే ఆమె భర్త అప్పటికే మండిపడుతున్నాడు. "నీ చెల్లెల్ని తెచ్చేది కాదు, అసలు నువ్వు కొంపకొచ్చేకి లేదు. నువ్వూ ఆడే పడుండు." ఎగిరాడు భార్య మీద.

"సునోజీ... మాయమ్మకే గానీ, మాకెవరికీ ఏ రోగమూ అంటుకోలేదు. పాపం చంటిబిడ్డ నేసుకొని యాడకని పోతుంది పర్వీన్." ఫోన్లోనే బతిమాలిందామె.

"నువ్వూ, నీ చెల్లెలు యాడన్నా సావండి." ఫోన్ పెట్టేశాడు.

దిక్కుతోచని పర్వీన్ వీధిలో చంటిబిడ్డనెత్తుకొని అలాగే నిలబడింది.

"ఎంత వైపరీత్యం? కనీసం చంటి బిడ్డను, పచ్చి బాలింతనైనా చూడకుండా వీధిలో నిలబెట్టిన వీళ్ళు మనుషులేనా?" న.కొ. చీదరించుకున్నాడు. .

"అసలు మనుషుల తీరే అంత. సృష్టిలో ప్రతి జీవీ తనతో పాటు, తన జాతి సంక్షేమాన్ని కోరుతుంది. ఇతర జీవుల ఉనికినీ కాంక్షిస్తుంది. అన్ని జీవరాశులూ ఆకలి తీర్చుకోవడానికి మాత్రమే ఇతర జీవులను భక్షిస్తాయి. ఒక్క మనిషి మాత్రమే ఆధిపత్యం కోసం, ఆనందం కోసం ఇతర జీవులను వేధించేది, వేటాడేది. చివరికి తన జాతి జీవుల మీద కూడా ఆధిపత్యం కావాలనుకుంటాడు. కులం పేరుతో ఆధిపత్యం, మతం పేరుతో ఆధిపత్యం, ప్రాంతీయ ఆధిపత్యం, చిన్న దేశాల మీద పెద్ద దేశాల ఆధిపత్యం, స్త్రీల మీద పురుషుల ఆధిపత్యం, బలహీనుడి మీద బలవంతుడి ఆధిపత్యం. మొత్తమ్మీద పరస్పర సహకారం కాకుండా, ఆధిపత్యంలో ఆనందాన్ని పొందేది మనిషి మాత్రమే. అసమానతలే ప్రకృతి సిద్ధమని నమ్మేది ఈ సృష్టిలో మనిషి మాత్రమే." తాత మానవ నైజాన్ని విప్పి చూపించాడు.

"అసలు 'మానవత్వం' అనే మాటను తీసేసి, 'ప్రాణితత్వం' అనాలి." కుండబద్దలు కొట్టాడు న.కొ.

"సరేగానీ, ఆ బిడ్డ పరిస్థితేంటిప్పుడు?" తాత ముఖంలో ఆందోళన.

"చూద్దాం ఏం జరుగుతుందో?" న.కొ. కూడా ఆసక్తిగా చూస్తున్నాడు.

"ఎక్కడుండాలి? ఏంజేయాలి? యా అల్లా...!" ఏడుస్తోంది పర్వీన్. ఎటూ పాలుపోని అక్కకు చెల్లెల్ని ఎలా ఊరడించాలో అర్థం కాలేదు. ఉన్నట్టుండి ఓ బొంగురు గొంతు...

"ఎవర్రా ఈ సందులో వద్దనింది? మీకేమన్నా బుద్ధుందా? చంటిబిడ్డనూ, బాలింతనూ వానలో నిలబెడ్తారా? వాళ్ళింట్లోకి వాళ్ళను పోనిచ్చేకేమి?" జనాలకు చీవాట్లు పెట్టిందామె. ఎన్నో సార్లు తాము హేళన చేసిన, అసహ్యించుకున్న ఆమె కాని 'ఆమె.'

"నీకేం ఎన్నయినా చెప్తావు. వాళ్లమ్మకు కరోనా వచ్చింది. వీళ్ళకు పరీక్షలు సరిగ్గా చేసినారో లేదో ఎవరికీ తెల్సు. మా పిల్లాజెల్లా ప్రాణాలు కూడా మేం చూసుకోవాల గదా. నీ కంటే పిల్లా, జెల్లానా? మొగుడూ మొటిక్కాయనా?" ఒక గొంతు లేచింది.

"ఏం చస్తామని భయమా? నాకేం బయం లేదు. నా ఇంట్లో ఉంటుంది. ఏమ్మా ఉంటారా నా ఇంట్లో?"

ఆమె పెద్దమనసు చూసి సిగ్గుతో చితికి పోయారు నసీమా, పర్వీన్. చేతులు జోడించి ఇంట్లోకి నడిచారు.అది చూసిన ఓ ధైర్యవంతురాలు తన ఇంట్లోంచి రగ్గులు తెచ్చి ఇచ్చింది. బరుగొడ్లున్న రామయ్య పాలు కాచి తెచ్చిచ్చాడు. మరో ఇంట్లో చంటిబిడ్డ ఉంటే బట్టలు తెచ్చిచ్చారు. ఇంకో ఇంట్లో నుంచి భోజనం వచ్చింది.

ఆ దృశ్యం చూసి నవ్వాడు న.కొ. "ఏమిటి నవ్వుతున్నావు? అక్కడెక్కడా లేని మానవత్వం ఇక్కడే కనిపించిందనా?" నవ్వుతున్న మనవడిని ప్రశ్నించాడు తాత.

"అయ్యో అదికాదు తాతా. అక్కడ కూడా మానవత్వం ఉంది. లేకపోతే డాక్టర్ సతీష్ ప్రాణాలకు తెగించి ఎందుకు పనిచేస్తాడు చెప్పు. విజయవాడలో అయిన వాళ్ళందరూ అనాథ శవాలుగా వొదిలేస్తే, కఠినాత్ములుగా పేరుపడిన పోలీసులు తల్లీకొడుకుల శవాలకు అంత్యక్రియలు జరిపారు. వీళ్ళందరూ మంచి వాళ్ళే. క్రూరమైన ప్రవర్తన అక్కడా, ఇక్కడా కూడా ఉంది. అసలు ఈ మనుషులు ఇలా తయారైంది చుట్టూ ఉన్న వ్యవస్థ వల్లనే కాదూ.

గొప్పగా జబ్బలు చరుచుకొనే పే...ద్ద దేశాలలో ప్రజల ఆరోగ్యం పట్టించుకునే దిక్కు లేక ఎవరి బాగు వారు చూసుకోవాల్సిన పరిస్థితి. ఆ వ్యవస్థ మొత్తం డొల్లేనని రాలుతున్న శవాలు చెబుతున్నాయి. తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడానికి, తమ కుర్చీలు పదిలపరచుకోవడానికి విజన్లు పెట్టుకున్నారే గానీ, ప్రజల సంక్షేమం గురించి గానీ, ప్రకృతి పరిరక్షణ గురించి గానీ ఏ దూరదృష్టీ లేదు అధినేతలకు. ఆరోగ్యం గురించి ప్రజలను చైతన్యపరచి, ధైర్యం చెప్పాల్సింది పోయి డప్పు కొట్టమని, దీపాలు పెట్టమని జనాలను పిచ్చోళ్ళను చేస్తుంటే, ఇట్లకాక ఇంకెట్ల తయారవుతారు జనాలు? ఫ్రంట్ లైన్ వారియర్లకు

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం ఆగస్టు 2020 పురస్కారాలు

**బొమ్మ**
కథకు: రూ.500/-
రచయిత : వేణు మరీదు

**నిశ్శబ్ద బీభత్సం**
కవితకు : రూ. 500/-
రచయిత : శ్రీనివాసరాజు పెన్మెత్స

■■■

*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం, చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

*- ఎడిటర్*

రక్షణ కల్పించడం పోయి పూలు జల్లి చేతులు దులుపుకోవడం హిపోక్రసీ కాదా. ప్రజారోగ్య వ్యవస్థను చక్కదిద్దడం, ముందుండి పని చేస్తున్న సిబ్బందికి తగు సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. ఇవేవీ చేయరు. ఎందుకంటే ఇవి అసమానతలను పెంచి పోషించే ప్రభుత్వాలు.'' ఆయాసంతో ఆగాడు న.కొ.

“కానీ మనవడా, ఇంత సంక్షోభంలోనూ ప్రజల ఆరోగ్యం మీద శ్రద్ధ కలిగిన చిన్న దేశాలు జాగ్రత్తలు తీసుకొని నిన్ను గెలిచాయి చూశావా? అక్కడితో ఆగకుండా ప్రపంచంలో ఎక్కడ ఆపద ఉన్నా వైద్య సహాయం అందించి, తమ పెద్ద మనసు చాటుకున్నాయి.''

“అవును తాతా. వసుధైక కుటుంబమనే మంచి ఆలోచన గలిగిన చోట నేనోడిపోయాను.''

“అదిసరే గానీ, ఒకే ఇంట్లో తల్లిని అంటుకున్నావు, బిడ్డనూ, ఆమె బిడ్డనూ ఎందుకు వొదిలేసినట్లు? అయ్యో పాపం అనిపించిందా?'' తాత ప్రశ్నను మధ్యలోనే అడ్డుకున్నాడు న.కొ.

“లేదు తాతా. పర్వీన్‌లోనూ నేనున్నాను. కాకపోతే కనిపించలేదంతే. మానవ జాతి స్త్రీకి ప్రసవం పునర్జన్మ అంటారు కదా, ఆ పునర్జన్మలో కొన్ని అనుకోని మార్పులు జరిగి, తల్లిలో నా ఉనికి తేలలేదు. ఇక బిడ్డంటావా, మ్యుటేషన్స్ మనకేగాదు, మనుషుల్లో కూడా జరుగుతాయి. ఆ రకంగా ఆ పసిబిడ్డ నా ప్రభావాన్ని తట్టుకునే జన్యువులతో పుట్టాడు. వాడేకాదు, ముందు ముందు మనుషుల్లో ఇలాంటి మార్పులు జరిగి నాతో చక్కగా సహజీవనం చేయగల ఆరోగ్యమైన మానవజాతి ఉద్భవిస్తుంది.''

“అంటే వోటమినొప్పుకొని ఇక తప్పుకోబోతున్నావా?'' న.కొ. మాటలతో తాత అసంతృప్తిగా అడిగాడు.

“లేదు లేదు. అప్పుడే ఎలా వొదులుతాను? ఇంకా ఎన్నో పరిణామాలు జరగాలి. కేవలం మనుషుల శరీరాల్లో జన్యు మార్పులు వస్తే సరిపోదు. మనుషుల మధ్య సంబంధాల వ్యవస్థలోనూ, ప్రకృతితో సంబంధాల్లోనూ కూడా ఉత్పరివర్తనలు జరగాలి. సకల జనుల సౌభాగ్యంలోనే ఒక వ్యక్తి క్షేమం ఉందనే వసుధైక కుటుంబ భావన రావాలి. అన్ని రకాల అసమానతలు అంతరించిపోయే సరికొత్త సమాజం ఉద్భవించాలంటే ఎన్నో మ్యుటేషన్స్ జరగాలి, జరుగుతాయి. అప్పుడు మనిషి తోటి మనుషులతోనే కాదు, సమస్త జీవరాశులతోనూ ప్రేమగా ఉంటాడు. అన్ని రకాల అహంకారాలు దిగిపోయే రోజు వస్తుందిలే తాతా. లేదనుకో మళ్ళీ మనం మరో జెనిటిక్ మ్యుటేషన్‌తో అటాక్ చేయమూ. సరేగానీ ఒక్కసారి అటుచూడు, నేనెందుకు నవ్వానో అర్థమవుతుంది.''

పర్వీన్ భర్తనూ, బావనూ ఐసోలేషన్‌కు తరలించడానికి అంబులెన్స్ వచ్చింది. ఇద్దరూ సిబ్బందికి దొరక్కుండా పరిగెత్తుతున్నారు.

“ఇదేం కొసమెరుపు మనవడా? ఏం మాయ చేశావు?'' ఆశ్చర్యపోయాడు తాత.

“ఇది వాళ్ళు చేసుకున్నదే తాతా. కొన్ని రోజుల క్రితం వాడెవడో లారీ డ్రైవరు ఎక్కడెక్కడో తిరిగివచ్చి, బుద్ధిగా హోం క్వారంటైన్ లో ఉండకుండా చతుర్ముఖపారాయణం పెడితే, ఇద్దరూ వెళ్లి పేకాడి, కలిసి సిగరెట్లు తాగి, జల్సా చేశారు. వాళ్ళు పేకాడితే, నేను వాళ్ళతో కబడ్డీ ఆడుకున్నా.'' కొంటెగా కన్నుగీటాడు న.కొ.

◆

కవిత

# మేకిన్ ఇండియా !

- రాధేయ
8247523474

వలస పాలకుల అధిపత్యంపై
భారతీయుల ధిక్కార స్వరం
" క్విట్ ఇండియా"
డెబ్భైనాలుగేళ్ళ మా స్వేచ్ఛానినాద స్వరం
"మేకిన్ ఇండియా"
ఇవాళ స్వచ్ఛ భారత్‌లో మన
ఆత్మ నిర్భరత్వం అభద్రతా వలయాల కలుగుల్లో దూరి
బెరుకు బెరుకుగా చూస్తోంది
శాంతి కపోతం రెక్కలు అలసిపోయి
వాలిపోతున్నాయ్
పుట్టుకతోనే శ్వాసించిన, సంభాషించిన
జీవభాష అమ్మను మమ్మీని చేసి గెంటేస్తోంది
ప్రశ్నించడమే ద్రోహం, నిరసించడమే నేరమైన వ్యవస్థలో
మా అక్షర సూర్యుళ్ళు
నిర్బంధంలో నీరసిస్తూనే సముద్రాల్ని
ఆవాహన చేస్తున్నారు.
ప్రజాస్వామ్య రాజ్యాంగంలో
ప్రతి ఐదేళ్లకోసారి అధికారం మారుతుంది
అధికారంతో పాటు దోపిడీ చేతులు మారుతుంది
మెతుకు చుట్టూ ముళ్ళకంచె నాటి
ఆకలిని ఆకర్షక పథకంలో చేరుస్తోంది.
ప్రపంచ యుద్ధాల్ని, ప్రకృతి విధ్వంసాల్ని
కట్టడి చేయగలిగిన శాస్త్ర సాంకేతిక నైపుణ్యం నేడు
ప్రపంచాన్నే వణికిస్తున్న
ఈ కోవిడ్ వైరస్ ముందు చిన్నబోయి కూర్చుంది.

భయం భయం,
బతుకు భయం
బతుకును మించిన చావు భయం
బతుకు పోరులో అలిసి పోయిన
క్షతగాత్రులంతా క్వారెంటెయిన్‌లో
చేరి రోజులు లెక్కిస్తున్నారు.
చట్టం తనపని తాను చేసుకు పోతుంది
అంతే చిత్త శుద్ధితో కోవిడ్ తన హింసాకాండను
కొనసాగిస్తూనే ఉంది.
నిజం..దేశమంటే మనుషులే..
నిత్యం మట్టిని ముద్దాడే
వెన్నెముకల హరిత శ్వాసలే
చెమట చేతుల, నెత్తుటి చుక్కల
వేలి ముద్రల అస్తిత్వమే
ఈ మట్టి నీళ్లతో కలిసి పండిన
అన్నం మెతుకుల ఆత్మవిశ్వాసమే..

ఎక్కడ నా రేపటి సూర్యుల స్వప్నం సాకారమవుతుందో
నాదేశీయ పరిజ్ఞానం
అన్య దేశాలకు వలసబాట పట్టదో..
ఎక్కడ కుల మత వివక్ష లేని లౌకిక రాజ్యాంగం ప్రజలకు
రక్షణ కవచమై నిలుస్తుందో..
నా ఆత్మగౌరవం నిర్భయంగా
తలెత్తుకు నిలబడుతుందో..
ఎక్కడ నా స్వేచ్ఛా వివేక ప్రవాహం
సేవాభావంతో ఉరకలు వేస్తుందో
నా శ్రమజీవుల రెక్కల కష్టం
గుర్తింపుకు నోచుకుంటుందో..
ఎక్కడ నా కులవృత్తులూ, పనిముట్లూ
కల్సి సహజీవనం చేస్తాయో..
గతించిన మూఢనమ్మకాలను ధిక్కరించి సత్యాన్వేషణ వైపు
నా అడుగులు సాగిపోతాయో..
ఎక్కడ నా జాతీయ గీతం వలసకూలీల
దుఃఖ స్వరం విన్పించదో..
నా భారత నారికి లింగ వివక్ష లేని భయరహిత
స్వేచ్ఛాజీవనం లభిస్తుందో..
ఎక్కడ భౌగోళిక ఎల్లలు లేని
భారతీయ సంస్కృతి గౌరవింప బడుతుందో..
అక్కడే
ఆ స్వర్గ ధామం తొలి మెట్టుపై నిలబడి
ఆ త్రివర్ణ పతాకం ఛత్ర ఛాయల్లో
నా దైన తాత్విక భూమికను
ఆత్మగానం చేస్తాను
సమస్త, సామాజిక, మానవీయ విలువల్తో
జాతీయ సమైక్యతా భావనతో కవితా గానం చేస్తాను
కవిత్వ పతాకమై రెపరెప లాడతాను! ♦

# ఒక విషాద జీవన కావ్యం - పిరదౌసి



- మందరపు హైమవతి
9441062732

*పద్యాన్ని సమాజాభ్యుదయానికి ఒక ఉపకరణంగా వాడుకొన్నాడు జాషువా. పూలమాల లాటి సుతిమెత్తని శైలి ఐనప్పటికీ ధిక్కరించేటప్పుడు, ఆగ్రహ జ్వాలల్ని ఆవిష్కరించేటప్పుడు తన పద్యాల్ని కత్తులుగా చేసాడు.*

'సుకవితా యద్యస్తి రాజ్యేనకిం' మంచి కవిత్వమే వుంటే రాజ్యమెందుకు' అని అన్నారు. రాజ్యం కంటె కవిత్వం గొప్పది. రాజు విగ్రహాల్లో శిలగా నిలిచిపోతే కవి ప్రజల గుండెల్లో నిలిచిపోతాడు. ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని నిలిచిపోయిన కవి జాషువా. అంటరాని కులంలో పుట్టి ఎన్నో అవమానాలు పొందినా తన కవిత్వంతో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. అస్పృశ్యుడని ఈసడించబడిన తెలుగు నేలలోనే గజారోహణాది ఘనసన్మానాలు పొందాడు. నవయుగ కవి చక్రవర్తి వంటి బిరుదులు పొందాడు.

జాషువా ఎన్నో కావ్యాలు రాసాడు. క్రీస్తు చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. పిరదౌసి, గబ్బిలము, ముంతాజ్ మహల్ మొదలైన ఖండకావ్యాలు రచించాడు. జాషువా అనగానే మనకు 'గబ్బిలం' గుర్తుకు వస్తుంది. గబ్బిలంతో పాటు మరో పేరు పొందిన రసవత్కావ్యం పిరదౌసి. ఇతడు పారశీక కవి. 'షానామా' అనే కావ్యాన్ని రచించి గజనీ మహమ్మదుకు అంకితమిస్తాడు. రాజు పద్యానికొక బంగారు నాణెమిస్తానని వాగ్దానం చేస్తాడు.

పిరదౌసి 30 ఏళ్ళు కష్టపడి 60 వేల పద్యాలు రాసి రాజసభలో అందరి ఎదుట ఆ కావ్యాన్ని చదివి రాజుకు సమర్పించి ఇంటికి వెళ్ళిపోతాడు. రాజు బంగారు నాణేలకు బదులు వెండి నాణేలు కవి ఇంటికి పంపిస్తాడు. తన ఆశ నిరాశ ఐనందుకు దిగులుపడి రాజును నిందిస్తూ కొన్ని పద్యాలు రాసి రాజుకు పంపిస్తాడు.

ఆ పద్యాలను చదివిన రాజు కోపంతో కవిని బంధించి చంపమని భటులకు ఆజ్ఞాపిస్తాడు. ఈ విషయాన్ని విన్న కవి భార్యా కూతురుతో ఊరు విడిచి తూసు పట్టణానికి వెళ్ళడానికి నిర్ణయించుకుంటాడు. అడవులు దాటి ఎంతో కష్టపడి పారశీక నగరాన్ని చేరుకొంటాడు.

రాజుగారికి సామంతరాజులు హితోపదేశం చేయడంతో మనసుమారి తాను మొదట అన్నట్లుగా అరవైవేల బంగారు నాణేల్ని పంపిస్తాడు. కానీ కవి అప్పటికే మరణిస్తాడు. రాజభటులు ఆ నాణేలను పిరదౌసి కుమార్తెను తీసుకొమ్మని ప్రార్థిస్తారు. కానీ ఆమె నిరాకరిస్తుంది. ఆ డబ్బుతో మహమ్మదు తూసు పట్టణంలో పిరదౌసి పేరిట ఒక సత్రాన్ని కట్టిస్తాడు. ఇది పిరదౌసి కావ్య ఇతివృత్తం.

పిరదౌసి షానామా కావ్యాన్ని తన శాయశక్తులన్నీ ఉపయోగించి రాసాడని జాషువా కవి అంటాడు. పారశీక గ్రంథాలన్నీ మథించి మధురమైన పదాలను ఏరుకొన్నాడని, లలితమైన అలంకారాలతో కావ్యకన్యకను అలంకరించాడని అంటాడు. ముఖ్యంగా దిరిసెన పువ్వులాంటి మృదువైన శైలితో కావ్యరచనకు ఉపక్రమించాడని అంటాడు.

కవి సందర్భానుసారంగా ఒక్కొక్కసారి మృదు పదాలతో, మరొకసారి గంభీర పదాలతో కావ్యాన్ని రాస్తాడు. దీన్నే 'వసుధ శాసింపగల సార్వభౌముడగును/ ధీరుడగు భిక్షకుండగు దీనుడగును, దుఃఖితుండగు నిత్య సంతోషియగును/ సత్కవి ధరింపరాని వేషములు గలవె'' అని కవిలో గల బహుపార్శ్వాలను వర్ణిస్తాడు.

తెలుగు కవిత్వంలోని మాధుర్యం విదేశీ కవిత్వపు తీరు, ద్రావిడుల కవితా నైపుణ్యం కల గలపి రసబంధుర ప్రబంధంలా షానామాను తీర్చిదిద్దుతున్నాడు పిరదౌసి. ఒకరోజు రాత్రి అతడికి కలలో ఒక స్త్రీ కనిపించి తనను భార్యగా చేపట్టమని అడుగుతుంది. ఆమెనతడు కౌగిలిలో చేర్చుకొంటాడు. అంతలోనే తెల్లారిపోతుంది. ఆ భార్య నుంచి మూడేళ్ళ కూతురు మరణించిందని ఉత్తరం వస్తుంది.

ఇన్ని కష్టాల్లో పిరదౌసి కావ్యాన్ని పూర్తిచేసి రాజు దగ్గరకు వెళ్ళి విషయం చెప్తాడు. రేపు సభా సదుల మధ్య చదవమని అంటాడు. మర్నాడు సుల్తాను కొలువున్న సభలో ప్రవేశిస్తాడు. కదను తొక్కిన గుర్రంలా చక్కని పదాల పొందికతో కూడిన కావ్యం చదివి వినిపించగానే సభలో ఉన్న కవులందరూ రసావేశంతో కదిలిపోతారు. అరమోడ్పు కనులతో పులకించిన శరీరాలతో, ఆ కావ్యామృతపానంతో సభికులందరూ పరవశిస్తారు. కావ్యగానమయ్యాక పిరదౌసి ఇంటికి వెళ్ళిపోతాడు.

పండితులేమి చెప్పారో గానీ రాజ కవి ఇంటికి వెండి నాణేలు పంపిస్తాడు. ఆశ నిరాశ కాగా పిరదౌసి ఆ నాణేలను మళ్ళీ రాజుకు తరలిస్తాడు. రాజును నిందిస్తూ ఉత్తరం రాసి పంపిస్తాడు. ఈ సందర్భంలో రాసిన ఎనిమిది పద్యాలు ఎనిమిది ఆణిముత్యాలు. కవి కలం పలికిన కఠిన నిజాలు.

'ఓ సుల్తాను మహమ్మదూ! కృత్రిమ విద్యుద్దీపాలు నమ్మి ఆశా సౌధాన్ని కట్టుకొన్నాను. కానీ నా ఆశ ఫలించక ఒక దుఃఖలోకంలో మునిగిపోయాను. కత్తులకు మనుషులను బలి ఇచ్చే రాతి గుండె సుల్తానులకు నా కవితామృత ధారల్ని చిందించి నే పావం చేశాను. ఇదంతా నా స్వయంకృతాపరాధం. ఇంక నా జీవితంలో విషాదగీతాలే మిగిలాయి. నా కలంలో కవితా శక్తి నశించింది. అభాగ్యుడనయ్యాను. నా ముప్పై ఏళ్ళ కష్టానికి ఈ నిరాశాపూరిత భాష్పాలే ప్రాప్తించాయి. నేనీ కావ్యాన్ని ఒక్కొక్క పద్యానికి ఒక్కొక్క నెత్తురు బొట్టు తక్కువగా రచించాను. నా శ్రమ అంతా వృథా ఐపోయింది. కులీనుడైన రాజిలా అబద్ధాలు చెప్తాడా? కవితా ఋణం ఇవ్వడా! ఓ గజనీ సుల్తాను ప్రభూ! నిజం తెలుసుకో లేకపోయాను. అల్లా తోడని చెప్పి నా బంగారం లాంటి కావ్యాన్ని వెండితో చెల్లించాలనుకొన్న మోసగాడివి. నీవు పూజిస్తే అల్లాకు కూడా సుఖముండదు. సత్యాన్ని ధిక్కరించని వాడే మనిషి.

నీ కీర్తి ప్రకాశించేలా చక్కని మేడకట్టి, నీ వంశ వృక్షానికి దీర్ఘాయువు పోసాను. వట్టి చేతులతో తిరిగి వెళ్తాను. నా సుఖాలన్నీ అంతరించాయి. చీకటే మిగిలింది. భయంకరమైన దుఃఖ తమాల వనాన్నే నా చిరునామా చేసుకొంటాను. ఓ కఱకు తురుష్క చక్రవర్తీ! మల్లెపూవుటత్తరులు చల్లి బానిసకు అభిషేకం చేసాను. మాయజలతారు వలన బంగారం రాదు గదా! ఈ విశాల భూప్రపంచంలో నా నెత్తిమీద నేనే కన్నీటి నిప్పుల్ని పోసుకొన్నాను.

ముప్పై ఏళ్ళ శ్రమకు నా మనస్సు అలసిపోయింది. ఇక మహమ్మదు రాజులతో సమాధి శయ్యలపై విశ్రమిస్తాను. నా జీవితంలో మనశ్శాంతి లేదు. నీలాంటి అబద్ధాల కోరుకు పండువెన్నెల లాంటి నా కవిత్వం లభించింది."

అని పిరదౌసి రాసిన ఉత్తరాన్ని చదువుకొని, క్రోధారుణ నేత్రాలతో కోడెదూడపై దాడి చేసే పులిలాగా సేనాపతిని పిలిచి పిరదౌసిని పట్టుకొని చంపండని రాజు ఆజ్ఞాపిస్తాడు. "మీ గొప్ప కులాన్ని కించపరచి రాసినట్లుగా ఉన్నాయి ఈ పద్యాలు. చక్కని తెల్లని మల్లెపువ్వు మీద తిరిగి తుమ్మెదలు నల్లరంగును పూసినట్లున్నాయి." అని పిరదౌసి మీద కొందరు పండిత ప్రాయులు చాడీలు చెప్పి ప్రభు భక్తిని నిరూపించుకొంటారు.

ఆ కాలంలోనైనా ఈ కాలంలోనైనా కవుల్లో రెండు రకాలు ఉంటారు. పాలకులకు భజన చేస్తూ వారిచ్చే సత్కారాలను, బిరుదులను పొందేవారు. రాజుల అన్యాయాలను ధిక్కరిస్తూ ప్రజల పక్షాన నిలచేవారు. పోతన 'నా కావ్య కన్యను కూళలకిచ్చి పడుపు కూడు తినన' ని రాజుల్ని ధిక్కరిస్తాడు. 'రాజుల్మత్తుల్ వారి సేవ నరకప్రాయంబు' అని ధూర్జటి వారిని ఈసడిస్తాడు. రాజంటే సాక్షాత్తూ దేవుడే అని భావన చాలా మందికి. 'నా విష్ణుః పృథివీపతిః' అంటారు. రాజు మాటే శాసనం. రాజును ఎదిరిస్తే పుట్టగతులుండవు అని చాలామంది భావిస్తారు. పాలకులు అన్యాయాలు చేసినా, అక్రమాలు చేసినా మౌనంగా వుంటారు. కానీ పిరదౌసి అలా కాదు. బంగారు నాణేలు ఇస్తానని వెండి నాణేలు ఇచ్చేసరికి కడుపు

రగిలిపోతుంది. అవతలివాడు రాజైతేనేమిటి? తన ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేదు. ధైర్యంతో ఎదిరిస్తాడు. టక్కరివి, అసత్యవాదివి, రాతిగుండె ప్రభువు అని తిట్టాడు. అప్పటికే పిరదౌసి ముసలివాడయ్యాడు. రాజును ఎదిరిస్తే శిక్ష తప్పదు అని తెలుసు. కానీ నాకెందుకులే అని మిన్నకుండ లేదు. అన్యాయం చేసిన రాజును దుమ్మెత్తిపోసాడు. జాషువా ఇక్కడ పిరదౌసిలో తనే పరకాయ ప్రవేశం చేసినట్లు కణకణ మండే నిప్పుకణికల వంటి అక్షరాలు రాసాడు. కొరడా దెబ్బల్లాంటి వాక్యాలు రచించాడు. జాషువా కూడా బాల్యం నుంచీ ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. అంటరాని తనం పిశాచం చేతిలో చిక్కి ఎన్నో బాధలు అనుభవించాడు. ఆయన మృదు మధుర కవిత్వం విని పరవశించిన వాళ్ళే ఆయన కులం పేరు చెప్పగానే పారిపోయేవారట. ఈ విషాదమూ, వేదననీ జాషువా కవితాత్మ అని అనవచ్చును.

జాషువా ఈ సందర్భంలో మానవ స్వభావాన్ని బాగా పట్టుకొన్నాడు. భజనపరుల స్వభావాలను చక్కగా ఆవిష్కరించాడు. రాజు పిరదౌసిని చంపమంటాడు. అప్పుడు కొందరు పండితులు “ఈ పాటి కవిత్వం ఎవరైనా రాస్తారు. రాజు ప్రేమతో తృణమో పణమో ఇచ్చినప్పుడు తీసుకోకుండా ఇలా కారుకూతలు కూయడమేమిటి?” అన్నారు. పాపం పండినదేమో కవిని చంపదలచాడు. కవిని చంపడం అమంగళకరం అని ధర్మాత్ములు అన్నారట.

“రాజు తలమీద కవి కప్పురంబు చల్లె/ సుకవి తల మీద రాజు నిప్పుకలు విసరె/ కొందఱే పుణ్యమో చేసుకొనియెననిరి/ కొందరే పాపమో పట్టి కుడిపెననిరి” రాజు తలమీద కవి కర్పూరం చల్లాడు. కవి తల మీద రాజు నిప్పులు కురిపించాడు. కొంతమంది ఏ పుణ్యమో చేసుకొన్నాడని, కొందరు ఏ పాపమో చేసుకున్నాడని అన్నారు. పిరదౌసి అభిమాని మహమ్మదు ఆజ్ఞను పిరదౌసికి చెప్తాడు.

‘ఈ కావ్యం ఒక బెబ్బులి లాగా నా బలాన్ని మింగేసింది. జీవచ్ఛవం లాగా వున్న ఈ ముదివగ్గు సుల్తాను గారి ఖడ్గ దేవతకు రుచిస్తుందో అని బాధపడి, మసీదు గోడపై

‘ముత్యముల కిక్కయైన సముద్రమునను
పెక్కు మారులు మున్కలు వేసినాడ
భాగ్యహీనుడ ముతయమ్మువడయనయితి
వనధి నను మ్రింగ నోరు విచ్చినది తుదకు’

అని పద్యం రాస్తాడు. ముత్యముల పుట్టినిల్లు ఐన సముద్రంలో ఎన్నో సార్లు మునిగాను. ముత్యం దొరక లేదు. సముద్రమే దురదృష్టవంతుడైన నన్ను మింగడానికి నోరు తెరిచింది. ఈ పద్యాన్ని నమాజు చేయడానికి వచ్చిన వాళ్ళందరు శరీరం జలదరించేలా చదువుకొనేవారు.

పిరదౌసి తన భార్యను, కూతురిని తీసికొని ఆ నగరం నుంచి బయటపడతాడు. అడవిలో వెళ్తుండగా ఒక బోయవాడు వచ్చి దారి చూపిస్తాడు. రాజభటులు పిరదౌసి ఉనికిని కనుక్కోలేకపోతారు. రాజు భటులను బంధిస్తాడు. “పిరదౌసికి ఎవరూ ఆశ్రయమివ్వగూడదు. ఇస్తే నాకు వాళ్ళు శత్రువులే” అని ఫర్మానా జారీ చేస్తాడు.

కొంతమంది సుల్తానుతో “కవికి ఇస్తానన్న ధనం మీ హుక్కా ఖర్చుకు సాటిరాదు గదా! ఆలోచించండి” అని అంటారు. ఒకసారి మసీదుకు వెళ్తూ పిరదౌసి గోడల మీద రాసిన ‘కృతి యొక్క బెబ్బులింబలె, ముత్యముల కిక్కయైన – ఈ రెండు పద్యాలు చదువుతాడు. మనసు మారి కవి కివ్వాల్సిన బంగారు నాణేలను బస్తాలకెత్తించి పంపిస్తాడు. కానీ పేదరికంతో కృశించిన కవి దేహం అప్పుడే శ్మశానం చేరుతుంది. డబ్బులు అప్పుడే ఇంటికి చేరతాయి. కూతురు నాకీ డబ్బు వద్దని తిరస్కరిస్తుంది.

ఈ విషయాలు తెలిసిన సుల్తాను పశ్చాత్తాపంతో బాధపడతాడు. తూసు పట్టణంలో పిరదౌసి పేరిట సత్రం కట్టిస్తాడు. పారశీకులు శిథిలమైన ఈ సత్రాన్ని చూచి కన్నీరు పెట్టుకొన్నారని కవికి కీర్తి, సుల్తానుకు అపకీర్తి మిగిలాయి– అని కవి ఈ కావ్యాన్ని ముగిస్తాడు.

ఈ కావ్యం చదవడం ముగించగానే మనసంతా భారమైపోతుంది. పిరదౌసి విషాద జీవితం చదువరుల మీద గాఢమైన ముద్ర వేస్తుంది. ఈ కావ్యంలో పిరదౌసి వ్యక్తిత్వాన్ని, గజనీ మహమ్మద్ కపట మనస్తత్వాన్ని ఫోటో తీసినట్లు వర్ణిస్తాడు కవి. తీయ తేనియలొలుకు తేట తెలుగు పదాలతో కావ్యాన్ని తీర్చిదిద్దుతాడు జాషువా. ద్రాక్షాపాకంతో కూడిన ఈ కావ్యం ఆగకుండా చదివింప చేస్తుంది. సుదీర్ఘ సమాసాలు, జటిల పదాలు లేకుండా కమ్మెచ్చున సాగిన తీగలా సరళమైన శైలి పాఠకులను అలరిస్తుంది.

ఈ కావ్యంలో సందర్భవశాత్తు చేసిన వర్ణనలు చదవడానికి ఎంతో హాయిగా వుంటాయి. పిరదౌసి కుటుంబం రాజు నుంచి తప్పించుకోవడానికి అడవిలో వెళ్తుంటారు. దారిలో కనిపించే ప్రకృతి దృశ్యాలను చూచి పరవశించి ఎన్నో

పదచిత్రాలు చిత్రిస్తాడు. "ఆగడపు మబ్బుశయ్యల నపరశిఖరి/ బుడుత చంద్రుడు నిద్దురవోవుచుండె/ ఈ చెఱువు నీట నతని కుయ్యేలలు గట్టి/ జోల వాడుచు నా వంక జూడనేమి?"

పడమటి దిక్కున మబ్బుల పాన్పు మీద చిన్ని చంద్రుడు నిద్రపోవుచున్నాడు. ఈ చెఱువు నీట్లో అతనికి ఉయ్యాల కట్టి జోలపాడుతూ ఆ వైపు చూడవేమిటి? అంటాడు. చెఱువులో చందమామ ప్రతిబింబం కనిపిస్తుంది. మబ్బుల శయ్య మీద లేత చంద్రుడు ఈ రెండింటిని చూచి కవి ఎంత చక్కని కల్పన చేసాడు. అందుకే కవిని బ్రహ్మ అంటారు. బ్రహ్మ ఈ లోకాన్ని సృష్టిస్తాడు. కవి అద్భుతమైన ఊహా శక్తితో కల్పనలను సృష్టిస్తాడు. అందుకే 'కవి రేవ ప్రజాపతిః' అన్నారు. 'బుడుత చంద్రుడు' ఈ మాట ఎంత ముద్దుగా వుంది. 'ఆగడపు మబ్బుశయ్యలు' ఎంత అద్భుతం!

ఇంకొక చోట 'చెలువమొప్ప బుడమి సృష్టించి మాకిచ్చి/ అనుభవింపుడనుచు నానతిచ్చి/ నిలువనీడలేక నిల్చిన కలనాడ/ కడుపు నిండ నన్ను కన్నవాడ! ఎంతో అందమైన ఈ లోకాన్ని సృష్టించి అనుభవించండి అని చెప్పి నిలువ నీడ లేకుండా చేశావు. నన్ను కన్నవాడా! ఓ భగవంతుడా! అని ఆవేదన చెందుతాడు. కడుపు నిండ నన్ను కన్నవాడ! ఎంత చక్కని తెలుగు నుడికారం.

అడవిలో వెళుతుంటే పులులు మొదలైన క్రూరమృగాలుంటాయి. చీమ చిటుక్కుమంటే భయమేస్తుంది. అలాటి నిశ్శబ్దపుటడవిలో నివ్వరి ధాన్యం కొఱుకుతున్నపుడు ఎలుక మునిపంటి శబ్దానికి ఉలిక్కి పడుతూ వెళ్ళే బాటసారులను దారిలో పడే ఎండుటాకుల సవ్వడి కూడ బెదిరిస్తుందని కొసరినివ్వరి ధాన్యంబు గొఱికి నమలు/ నెలుక మునిపంటి సవ్వడి కులికి పడుచు/ త్రోవ గమియించు నాటి పాంథుల నదేమొ/ అదరి బెదిరించెనొక యెండుటాకు కూడ" అని ఎలుక మునిపంటి చప్పుడును, ఎండుటాకు చప్పుడును ఆ రాత్రి వినిపించి పాఠకుల మనసుల్లో ఉలికిపాటు కలిగిస్తాడు కవి.

ఒక్కపక్క రాజు సైన్యం తనను వెదుకుతూ బయల్దేరింది. అలాంటి భయ సమయంలోనూ తనకు తారసిల్లిన ప్రకృతి దృశ్యాలను చూచి ఆనందించడం మానలేదు. అదీ కవి సౌందర్య హృదయం.

ఈ కావ్యం అంతా కవి గొప్పతనాన్ని, రాజు అల్పత్వాన్ని చిత్రీకరించిన సందర్భాలు ఎక్కువగా ఉంటాయి.

"కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు/ కృతిని జెందువాడు మృతుడు గాడు/ పెరుగుదోటకూర విఖ్యాత పురుషులు/ కవిని వ్యర్థజీవిగా దలంత్రు/ కవిని కన్న తల్లి కడుపు ధన్యం. కావ్యాన్ని పొందిన రాజుకు మరణం లేదు' అంటూ బ్రహ్మదేవుని చెయ్యికి వున్న నేర్పు కవి కలానికి ఉంది కనుక ఈశ్వరత్వం కవికే చెందుతుంది. అతడే పూజనీయుడు. తమ్మిచూలికేలు దమ్మిని గల నేర్పు కవి కలంబునందుకలదు గాన/ నీశ్వరత్వమతనికే చలామణి యయ్యే/ నిక్కువముగ బూజనీయుడతడు" అంటూ గడచిపోయిన క్షణాలను మళ్ళీ వెనకకు తీసుకురాలేము కానీ గడచిన యుగాల చరిత్ర తిరిగి రాయడానికి కవియే సమర్థుడని రాజు చేత చెప్పిస్తాడు. కవి గొప్పతనం తెలిసిన అలాటి రాజే నిజం చెప్పినందుకు కవికి మరణదండన బహుమతిగా ఇస్తాడు. కవి ఎక్కడున్నా సరే చంపండి' అని ఆజ్ఞాపిస్తాడు. కాలం మారినా రాజుల మనస్తత్వం మారలేదు. ఆత్మగౌరవం కల కవుల మార్గమూ మారలేదు.

పాలకులకెప్పుడూ అక్షరం అంటే భయమే. అడుగేస్తే అంగరక్షకుల వలయం. కూర్చున్నా, నించున్నా రక్షక దళాల గొడుగు నీడలు. ఐనా ప్రజల పక్షం వహించే కవులంటే భయమే. రాజ్యం మీద కుట్ర చేసారని ఇప్పుడూ వరవరరావు మొదలైన కవులను చెరసాలలో నిర్బంధించడం చూస్తుంటే పిరదౌసిల యుగం అంతరించలేదని అనిపిస్తుంది.

పద్యాన్ని సమాజాభ్యుదయానికి ఒక ఉపకరణంగా వాడుకొన్నాడు జాషువా. పూలమాల లాటి నుతిమెత్తని శైలి ఐనప్పటికీ ధిక్కరించేటప్పుడు, ఆగ్రహ జ్వాలల్ని ఆవిష్కరించేటప్పుడు తన పద్యాల్ని కత్తులుగా చేసాడు. తుపాకీ తూటాలుగా, గురిచూసి విడిచిన బాణాలుగా పదును పెట్టాడు. అన్యాయాలను అణచివేతలను ప్రశ్నించేటప్పుడు జంకుగొంకు లేక ఎదిరించాడు.

బంగారు నాణెం ఇస్తానని వెండి నాణేలు పంపించినపుడు బెదరకుండ రాజును 'టక్కరివి' నీలాటివాడు అల్లాను పూజింపదగడు అని నిరసించాడు. కవుల గౌరవాన్ని నిలబెట్టాడు. "రాజు మరణించె నొక తార రాలిపోయె/ కవియు మరణించె నొక తార గగనమెక్కె/ రాజు జీవించె ఱాతి విగ్రహములందు/ సుకవి జీవించె ప్రజల నాలుకల యందు" అన్న జాషువా నిజంగా సుకవుల కెల్లా సుకవి. పదము పదములో తెలుగు దనం పరిమళించే జాషువా పద్యాలు తెలుగు భాషాభిమానులు చదవదగినవి. విద్యార్థులు, పిల్లలు వల్లె వేయదగినవి. ఇంత చక్కని తెలుగు పద్యాలుండగా ఇంగ్లీషును పట్టుకొని వేలాడతారెందుకో అర్థం కాదు. కవిత్వం ఉన్నంతవరకు కవిత్వాన్ని చదివే వాళ్ళున్నంత వరకు పిరదౌసి ఉంటుంది. ♦

## కవిత

# చుక్..చుక్ బండీ పోతోంది...!

- పోతగాని సత్యనారాయణ
9441083763



నా దనుకున్న సంపద
నాది కాకుండా పోతున్న వాస్తవం...
నాకు నేనే ఏమీకాని రాజ్యంలో
అంతా నాదనుకునే నాదొక
సొంత గూటిలో వలస బ్రతుకు!
నా దేశపు అద్దం ముందునిలబడి
నన్ను నేను చూసుకున్నప్పుడల్లా
నేను మాత్రమే కానరాని
ప్రజాస్వామ్యానిది
నిలువెత్తు రూపం!!
ఎన్నెన్నో త్యాగాలతో
సాధించుకున్న అస్త్రాలన్నీ
ప్రపంచీకరణ యుద్ధరంగంలో
ఏలికల కుతంత్రాలకు
నిర్వీర్యం గావించబడుతున్న
నేనొక అభినవ శాపగ్రస్త
కుంతీపుత్రుణ్ణి!
ప్రభుత్వ ఫలాలకు నోచుకోక
నోటికాడ ముద్దను మాయం చేస్తున్నా,
పాలక బేహారుల దాష్టీకాలను
మౌనంగా భరిస్తూ
చోద్యాన్ని వీక్షిస్తున్న నిన్నటి ప్రేక్షకుణ్ణి!!
నాది కాని జీవితాన్ని
నిరామయంగా జీవించబడుతున్న
ఈ దేశపు నిర్భాగ్య నాగరికుణ్ణి!!!
మారుతుంది జమానా అనుకొని
నాదికాకుండా పోతున్నది
ప్రజారవాణా అని తెలుసుకొని
కోల్పోతున్న దాన్ని
కాపాడుకోవడానికి
తిరగబడుతున్న
అమాయకుణ్ణి!
అర్భకుణ్ణి!!
అమేయుణ్ణి!!!
అజేయుణ్ణి!
అరుణారుణ ప్రచండుణ్ణి!!
ఒక్కో కొమ్మనీ నరికేస్తున్నా
ఇంకా ఒంటరి దుఃఖమై నిలబడ్డ
చెట్టునయ్యానెందుకు?
ప్రజా సంస్థలన్నింటినీ నడిబజార్లో
బేరం పెడుతున్నా
ఇంకా ఇంకా నిస్తేజంగా
ఉపేక్షిస్తున్నానెందుకు?
పోయినవెన్నో పోగా
రైలుబండి నా లక్ష్యానికి
పరుగుకాకుండా పోతోందని
తెలియగానే
ఇదిగో ఇప్పుడు
నా పిడికిలి కణకణ మండే పొగలు
ఎగజిమ్మే
ఎగరేసిన నిప్పుల జెండా
ఇప్పుడొక పోరుడిగా నా గుండె
లబ్ డబ్ అనికాదు చుక్ చుక్ అని
మోగుతుంది
ప్రజారవాణా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
నా గొంతుక రైలుకూతై నినదిస్తుంది
రైలుబండి ఇక ఎప్పటికీ నాదై
నా ముందు ఆగేదాకా
దూరం దూరం జరుగలేను
ఆగినంక ఎక్కేదాకా పోరుచేయకుండా
నిద్రపోను... ♦

---

# జ్ఞాపకాల సంతకం

- సాంబమూర్తి లండ
9642732008

గడిచిన జీవితమంతా
కాలం పుటల మీద
జ్ఞాపకాల చెరగని సంతకం!
వర్తమానం –
రేపటి జ్ఞాపకాల పూలకొమ్మలకు
నీళ్ళు అందించే చెట్టు వేరు
వేలమైళ్ళ జీవనయాత్రలో
బాల్యం జ్ఞాపకాల తొలి అడుగు
యవ్వనం –
వసంత కోయిల పాడే పచ్చని స్మృతిగీతం
రేణువులు రేణువులుగా జారే
జ్ఞాపకాల పుప్పొడి వృద్ధాప్యం!
రాత్రికి రాత్రే వికసించిన పువ్వులా
కాలం ఒక్కోసారి
అందమైన జ్ఞాపకమై విరబూస్తుంది!
కానీ జ్ఞాపకాలన్నీ
మెయిలొలికే సీతాకోకచిలుకలైతే కావు
కొన్ని జ్ఞాపకాలు
తడుముకున్న ప్రతిసారీ
గుండెల్లో గుచ్చుకునే ముళ్ళకంపలు!
తీపివో చేదువో
కాలాన్ని జ్ఞాపకాలుగా పోగేసుకుంటూ
సాగించే అద్భుత ప్రయాణమేనేమో జీవితమంటే!
జీవితాన్ని జ్ఞాపకాలుగా ముద్రించే
అనివార్య పరిణామమేనేమో మరణమంటే! ♦

విశ్లేషణ

# పాలనా భాషగా తెలుగు
# - సమస్యల మూలాలు - పరిష్కారాలు

- నందివెలుగు ముక్తేశ్వర రావు
9491428078

ఆ మధ్య నేను పుష్పక విమానం సినిమాను చూసాను. ఆ సినిమా మొత్తం మీద ఒక్క సంభాషణ కూడా ఉండదు. అందరూ సైగలతోనే ఒకళ్ళతో ఇంకొకళ్ళు మాట్లాడుతూ ఉంటారు. ఇది ఆ సినిమా నేపథ్యం. తెలుగు సినిమా చరిత్రలో ఇలాంటిది ఒకటే వచ్చింది. తక్కినవన్నీ కూడా సంభాషణలు ఉన్నవే. అంటే దీన్ని చూస్తే మనకు ఏమని అర్థం అవుతుంది? చరిత్రలో ఎప్పుడైనా మనిషి అన్నవాడు ఇలా భాష అన్నదే లేకుండా మనుగడ సాధించాడా అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు, అది ఎప్పుడో ఒకానొక సందర్భంలో తప్ప, సాధారణంగా మానవుడికి అనుక్షణం భాష యొక్క అవసరం ఉంటూనే వచ్చింది. ఈ సందర్భంగా మనం గుర్తుచేసుకోవాల్సిన అంశం ఏమిటి అంటే, మనిషి అంటే గుప్పెడు జ్ఞాపకాలు, కొన్ని ఉద్వేగాలు. తన జ్ఞాపకాలని, తన జ్ఞానాన్ని, తన ఆలోచనల్ని తన ఉద్వేగాలని అన్నింటినీ పంచుకోవడానికి ఉన్నటువంటి ఆధారం భాష. దాంట్లోనే మన కష్టాలు, మన ఇష్టాలు, మన కడగళ్లు, మన సాధక బాధకాలు అన్నీ చెప్పుకుంటాం, ఊపిరి తీసుకుంటాం, ఊపిరినిస్తాం, ఆదరిస్తాం, విసుక్కుంటాం, కసురుకుంటాం. అన్నీ భాషలోనే!

ఈ సందర్భంలో ఈ మధ్య కాలంలో వచ్చిన కొన్ని పరిశోధనలు ఏమి చెప్తున్నాయి అంటే ఇళ్లల్లో ఉండిపోతున్న ఆడవాళ్లు, ముఖ్యంగా చిన్న కుటుంబాలు ఏర్పడటం మొదలుపెట్టిన తరువాత ఇంట్లో ఉండిపోయేటటువంటి ఆడవాళ్లు తరచూ నిస్పృహకి (depression) లోనవుతున్నారు. మనస్తత్వ శాస్త్ర సంబంధమైన ఒక సమస్య ఉత్పన్నం అవుతోంది. దీని గురించి పరిశోధిస్తే ఏ ఇంట్లో అయితే మాట్లాడుకోవడం ఎప్పుడు తరిగిపోతుందో ఆ ఇంట్లో ఇలాంటివి సంభవించవచ్చు. ఎక్కడ మాట్లాడుకోవడం ఉంటుందో, ఎక్కడ మనసు విప్పి ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకుంటూ ఉంటారో అక్కడ నిస్పృహ ఉండటానికి అవకాశం ఉండదు అన్నారు.

అంటే , నేను ఇప్పటివరకు చెప్పిన ఈ అంశాలు గురించి ప్రస్తావించినప్పుడు మానవ జీవితాలని అనుక్షణం శాసించేటటువంటి ఒక ప్రభావవంతమైన సాధనంగా భాషను చూడవచ్చు. కేవలం మాట్లాడుకోవడటానికి భాష అనేది ఒక సెంటిమెంట్ అని కాకుండా, మనిషి యొక్క జీవితాన్ని నడిపించే ఇంధనంగా, చోదకశక్తిగా మనం భాషని అర్థం చేసుకోవచ్చు.

రెండవది పాలన గురించి కూడా ఇక్కడ మనం ప్రస్తావించుకుందాం. మనం పుట్టడానికి ముందు నుంచి కూడా పాలన రంగం యొక్క ప్రభావం భారత దేశంలో ఉంటుంది. ఉదాహరణకి గర్భస్థ దశలోనే మహిళల పేర్లు రాసుకుని శిశువులకు అన్ని దశల్లో ఇమ్మ్యూనిటిని ఉచితంగా లభించేటట్టు చెయ్యడం, ఉచిత ప్రసవం కోసం హాస్పిటల్‌కి వచ్చేటట్టు చెయ్యడం, ఇలా ప్రతి అంశంలోనూ పాలనా రంగం యొక్క ప్రభావం ఉంటుంది. ప్రతి విషయంలో పాలనా రంగం ఏదో ఒక రూపంలో మనల్ని పలకరిస్తూ ఉంటుంది. ఇక్కడ మనం చెప్పదలుచుకున్న అంశం ఏంటంటే, భాష ఎలాగైతే మనం పుట్టినప్పటి నుండి మన జీవితాన్ని ప్రభావితం చేసే అంశమో, ప్రభుత్వపాలన కూడా అలానే మన జీవితాలతో స్పర్శ, సంసర్గము కలిగిన అంశం. అంటే పాలనా – భాష ఈ రెండూ కూడా ప్రజలకు అర్థమయ్యే భాషలో ఉంటే బాగుంటుందా లేదా అన్నది మనం ప్రశ్నించుకోవాల్సిన విషయం అనుకోవచ్చు. పాలన ఎప్పుడు కూడా ప్రజలకు అర్థమయ్యే భాషలో ఉండాలన్న వాదన శాస్త్ర సమ్మతము, లోక హితము.

ఈ ఒక్క అంశం మనకు అర్థమయితే పాలనా భాషకు సంబంధించిన స్వరూపము మనకు అర్థం అయినట్టు భావించవచ్చు.

ప్రస్తుతం మనకి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడినా అధికారభాషా చట్టం రావడానికి పదేళ్ల సమయం పట్టింది. వచ్చిన తరువాత వాటిని అమలు చెయ్యడానికి కావాల్సిన నియమావళిని ఏర్పర్చుకోవడానికి మనకు మరో పదేళ్ల సమయం పట్టింది. మొత్తం మీద మనం పాలనని ప్రజలకు అర్థమయ్యే రీతిలో అమలు చెయ్యలేకపోయాము.

నిజానికి మనకు భారత దేశంలో ఇంగ్లీషు సామ్రాజ్యంలో భాగంగా ఉన్నప్పుడు పరిస్థితులు ఇప్పుడున్నప్పటికన్నా మేలైనవిగా కనపడుతున్నాయి. ఇప్పుడు అన్ని శాఖల్లో ఇంగ్లీషు రాజ్యం ఏలుతుంటే, అప్పట్లో ఎలా ఉండేదో ఒక సారి చూద్దాము. స్వతంత్ర పూర్వం వరకు దాదాపు తాలూకా స్థాయి కోర్టులలో స్థానిక ప్లీడర్లు అనేవాళ్ళు ఉండేవాళ్ళు. ఆ సమయంలో వాళ్ళ వాదనలని కోర్టులో తెలుగులో వినిపించడం జరిగేది. వీళ్ళని తెలుగు ప్లీడర్లు అనేవాళ్ళు. అలాగే ఆ సమయంలో ఇండియా సివిల్ సర్వీస్ అధికారులు అటు న్యాయపరమైన, మరియు కార్య నిర్వహణ బాధ్యతలని నిర్వర్తించేవాళ్ళు. వాళ్ళు దేశ ప్రజల భాషను నేర్చుకుని వాళ్ళ భాషలోనే స్పందించడం మనం స్పష్టంగా చూస్తాం.

1916 ప్రాంతంలో జరిగిన సర్వేలో భూమి అంతటిని సర్వే చేసి, ఎవరు ఎంత కట్టాలి అని లెక్క కట్టిన మూల గ్రంథం RSR అంటే రెవిన్యూ సెటిల్మెంట్ రిజిస్టర్ అనేది తయారు చేశారు. వాళ్ళు అది తయారు చెయ్యడం కూడా డైగ్లాట్ లో చేసారు. అంటే తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషల్లోనూ ఉంటుంది. అలాగే భూముల పట్టాలు కూడా అక్కడున్నటువంటి స్థానిక భాషల్లోనే తయారు చేసారు. ఈ రకంగా చూసినప్పుడు ఇంగ్లీషు వాళ్లు పాలకులుగా ఉన్నప్పుడు స్థానిక భాషలకే ప్రాధాన్యం ఉండటం మనం చూస్తాము. గవర్నమెంట్‌లో రెండు స్థాయిల ప్రభుత్వాలు ఉండేవి. ఒకటి ఫెడరల్ స్థాయి ప్రభుత్వాలు , ఇంకొకటి రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలు. అప్పుడు ప్రొవిన్షియల్ గవర్నమెంట్స్ ఉండేవి. ఆ స్థితిలో మాత్రం కొన్ని పెద్ద స్థాయి ఉత్తర ప్రత్యుత్తరాలు , తీర్పులు మొదలైనటువంటివి ఇంగ్లీషులో ఉన్నప్పటికీ , స్థానిక ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం స్థానిక భాషలలోనే ఉన్నాయి. 140 సంవత్సరాల క్రితం ఉన్నటువంటి భూసేకరణ చట్టం చాలా కాలం కొద్దిపాటి మార్పులతో స్వాతంత్ర్యానంతరం కూడా అలానే ఉండిపోయింది. వాటిని మనం గమనించినట్లయితే అక్కడ ఇచ్చేటటువంటి నోటీసులు అలాంటివి కూడా , వాటిని తెలుగులోనే చేసినట్టు బోలెడన్ని దాఖలాలు ఉన్నాయి. రైతులు ఒకవేళ అభ్యంతరాలు తెలియచేసినట్టయితే వాటిని త్రోసిపుచ్చడం, ఆమోదించడం కూడా స్థానిక భాషలోనే జరిగేది. అదే సమయంలో ఈ దేశం మీద ఇక్కడి భాషల్ని అభిమానించేటటువంటి సీపీ బ్రౌన్ , కల్నల్ మెకంజీ ప్రజల అనునిత్య వ్యవహారాలు తెలుసుకోవడానికి ప్రజల సంస్కృతి, జీవన విధానం, వారి ఆచారాలు అన్నిటినీ కూడా డాక్యుమెంట్ చేసి అనేక రూపాల్లో తెలుగులో రూపొందించి ఇచ్చారు. ఉదాహరణకు మెకంజీ కైఫీయత్తులు. మెకంజీ కైఫీయత్తులు ఎక్కడికక్కడ ఊర్ల యొక్క స్థానిక చరిత్రను కొన్ని వందల ఊర్ల గురించి సమాచారం సేకరించి ఇచ్చి వెళ్ళిపోయాడు. పైగా ఆ కైఫీయత్తులు తయారు చేసేటప్పుడు ప్రజలకు అర్థమయేది ప్రజలు గుర్తుపెట్టుకునేదిగా ఉండాలని, ఎవరైతే ఈ సమాచారం ఆ ఊరిని గురించి ఇచ్చారో, వారు ఎలాంటి భాషలో చెప్పారో అలాంటి ధ్వని విధేయతతో వాటిని భద్రంగా రికార్డు చేసి వెళ్లిపోయారు. ఇది సత్యం. విడ్డూరంగా ఉన్నా ఇది సత్యం.

మనకి స్వతంత్రం వచ్చినప్పుడు కూడా అప్పట్లో సంయుక్త రాష్ట్రంలో తెలుగువాళ్ళగా మనం ఉండిపోయాం. మరికొంత మంది నైజాం రాష్ట్రంలో ఉండిపోయారు. తరువాత మనం విడిపోవడం, తెలుగువాళ్లందరికీ రాష్ట్రం ఏర్పాటు చెయ్యాలని కోరటం, ఈ డిమాండ్ ద్వారా భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడటం జరిగింది. భాషా ప్రయుక్తరాష్ట్రం కోసం డిమాండ్ కు అనుగుణంగా రాష్ట్రాల డిమాండ్లను పరిశీలించడానికి ఒక కమీషన్ ఏర్పడింది. వాటికోసం ఏర్పాటు చేసిన ఫజల్ ఆలీ కమీషన్ మొదలైనవాటిన్నింటిలో చర్చించిన అతి కీలకమైన అంశం ఆ రిపోర్ట్‌లో రెండవ అధ్యాయంలో మొత్తం భాషా, సంస్కృతుల మీద ఉంటుంది. అది నేనిక్కడ ప్రస్తావిస్తాను. భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండ్ యొక్క వాదనని గురించి చర్చించినప్పుడు భాషా సంస్కృతులకు ఉన్న స్థానము, వాటి మొత్తాన్ని చర్చించింది. ఇక్కడ నేను చెప్పాలనుకున్నది ఏమిటంటే, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు విషయంలో ఒక భాషగా, జాతిగా, సంస్కృతిగా పునాదిగా తెలుగువాళ్లు ఒక జాతిగా వేరే రాష్ట్రంగా ఉండాలని కోరుకున్నట్టు తెలుస్తుంది.

ఇది అలానే ఉన్నదా అన్నది సమస్య. మనకి ఉద్యమం విజయవంతం అయింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో అది సాకారం అయ్యింది. రాష్ట్రాన్ని గురించి మనం ఎలా ఆలోచించడం మొదలుపెట్టాము అన్నదానికి పునః వ్యవస్థీకరణ చట్టంలో చర్చించినట్లు ఇది ఒక "సామాజిక సాంస్కృతిక

మూర్తిమత్వం" (socio -cultural entity) గా కాకుండా కేవలం రాజకీయ మూర్తిమత్వంగా (political entity)చూడటం మొదలుపెట్టాం. అందువలన పాలనాపరమైన మూర్తిమత్వం, దేశీయ మూర్తిమత్వం మనం ఏర్పర్చుకోలేదు.

నేను అనేక సందర్భాల్లో వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల పరిశీలకుడిగా వెళ్ళినప్పుడు, అలాగే మిగతా అధికారులతో మాట్లాడుతున్నప్పుడు వాళ్ళ రాష్ట్రాల్లో పాలనా విధానం ఎలా ఉన్నది? అన్న సహజమైన ఉత్సాహంతో అడిగినప్పుడు వాళ్ళ రాష్ట్రంలో జిల్లా స్థాయివరకు కూడా ముఖ్య ప్రభుత్వ కార్యకలాపాలు అన్నీ కూడా వారియొక్క స్థానిక భాషలలో జరుగుతున్నాయి. అక్కడ అనేక రాష్ట్రాల నుంచి అనేక భాషా నేపథ్యాల నుండి వచ్చిన అధికారులు అందరూ కూడా స్థానిక భాషలోనే అధికార కార్యకలాపాలు అన్నీ కొనసాగించాల్సిందే. అలాగే తమిళనాడులో ఉన్నటువంటి అన్ని రాష్ట్రాల అధికారులు తమిళం నేర్చుకోవాల్సిందే. ఇది అధికారుల ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉండదు. ఖచ్చితంగా నేర్చుకుని తీరాలి. ప్రజల యొక్క అర్జీలు, అధికార ఉత్తర ప్రత్యుత్తరాలు, పట్టాలు అన్నీ కూడా అక్కడి స్థానిక భాషలోనే జరగాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. భారత దేశంలో ఉన్న చాలా రాష్ట్రాలలో ఇది మనం గమనించవచ్చు. చివరికి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా స్థానిక భాషలోనే ఉన్నాయి.

ఇక మన రాష్ట్రం దగ్గరకు వచ్చేటప్పటికి మనం తెచ్చిపెట్టుకున్న ఒక మిగిలిపోయిన, ఇంగ్లీష్ వాడు వదిలిపోయిన పడికట్టు పదాలతో కూడిన ఒక మూస ఇంగ్లీషుని మనం నేర్చుకున్నాం. ఈ మూస ఇంగ్లీషుని నేర్చుకున్న కొద్ది మంది గుమాస్తాలు మొత్తం వ్యవహారాన్ని నడిపించే పరిస్థితి ఉంటుంది. వాళ్లకి ప్రజల యొక్క నిత్యజీవిత వ్యవహారానికి సంబంధించిన, అంటే ఒక పేద రైతు , ఒక మహిళ, ఒక దారినపోయే దానయ్య వారియొక్క కష్టసుఖాలు ప్రతిబింబిస్తూ వారియొక్క సమస్యని విశ్లేషించి రాయగల శక్తి యుక్తులు కానీ, సామర్థ్యాలు గాని, భాషా నైపుణ్యాలు గాని లేవు. పడికట్టు పదాల్లో రాయడం జరుగుతోంది. అందువలననే మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు గుమాస్తాల భాష రాజ్యమేలుతోంది. మొత్తం మీద గుమాస్తాల వలన, గుమాస్తాల కొరకు, గుమాస్తాల చేత, గుమాస్తాల చేత నడిచే రూపాంతరం చెందింది. దీనిని ఇంకో రకంగా చెప్పాలంటే, ప్రజలతో నిత్యానుసంధానంగా మనం ఉండాలంటే, అనుక్షణం వారితో కలిసి మెలిసి నడవాలి, వాళ్ళ కష్టసుఖాల్లో మనం పాలుపంచుకోవాలి అనుకున్నప్పుడు పాలనా రంగం పెడగా ఉండి, వారి యొక్క స్థానిక భాషలో మాట్లాడకుండా ఉంటే పాలన అన్న ప్రక్రియ ఎలా సాధ్యమో మనం ఆలోచించాలి. ఈ సంశయాన్ని విశ్లేషించడానికి మనం లోతుల్లోకి వెళ్తే దీంట్లో మనకే ఎందుకు ఇలా జరుగుతోంది అనేది, ఒక అంశం తీసుకుని చూద్దాం..

మన తెలుగు రాష్ట్రాల్లోనే ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది అని ఆలోచిస్తే రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. 1. రాజకీయ సంకల్పం లేకపోవడం (political will) 2. పరిపాలన కృతనిశ్చయం లేకపోవడం (administrative determination). ఇవి రెండూ లేకపోవడం.. ఇది ఇలా ఎందుకు అనేది పరిశీలిస్తే దాన్ని ఎలా సరిచేయొచ్చో మనం ఆలోచించవచ్చు. ఒకటి, రాజకీయ సంకల్పం లేకపోవడం. భాషా సంస్కృతుల స్థానము పాలన రంగంతో ఎలా ముడిపడి ఉంటుంది అన్నది తెలియడానికి, ముందు తెలియాల్సింది పాలన అన్నటువంటి ప్రక్రియ ప్రజాజీవితానికి సంబంధించిన అంశము అన్నది గుర్తెరిగి ఉండాలి. ఇది గమనించనంతవరకూ పాలన అన్నది ఏదో గొప్ప బ్రహ్మ విద్య, చాలా గొప్ప విషయం అన్నట్టు దూరంగా పెడగా ఉండిపోతుంది. పాలన ప్రజలకు సంబంధించినది అని తెలుసుకుని, భాష ప్రజలకు సంబంధించినది అయితే బాగుంటుంది అని గుర్తిస్తే చాలు. అయితే ఎందుకో పాలన అన్నది గొప్ప విషయంగా సెక్రటేరియట్‌లో జరిగే ఏసీ గదుల్లో మాత్రమే అనుకోవడం జరుగుతోంది. రెండవ అంశము ప్రజాస్వామిక సంప్రదాయాలకు చోటు లేకపోవడం. ప్రజాస్వామ్యం యొక్క అంతరాత్మ ఏమిటి అనేది ఇక్కడ కీలకమైన ప్రశ్న. ప్రజాస్వామ్యము అనేది కేవలం ఒక రాజకీయవిధానము. గెలవడం, ఓడటం పరిపాలించడం అన్న తంతు మాత్రమే కాదు. అది ఒక్క సారి మధ్యన వచ్చిపోయే ప్రక్రియ మాత్రమే. ప్రజాస్వామ్యంలో అంతర్గత సూత్రం ప్రజలు ఉత్సాహంగా పాలనలో పాల్గొనడం. అలా కానప్పుడు, పాలకులు అనేవాళ్ళు ఒక వర్గం గానూ, పాలితులు అనేవాళ్ళు ఒక వర్గంగానూ ఉండిపోతారు.

ముఖ్యంగా ప్రజాస్వామ్యం యొక్క మూల సూత్రాన్ని పరిశీలించినట్లయితే పాలితులే పాలకులు. ఈ పాలితులు చురుగ్గా పాల్గొనాలి. ప్రజాస్వామ్యం అనేది సచివాలయంలోనో, శాశన సభలోనో కూర్చుని నిర్ణయించుకునేది కాదు. పాలకులు చేసేటటువంటి అనేక నిర్ణయాలకు ప్రజలు కేవలం బాధితులుగానూ, నిందితులుగానూ ఉండకూడదు. వాటిలో భాగస్వాములు కావాలి.

ఒక మాటలో చెప్పాలి అంటే, ప్రజాస్వామిక చర్చ, ప్రజాస్వామిక పాల్గొనటం , ప్రజాస్వామిక సహ భాగత్వము

అనేవి ప్రజాస్వామ్యం యొక్క ముఖ్య సూత్రాలు. ఇది ప్రధానమైనటువంటి అంశంగా చెప్పవచ్చు. ఇది ప్రజాస్వామ్యం యొక్క ప్రాణవాయువు. ప్రజలు పాల్గొనటము, తెలుసుకోవడం, అభిప్రాయాలూ వ్యక్తీకరించడం అలా అన్నింటిలోనూ భాగస్వాములు అయితేనే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది. ఏదో కొద్ది మంది నాయకులు, కొద్ది మంది అధికారులు యొక్క శక్తి సామర్ధ్యాల మీద ఆధారపడటమే కాకుండా, ప్రజలందరికీ ఈ దేశం యొక్క రూపురేఖలు ఎలా ఉండాలి, ఈ దేశం ఎలా సంపన్నం కావాలి, ఎలా పౌరులందరూ తల ఎత్తుకుని జీవించాలి అన్నది అర్థం కావాలంటే ప్రజలకు భాగస్వామ్యం ఉండాలి. మన రైతులకి, మన నిరుపేదలకు, మన కష్టజీవులకు, నిర్లక్ష్యానికి గురికాబడిన వర్గాలకి పాలనా ఫలితాలు చేరాలంటే, వాళ్లకు అర్థం అయ్యే భాషలోనే పాలన ఉండాలి. ఎప్పుడు కూడా ఏ ఒక్క పార్టీ మ్యానిఫెస్టోలో కూడా ఇది రాదు. ముఖ్యంగా పాలన ప్రజల యొక్కభాషలోనే అమలు చేస్తాం అని ఏ యొక్క పార్టీ చెప్పదు. ఎందుకు రాదు అంటే మనం అడగం కాబట్టి. మనం ఎందుకు అడగము అంటే మనం అడిగినా వినరు కాబట్టి అని ప్రజలు. అలా కాకుండా మనం అడగాల్సిన అవసరం ఉంది. మనం అడిగినప్పుడు మాత్రమే పార్టీ మ్యానిఫెస్టోలో చేరుస్తారు.

ఇక రెండవది. పాలనాపరమైన సంకల్పము (administrative determination). దాంట్లో మనకి పాలనా పరమైన విషయాల్ని చూసినప్పుడు రాజకీయ సంకల్పం లేని నాయకత్వం వల్ల పనిచేసేవాళ్ళు వాళ్లకు అనుగుణంగా పెద్దగా నేర్చుకోకుండా గడిపేస్తున్నటువంటి పరిస్థితులు చూస్తున్నాం. పట్టుమని పది మాటలు మాట్లాడలేని వాళ్ళు కొంతమంది మన రాష్ట్రంలో మాత్రమే చీఫ్ సెక్రటరీగా ఉండటం చూస్తాం. వాళ్ళు కూడా అచ్చమైన పాలకుల్లా ప్రవర్తించడం మనం చూస్తాం. ఇదంతా పోవాలంటే పాలనాపరమైన సంకల్పం కావాలి.

పాలన భాషగా ఈ ప్రాధాన్యతని పెంచడానికి కొన్ని వ్యూహాలని మనం చర్చించుకోవచ్చు. దాంట్లో యంత్రాంగాన్ని సన్నద్ధం చేసుకోవడం అన్నది చాలా ముఖ్యం. అంటే, యంత్రాంగాన్ని పక్కన పెట్టేసి మీరు ఇలా చెయ్యండి అని సందేశం ఇచ్చేసి వెళ్ళిపోతే పని అవ్వదు. ఆదేశాలు కూడా మనం ఇచ్చినట్టు ఇస్తాం, వాళ్ళు విన్నట్టు వింటారు. ఈత నేర్చుకో అని చెప్పేసి వెళ్ళిపోయింత మాత్రాన ఈత రాదు. అలాగే కరోనా సమయంలో మాస్క్ వేసుకో అని చెప్పినంత మాత్రం వింటారని మనం చెప్పలేం. దానివలన కష్టనష్టాలు ఏమిటో, ఉపయోగాలు ఏమిటో చెప్పినప్పుడే వాళ్ళు వింటారు. ఆ ప్రయత్నం చెయ్యాల్సినటువంటి అవసరం చాలా ఎక్కువ ఉన్నది.

నేను కలెక్టర్ గా ఉన్నపుడు చేసిన ముఖ్యమైన ప్రయత్నం ఇది. "మీరందరూ రేపట్నుంచి తెలుగులోనే రాయండి, మీ ఇష్టం" అని చెప్పకుండా , వాళ్ళని కూర్చోబెట్టి అనేక స్థాయిల్లో అధికారులను పిలిచి చెప్పడం జరిగింది. వాళ్లకు కావల్సినవి ఏమిటి ? ఏ అంశాల్లో తొట్రుపాటు, భయసందేహాలు ఉన్నాయి ?వాటిని ఎలా పరిష్కరించాలి అనేది తెలుసుకుని పరిష్కరిస్తూ , భయసందేహాలను పోగొడుతూ వెళ్ళాలి. శిక్షణ, చర్చ పద్ధతులు యంత్రాంగంలో వాడాల్సిన అవసరం ఉంది. మూడవది ప్రేరణ అన్నది చెయ్యాల్సిన అవసరం ఉన్నది. మన సొంత భాషలో రాయడం వలన ప్రజల భాషలో మనం పని చేస్తున్నాం, దాని వలన వాళ్లకు పాలనలో ఫలితాలు ఎక్కువగా వస్తాయన్నది అర్థమయ్యేలా అనేక రూపాల్లో చెప్పడం జరిగింది. మనం ఇక్కడ మరిచిపోకూడని అంశం ఏమిటంటే అధికారులు అంటే ప్రజలకు సేవకులు, ప్రభుత్వానికి కాదు. ఇదంతా ప్రత్యేకించి నేను కలెక్టర్‌గా ఉన్నప్పుడు చెయ్యడం జరిగింది. ఒక వేళ ఎవరైతే వినిపించుకోరో అక్కడ ఫైళ్లను తిరస్కరించడం జరిగింది. రెండవది స్పర్థ. ఎక్కడెక్కడ అధికారులు అమలు చెయ్యరో, వారిని బాగా పనిచేసేవారితో పోల్చి చెప్పడం ద్వారా వారికి స్ఫూర్తిని ఇవ్వడం జరిగింది.

సాధారణంగా అధికారులు చెప్తున్న విషయం ఏమిటంటే "సార్! మన చట్టాల్లో ఉన్నటువంటి అంశాలు చాలా గూఢమైనటువంటివి, క్లిష్టమైనవి వాటికి తెలుగులో సమానార్థాలు ఉండవు" అని అంటున్నారు. ఇది పూర్తిగా తప్పు. భారత ప్రభుత్వం ఈ మధ్యకాలంలో ఇస్తున్నటువంటి చట్టాలని తెలుగులో కూడా ఇస్తున్నారు. ఇతర స్థానిక భాషల్లో కూడా ప్రతిని విడుదల చేస్తున్నారు. అలాగే మన శాసన సభలో కూడా కొంత వరకు వున్నది.

చట్టాలకు సంబంధించిన విషయాల్లో మనకు పరిభాషలు లేవు అన్నది ఒట్టి అబద్ధం అని నేను చెప్పాలనుకుంటున్నాను. ఈ సందర్భంలో నేను నా వ్యక్తిగత అనుభవాన్ని కూడా మీ అందరితో పంచుకోవాలనుకుంటున్నాను. మనం ఏ చట్టాన్ని తీసుకున్నా కూడా ఆ చట్టాన్ని విశ్లేషించినప్పుడు, ప్రధానంగా మొదటి సెక్షన్ దేని గురించి మాట్లాడుతుంది అంటే, ఈ చట్టాన్ని ఏమంటారు, ఈ చట్టం పేరేంటి, ఇది ఏ పరిధి వరకు ఉంటుంది అనేది చెప్తారు. రెండవ సెక్షన్ మాత్రము

ఆ చట్టంలో వాడేటటువంటి విశేషంగా వచ్చేటటువంటి పదాలు ఏ అర్ధంలో మనం వాడుతున్నామో దాన్ని తెలియచేస్తుంది. దాన్ని సాంకేతిక పరిభాష అంటాం. ఆ సాంకేతిక పరిభాషలు అన్నీ కూడా రెండవ సెక్షన్‌లో వచ్చేస్తాయి. మూడు, నాలుగు సెక్షన్లు దీన్ని అమలు చేసేటటువంటి అధికారులు ఎవరు అనే విషయానికి సంబంధించినవై ఉంటాయి. దీనికి అనుపానులు దేన్నుంచి లభిస్తాయి అనటానికి కూడా అక్కడే ప్రస్తావించబడింది. దాదాపు నాలుగు సెక్షన్‌లలో ఆ చట్టానికి సంబంధించిన అన్ని అంశాలు ఉంటాయి.ఏ చట్టాన్ని చూసినా అదే నిర్మాణంలో ఉంటుంది. దీనిని తెలుసుకోవడానికి ఒక పశుసంవర్ధక శాఖ, ఒక వ్యవసాయ శాఖనో వాళ్లకు సంబంధించినటువంటి చట్టాల్ని తెలుసుకోవడానికి దాంట్లో వాడేటటువంటి పరిభాషలని వాడటానికి నేర్చుకోవటానికి మొత్తం కలిపి ఒక రోజు రెండు రోజులకన్నా ఎక్కువ పట్టదు. ఒక సాధారణ ఉద్యోగి కనీస స్థాయినుంచి రిటైర్మెంట్ నాటికి షుమారు 50 లక్షలు నుంచి కోటి రూపాయలు పైన తీసుకుంటున్న ఈ రోజుల్లో మరి అతను కనీసం రెండు మూడు రోజులో లేదా వారమో ప్రజల కోసం మనం మారలేమా అన్నది ప్రశ్నించుకోవాల్సిన అంశం. అలాగే శిక్షా స్మృతులు, ఇతర న్యాయ విచారణ పద్ధతులు మొదలైనవి కూడా దాదాపు తెలుగులోకి వచ్చినాయి. వీటన్నింటికి కూడా భారత ప్రభుత్వం వారు ప్రామాణికమైనటువంటి అనువాదాలు ఇచ్చారు. అలాగే భారత రాజ్యాంగానికి ప్రామాణికమైనటువంటి అనువాదం ఉన్నది. అలాగే తెలుగు అకాడమీ రూపొందించినటువంటి పరిపాలన పదకోశం వున్నది. ఆ తరువాత వచ్చినటువంటి ఎంతో మంది మహానుభావులు, అధికార భాషా సంఘానికి పనిచేసిన చైర్మన్లు మొదలైన వాళ్ళందరూ కావలసిన పదకోశాన్ని తయారు చేసి ఇచ్చారు. కాబట్టి మనకు కావాల్సింది ఏమిటంటే మన ఆత్మలో కృతనిశ్చయం ఉన్నదా లేదా అన్నదే అసలు ప్రశ్న. అది కలిగించాల్సిన బాధ్యత సీనియర్ అధికారులకు ఉంటుంది. ముఖ్యంగా అఖిల భారత సర్వీసులకు సంబంధించినటువంటి అధికారులు, అలాగే రాష్ట్రంలో వచ్చేటటువంటి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు, ఆ తరువాత కింద స్థాయిలో డిప్యూటీ తహసీల్దార్ వంటి అధికారులు వారి శిక్షణ కాలంలో దీనికి సంబంధించి కనీసం ఒక నెలకి తగ్గకుండా శిక్షణలో ఉంచవలసినటువంటి అవసరం ఉంది. కనీసం నాలుగు వారాలు దీంట్లో అనేక తర్జుమాలు చేయించడం మార్చడం, వ్యవహరించడం, అన్ని రూపాల్లో దీన్ని రాయగలగడం, తరువాత భాషా వ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందించుకోవడానికి కృషి చెయ్యాల్సిన అవసరం ఉంది. ఇది చాలా సులభమైనటువంటి పని. దీనికోసం నేను ప్రత్యేకించి ఒక శాస్త్రీయమైన శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించాను.

ఇది తప్పకుండా ఒక మంచి పరిష్కారం అవుతుంది. ఆఖరిగా ఈ వ్యాసం ముగించబోయే ముందు నేను చెప్పాలనుకున్నది. ప్రజలకి అనేక హక్కులు ఉన్నాయి. ప్రజలకు ఉన్నటువంటి హక్కులలో అన్నిటికన్నా ప్రాథమిక హక్కు ఏంటంటే ఏదైనా ఆ ఒక విషయం తెలుసుకునే హక్కు. ఈ హక్కు అనేక రూపాల్లో వాళ్ళకి లభిస్తుంది. ఒకటి రాజ్యాంగ రూపంలో, మరొకటి చట్ట రూపంలో. దీనికి అధికార భాషా చట్టం మనకి ఏమి చెప్తోంది అంటే ప్రజల వ్యవహారాలు అన్నీ కూడా పాలక భాష , స్థానిక భాష అయినటువంటి తెలుగులో, ఉర్దూలలో ఉండాలని వాళ్ళు పేర్కొన్నారు. దాంట్లో పేర్కొన్నదానిని తప్పకుండ పాటించాల్సినటువంటి అవసరం ఉన్నది. అది ప్రజలకున్నటువంటి హక్కు అన్నది ప్రజలకు మనం తెలియచేయాల్సిన అవసరం ఉంది. దీంట్లో పాలకుల ఇష్టా ఇష్టాలతో సంబంధం లేదు . అది వాళ్ళ ధర్మం. కాబట్టి పాటించి తీరాలి. మనకు ఇష్టం ఉంది! లేదు!! అనే దానితో సంబంధం ఉండకూడదు. వ్యక్తిగతంగా ఒక వ్యక్తి కష్టం తీసుకోవడం తప్పు కాదు అనుకోవచ్చు. కానీ , తప్పు అని చట్టం చేసింది వీటన్నింటినీ అలోచించిన తరువాతనే. దాని వెనకాల ఉన్న మౌలిక సూత్రాలను గమనించి మనం అమలు చెయ్యాలి. అధికారభాషాచట్టం కూడా అలాంటిదే. ఒకళ్ళ ఇష్టాలకు గాని, ఒకళ్ళ అభిమతాలకు గానీ ఇక్కడ చోటు లేదు. చట్టం అంటే మనం పాటించి తీరాలి. అది మనధర్మం. ఇది మనం గుర్తుపట్టినప్పుడు తప్పకుండా సాధ్యం అవుతుంది. దీనికి కావాల్సినటువంటి అనుపానులు సాంకేతిక పదజాలం సృష్టించబడుతుంది. జర్మనీ, జపాన్ , ఇంగ్లాండ్ , అమెరికాల లాగా ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనేటువంటి ప్రజాస్వామ్యం ఏర్పడాలంటే ఒక కన్నుల పండువగా ప్రజలందరూ సుఖ సంతోషాలంతో ఉన్నతంగా జీవించాలంటే, ఒక ధైర్యం, మానసికంగా ఒక రకమైన ఆత్మవిశ్వాసంతో జీవించాలంటే ప్రజల భాషలోనే పాలన ఉండాల్సిన అవసరం ఉంది. ప్రజల భాషలోనే , ప్రజల చేత, ప్రజల వలన, ప్రజల కొరకు, ప్రజల కోసం, రాజ్యం రాజ్యాధికార వ్యవస్థలు పని చెయ్యాలి. ◆

## నివాళి

# వంగపండు ప్రసాదరావు కన్నుమూత



'ఏం పిల్లో ఎల్దమొస్తవా'... అంటూ ప్రజలను ఉర్రూతలూగించిన ప్రజా గాయకుడు వంగపండు ప్రసాదరావు(77) కన్నుమూశారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలోని వైకేఎం నగర్‌లో ఆగస్టు 4న ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. 1943 జూన్‌లో పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామంలో జగన్నాథం, చినతల్లి దంపతులకు వంగపండు జన్మించారు. గ్రామాల్లో పాడుకునే పాటలను ఆలపిస్తూ ఆయన బాల్యం గడిచింది. ఐటీఐ వరకు చదివి విశాఖపట్నం షిప్‌యార్డులో ఉద్యోగంలో చేరారు. 1986లో విడుదలయిన 'అర్ధరాత్రి స్వతంత్రం' సినిమాతో వంగపండు సినీప్రస్థానం ప్రారంభమయింది. ఈ చిత్రంలోని 'ఏం పిలడో ఎల్దమొస్తవా..' అనే పాట ఆ కాలంలో సంచలనం రేపింది. ఇప్పటిదాకా 30 వరకు సినిమా పాటలు రాశారు. కొన్ని చిత్రాల్లో నటించారు కూడా. ఆంధ్రా యూనివర్సిటీ సాంస్కృతిక విభాగంలో ప్రస్తుతం ఆయన గెస్ట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ, వర్సిటీ క్వార్టర్స్‌లోనే ఉంటున్నారు. గద్దర్‌తో కలిసి 1972లో జననాట్యమండలిని ఏర్పాటు చేశారు. 1993లో తన ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ ప్రకటించారు. పూర్తికాలం జానపదవాగ్గేయకారునిగా తక్కినజీవితమంతా గడిపారు. సామాన్య జనానికి కూడా అర్థమయ్యేలా ఉండే పాటలతో వ్యవస్థలోని అన్యాయాలను, లోపాలను ఎత్తిచూపేవారు. వంగపండు 300కు పైగా పాటలు రచించారు. ◆

కవిత

# అన్ని గుండెలూ అమ్మవే

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946



*తల్లికి తీరని బాధలు*
*బాధలన్నీ వొకటి కాదు*
*అమ్మ గుండె కూడ పిడికిలంతే*
*అది అనేక గుండెల మిళితం!*

*ఒకగుండెకు అంబు గాయం*
*ఒకదానికి సమ్మెట పోటు*
*ఒకదానికి రోకలిపోటు*
*ఇంకా వగైరా వగైరా....!*

*పక్షి భయం భయంగా వుంది*
*పాము కదలిక గుర్తించాక*
*కంటికి కునుకు కరువైంది*
*గూట్లో రెక్కలమాటున దాగిన*
*బిడ్డల్ని ముక్కుతో లాలించింది*
*ఆహారాని కెళ్ళి వచ్చేలోగా*
*అలికిడి చేస్తే అపాయం మింగేస్తుంది*
*తలలెత్తి తనకోసం చూడవద్దంది*
*నిశ్శబ్దంగా నిదురించమంది!*
*రెండు చెట్ల కొమ్మల మధ్య*
*చింపి చీర ఉయ్యాలైంది*

*మాటలు రాని నెలలబిడ్డ*
*ఉయ్యాలూగుతూ*
*ఏడ్పే మాటలై తల్లిని*
*మధ్యమధ్య పిలుస్తూంది*
*నెత్తి కెక్కిన మట్టిగంప నేలకుదించి*
*అటూ యిటూ అమ్మ పరుగులు*
*భద్రత కొరవడిన బిడ్డతో*
*తల్లికి భయాలు చుట్టుముట్టాయి!*

*జంగిడి గొడ్లతో అడివికి*
*జతచేసి తోలిన లేదూడపై*
*ఏ పులి పంజా విసురుతుందోనని*
*ఏ విషాద వార్త కమ్ముతుందోనని*
*భయం భయంగా వాకిట*
*మోరెత్తి చూస్తుంది గోమాత!*

*నారేత కెళ్లిన బిడ్డ*
*ఉద్ధృతంగా పారే*
*నాగారం పంట కాలువ*
*ఒంటరిగా దాటబోతే*
*ఏ విపత్తు ముంచుకొస్తుందోనని*
*రెక్కాడినా డొక్కాడని యింట*
*కుక్కి మంచంలో కునారిల్లుతుంది తల్లి!*
*అప్పుగింతలు పూర్తయ్యాయి*
*పారాణి ఆరలేదు*
*అభం శుభం తెలియని చిన్నది*
*కుడుమిస్తే పండగనుకునే బిడ్డకు*
*అత్తారింట్లో ఏఇడుములోనని*
*పుట్టింట తల్లి మనోవేదన!*

*గుండెగుండెకు అనుసంధానం అమ్మ*
*అన్ని గుండెల సమ్మేళనం అమ్మ!* ◆



# అమ్మ

- ఎ. అన్నపూర్ణ
9440386328

"అమ్మా! మా మాట ఇనుకో. నాయన లేని ఈ ఇంట్ల ఎంతకాలం ఒంటిగా వుంటావ్. ఇల్లు బేరం పెట్టిన. మాతోబాటు వుందుగాని.." అన్నాడు సూర్యం.

"నా కాలూచెయ్యి బాగున్నాయి. ఇక్కడ బాగానే వుంది. మరికొంత కాలం పోనియ్ నాన్నా..." అంది అంజమ్మ.

"ఇప్పటికి అయిదు సంవత్సరాలుగా ఇదే మాట చెబుతూ వచ్చావు. నలుగురూ ఏమంటారు... తల్లిని కొడుకు పట్టించుకోడు అంటారు. ఏ రోజు ఎట్టా వుంటావో.. ఈ ఇల్లు 100 ఏళ్ళనాటిది. పాడైపోయింది. పడగొట్టి కట్టించాలి. సిటీలో జాగా కొనుక్కోవచ్చు. నా మాటిను ఈ సారి నేనిక వూరుకునేది లేదు. బయల్దేరు." అంటూ గట్టిగా చెప్పాడు.

"అత్తమ్మా నీ మనవలతో ఊసులాడాలని లేదా? నువ్విలా దూరంగా వుంటే బంధుత్వాలు తెలీవు. అభిమానాలుండవు. నువ్వెవరో ఆళ్ళెవరో అన్నట్టుంటారు. మంచి డాక్టర్లుంటారు. ఎన్నో వింతలు, విశేషాలు చూద్దువుగాని. నీ కొడుకు చీటికీ మాటికీ రాలేడు కానీ నీ మీదనే ధ్యానతో దిగులుపడుతుంటాడు..." అంటూ ఆప్యాయంగా చెప్పింది నాగమణి. ఇక అంజమ్మ తప్పించుకోలేక సరేనంది.

గ్రామం నుంచి బస్‌లో 12 గంటలు ప్రయాణం చేసి విజయవాడ సిటీకి చేరుకుంది అంజమ్మ. పుట్టి బుద్ధి ఎరిగి ఇంత దూరం రావడం ఇదే మొదటిసారి. కాస్త బడలిక తీరాక దుర్గమ్మకొండ, కృష్ణా బ్యారేజీ, మంగళగిరి పానకాల స్వామి గుడి ఒకటొకటే వారం వారం తీసికెళ్ళి చూపించారు మణీ సూర్యం. కానీ అంజమ్మకి ఎలాటి సంతోషమూ లేదు. ఏదో మరబొమ్మలా వచ్చిందంతే. నాన్నమ్మా కథలు చెప్పవా అని మనవలు అడిగితే నాకు సదువురాదు ఏం చెప్పను? అంటూ తప్పించుకుంది. వాళ్ళు దిగులు పడ్డారు. చిన్నబుచ్చుకున్నారు.

మణికి ఏంచేయాలో అత్తమ్మను ఎలా సంతోష పెట్టాలో తెలీలేదు. అత్తమ్మ సామాన్లు సర్దుతావుంటే పాతకాలం నాటి ఆట వస్తువులూ పూసల దండలూ కనిపించాయ్.

"ఇవన్నీ ఏమిటీ ఇంత భద్రంగా దాచుకున్నావు అత్తమ్మా ఎవరిచ్చారు కొన్నావా? ఆరా అడిగింది. అంతే అంజమ్మలో ఎక్కడాలేని ఉత్సాహం వచ్చింది. వాటి గురించి చెప్పింది.

"మణీ ఇదిగో ఈ పల్లకీ నేనూ నా స్నేహితురాలు గంగా తయారు చేశాం. గంగ ఈ కాలిపట్టా నా పెళ్ళికి బహుమానం ఇచ్చింది. రెండోది పోయింది. ఇది మిగిలింది. ఈ పూసల దండ సూర్యం కొన్నాడు. చూశావా ఇంకా కొత్తగా లేవూ...ఈ చేతిసంచీ మీ మామ చేత్తో మిసన్ మీద కుట్టాడు. ఒక్కరోజూ వాడలేదని అలిగేవోడు. వాడితే ఇలా కొత్తగా గుర్తుగా మిగిలేదా చెప్పు.. అంటూ పాత విషయాలు కోడలితో పంచుకుంది.

"అవును అత్తమ్మా నువ్వు చెప్పింది నిజం. మరి నీ గంగ ఏమైందీ ఎక్కడ వుంటుందో తెల్సా?"

"ఆ.. అది పెళ్ళయి వెళ్ళిపోయిందా అంతే మళ్ళీ మా వూరికి రాలేదు. తల్లీ తండ్రీ వరదల్లో కొట్టుకుపోయారు. అన్నతమ్ములేమో బతుకు తెరువుకి దూరదేశాలకి పోయారు. ఇంకెవరి కోసం వస్తుంది పాపం. రెండో పెళ్ళి చేశారు. సవతి పిల్లలు. పిల్లలూ చాకిరీతోనే గడిచిపోయేదంటూ ఉత్తరాలు ఒకటో రెండో రాసింది. చూడు ఆ సంచిలో వుంటాయి. నా కంటే ఓ తరగతి చదివింది."

మణి ఆ సంచిలో చూసింది. వున్నాయి. ఆత్రంగా తెరిచి చదివింది. అడ్రస్ కూడా వుంది.

"అత్తమ్మా నువ్వు జవాబు రాశావా అడ్రస్ వుంది కదా!"

"రాశాను. ఎక్కువ రాయడానికి చదువులేదుగా.. ఒక్కటి బదులు రాశాను."

మణి అడ్రస్ వేరే పేపర్ మీద రాసుకుంది. ఆ ఉత్తరాలు చిరిగిపోయి శిథిలమైపోయాయి. వాటిని మళ్ళీ పెట్టెలో సర్దేసింది. అందులోని అడ్రస్‌కి ఉత్తరం రాయగా నెలరోజులకి ఎవరో ఫోన్ చేశారు. అనాథ వితంతు ఆశ్రమంలో వుందని అడ్రస్ కూడా ఇచ్చారు.

"అత్తమ్మా పద! నీ దోస్త్ కనబడింది. అదేలే ఎక్కడ వుందో తెలిసింది. చూసి వద్దాం" అనగానే అంజమ్మ బైలుదేరింది ఆత్రంగా.

అదెక్కడో ఊరి చివర వుంది. ఆ భవనం కూడా శిథిలావస్థలో వుంది. దాన్ని బాగుచేసే దాతలు లేరు. కనీసం తెల్ల సున్నం రంగు కూడా లేదు. దేవాలయాలకూ, పూజలకూ, రాబోయే స్వర్గప్రాప్తికి ఎంతైనా ఖర్చు చేసే భక్తులు తోటి మనిషి తలదాచుకునే చోటు కూడా కల్పించనంత స్వార్థపరులు ఎందరో! అని బాధపడింది మణి ఆ ఇంటిని చూసి.

అందులో బాగున్న గదులు చాలా తక్కువ. పదిమంది మాత్రం వున్నారు. అదీ కాస్త నయం ఈ గది అంతే. గంగతో బాటు మరో ఇద్దరుంటారు ఆ గదిలో.

చింపిరి జుట్టుతో నీరసంగా వున్నారు. పరిశుభ్రత అంటే ఎరుగరు. చీరలు చిరిగి పోయి కనబడకుండా మాసిన దుప్పట్లు కప్పుకుని దాచుకుంటున్నారు కొందరు. కొందరికి తెలివేలేదు ఒంటిమీద.

"గంగా ఇదేమి దురవస్థ వచ్చిందే నీకు నాకు ఒక్కసారి ఉత్తరంలో రాయలేకపోయావా..." అంటూ గంగను చుట్టుకుపోయి ఏడ్చింది అంజమ్మ.

"నీకు ఉత్తరం రాసి నిన్నేడిపించలేక రాయలేదు. ఈ అమ్మాయెవరు ఇక్కడికెలా వచ్చావ్.. ఎన్నాళ్ళకు నిన్ను చూశానే. మన చిన్నతనంలో ఎంతో సంతోషంగా గడిపాము. ఇప్పుడు.. నువ్వు బాగున్నావా. నీ కొడుకు సూర్యం పెద్దవాడయ్యాడా.." అంటూ ఆత్రంగా ఎన్నో అడిగింది గంగ ఆనందంతో.

"ఆ..సూర్యం విజీవాడలో వుంటున్నాడు. ఈ పిల్ల మణి కోడలు. ఇద్దరు పిల్లలు. సూర్యం దగ్గరకి వచ్చేశాను. ఇక్కడే వుంటున్నాను 2 నెల్లుగా. నా భర్త పోయి ఆరు సంవత్సరాలైంది.." అంటూ వివరాలు చెప్పింది అంజమ్మ.

"చాలా సంబరంగా వుందే..." అంటూ వాళ్ళు రెండుగంటలు చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

"ఇక వెడదామా అత్తమ్మా. నెలకోసారి మీ స్నేహితురాల్ని చూడటానికి వద్దువులే.." అంటూ రెండు చీరలు అయిదు వందల రూపాయలూ అత్తమ్మ చేత గంగకిప్పించింది మణి. తీసుకోడానికి అభిమానపడింది గంగమ్మ.

"మనం ప్రాణ స్నేహితులం. నేను నీ ఇంటికి వస్తే ఏదో ఒకటి ఇవ్వలా. అలాగే ఇచ్చాను. నా దగ్గిర మొగమాటం వద్దు. నేను వచ్చి పోతూంటాలే. దిగులు పడమాకు" అంటూ ధైర్యం చెప్పింది అంజమ్మ.

దారిలో అడిగింది మణి – గంగమ్మ పిల్లలు ఏమయ్యారు? ఇంత అనాథగా ఎందుకు వుండాల్సి వచ్చింది?"

"సవతి పిల్లలు ఎలాగా పట్టించుకోరంటే. అది మామూలే. గంగకి కొడుకూ, కూతురున్నా అంతేట. తండ్రి ఇచ్చిన ఆస్తిని ఇద్దరూ తీసుకుని గంగను ఇలా దిక్కులేని దానిగా వదిలేశారు. రెండో భార్య కదా ఆస్థి బాగానే వుంది. దీనికి ప్రాప్తం లేదంతే. నా సూర్యం మణిలా ఎందరున్నారు ఈ రోజుల్లో.. నేనేమి ఆస్తి ఇచ్చాను మీకు. మనసుండాలి కానీ.. ఏదేదో చెబుతోంది అంజమ్మ.

మణి జరిగినదంతా సూర్యానికి చెప్పింది ఇంటికి వచ్చాక. మర్నాడు ఇంటి ముందు లారీ నిండుగా పూల మొక్కలూ, మట్టి కుండీలు, నిమ్మ, జామ, కొబ్బరి, మామిడి మొక్కలూ, ఎరువు మట్టీ వచ్చి చేరాయి.

మణి ఆశ్చర్యంగా అడిగింది భర్తని.

"ఇదేమిటీ ఇవన్నీ ఎక్కడ వేస్తావ్ జాగా ఏది?"

"ఆ పక్క స్థలం కొని చుట్టూ కంచె వేయించింది ఎవరనుకున్నావ్? అది మనదే. మనం అక్కడ ఇవన్నీ వేస్తాం.

అర్థమైందా?" అన్నాడు సూర్యం.

"నువ్వు చెప్పందే ఎలా తెలుస్తుంది... ఆ స్థలం ఎవరో కొన్నారు చుట్టూ కంచె వేశారు అనుకున్నా. అది నీ పనే అని ఇప్పుడు తెలిసింది.... రండర్రా పిల్లలూ మొక్కలు నాటుదాం.." అంటూ పిల్చింది.

"అమ్మని కూడా పిలు. ఇదంతా ముఖ్యంగా ఆవిడ కోసమే..." అన్నాడు. లారీలో మొక్కలూ మట్టి కుండీలు కిందకి దించి లారీని పంపేశాడు. ఈ సందడికి అంజమ్మ కూడా వచ్చేసింది.

"అమ్మా మనం ఈ స్థలంలో మొక్కలు వేద్దాం. మామిడి, కొబ్బరి, అరటి మొక్కలు, కాయగూరల మొక్కలు కుండీల్లో వేయండి. సరేనా! ఎవరి మొక్క మొదలు కాపు కాస్తుందో వాళ్ళకి బహుమతి ఇస్తాను" అన్నాడు సూర్యం. పిల్లల్ని ఉత్సాహపరుస్తూ.

"నాన్నా నాయనమ్మకి కూడా ఇస్తావా? బహుమానం?" అడిగాడు బాబు.

"అందరికీ వరుసగా బహుమానం వుంటుంది." అన్నాడు సూర్యం. అందర్నీ ఉత్సాహపరుస్తూ. అందరూ మర్నాటి నుంచీ తోటపని ప్రారంభించారు. పోటీ పడి మరీ పని చేయసాగారు. పిల్లలతో బాటు పెద్దలు కూడా. ఇప్పుడు అంజమ్మకి క్షణం తీరికలేదు. ఆరునెల్లకే కాయగూరలు, పూలమొక్కలు కాపుకాసాయి. సంవత్సరం అయ్యేసరికి మామిడి, కొబ్బరి, నిమ్మ, జామ ఏపుగా పెరిగి కనువిందు చేస్తున్నాయి. పిల్లలు ఒకటే సంబరపడ్డారు. స్కూలు నుంచి రాగానే మొక్కల్లోకి వెళ్ళిపోతారు. "నాన్నమ్మా నీ కంటే ముందు నా మొక్క వంకాయలు కాసింది' అని బాబు.. 'నా మొక్క గులాబీ పూసింది చూసుకో నాన్నమ్మా నాకే డాడీ బహుమతి ఇస్తాడు' అని పాపా .. ఒకటే అల్లరి చేస్తుంటే వాళ్ళతో బాటు.. "నా మొక్కలు ఆలస్యంగా కాయలు కాస్తాయి. అయితే ఏం నాకూ మీ డాడీ బహుమతి ఇస్తాడు చూస్తూండండి.." అంటూ మురిసిపోతుంది అంజమ్మ. అంత వ్యాపకంలోనూ తన స్నేహితురాలు గంగను మర్చిపోదు. వెళ్ళి చూసి వస్తూంటుంది.

ఒకరోజు సూర్యం కూడా అమ్మతోబాటు గంగమ్మను చూడాలని వెళ్ళాడు. అనాధాశ్రమంలో ఎలాంటి సదుపాయాలూ లేక పోవడం జబ్బుతో వారిలో కొందరు బాధపడటం తెలుసుకుని గంగమ్మకి తోటలో ఒక గది కట్టించి ఇస్తే అందులో వుంటుంది. అమ్మ ఇంతదూరం ఈ అనారోగ్య వాతావరణంలోకి రావడమూ అంత మంచిది కాదని అనుకున్నాడు. వెంటనే పనివాళ్ళను పిలిపించి గది కట్టించి "అమ్మా ఇక నుంచి గంగ పెద్ది నీతో బాటు నీకు దగ్గరగా వుంటుంది. ఇద్దరూ తోటపని చూసుకోవచ్చు. మంచీ మాటా చెప్పుకోవచ్చు. ఏమంటావ్ నీకు ఇష్టమేగా.." అని అడిగాడు.

అంజమ్మకి ఆనందంతో మాట రాలేదు. కానీ ఓ మనిషిని అదనంగా పోషించడం ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం కష్టం. కనుక ఏమో నాయనా నువ్వు మణెమ్మా ఆలోచించుకోండి. పిల్లల చదువులు ఖర్చు వుంటాయి. మరో మనిషి భారం అవుతుందేమో నాకిప్పుడు సంతోషంగా వుంది. నాతోడు వుంటుందని భారం తలకెత్తుకోవద్దు" అంది.

"అమ్మా! ఈ స్థలం నీది. గ్రామంలో ఇల్లు అమ్మిన డబ్బుతో కొన్నది. నా పిల్లల చదువు, కుటుంబ పోషణకు నా సంపాదన చాలు. మనకు వున్న దాంట్లోనే మరో మనిషిని ఆదుకోవాలి. అందులోనూ గంగ పెద్ది నీ చిన్ననాటి దోస్తు. నీకు సరిపడా తోడు. కష్టంలో వుంది. మనతో బాటు తింటుంది. ప్రభుత్వ సహాయం కూడా లభిస్తుంది హాస్పటల్‌కి వెళ్ళాల్సి వస్తే. గంగమ్మకి సంతోషమే సగం బలం. నేను వెళ్ళి తీసుకువస్తాను" అన్నాడు సూర్యం.

అలాగే ఆశ్రమం రూల్స్ ప్రకారం కొంత డబ్బు కట్టి "గంగ పెద్దీ ఇక నుంచీ అమ్మా నువ్వూ కలిసి ఒకే చోట వుండవచ్చు అమ్మ నీకోసం ఎదురు చూస్తూంటుంది పద" అంటున్న సూర్యాన్ని చూసి గంగ కళ్ళు చెమర్చాయి. నా బిడ్డ కంటే ఎక్కువ ఆదరం చూపిస్తున్నావ్.. ఎంత మంచివాడివయ్యా.." అంటూ చలించి పోయింది.

"నువ్వయినా సుకంగా వుండు గంగమ్మా. నువ్వు అదృష్టవంతురాలివి" అంటూ సాగనంపారు గంగతో బాటు వున్న తోటివారంతా.

'పాపం వీరిని కూడా ఎవరైనా సూర్యం లాంటి దయామయులు ఆదుకుంటే బాగుండును..' అనుకుంది మంచి మనసుతో గంగమ్మ. రాగానే స్నానం చేయమని నాలుగు చీరలిచ్చింది అంజమ్మ. భోజనం చేసి కూర్చున్నారు.

"మళ్ళీ మనం ఇలా ఒకచోటుకి చేరుకున్నాం. సూర్యం తోటపని అప్పగించాడు. మన ఊళ్ళో మనం చిన్నతనంలో గడిపిన రోజులు గుర్తు వస్తున్నాయి గంగా. చూడు ఈ తోటలో పని చేస్తుంటే కాలమే తెలియడం లేదు నాకు. ఈ మొక్కలు చిగురు వేస్తే ముచ్చటపడతాం. కాయలు కాస్తే మురిసిపోతాం.

# చీకటిలాంటి బాధ

- హరి
8978439551



నిన్ను వెక్కివెక్కి ఏడ్చే
ఒంటరిసముద్రాన్ని చేస్తుంది
ఖాళీ ఖాళీ పేజీలలో
జారుతున్న లోయలాగా
సులువుగా నీలో నిండిపోతుంది
అక్కరలేదన్నా విడిచిపెట్టకుండా
నిన్ను ఉచితంగా హత్తుకుంటుంది

ఎవరో ఏదో చేయాల్సిన పని లేదు
ఓ సన్నని మాట
నీలో బాధై పేలితే చాలు

ఏదో పెద్ద రహస్యాన్ని
నీలో దాచుకొని
కురవని మేఘంలా
బరువు మోయాల్సిన పనిలేదు
నిన్ను కుప్పపెట్టడానికి
ఓ ఇరుకైన దారికానరాని
చీకటిలాంటి బాధొకటి చాలు

ఎన్నో లోతులు చూస్తారు
జీవిత యాత్రలో భాగంగా
వెలుగుల కోసం
ఎక్కడెక్కడో వెతుకుతుంటారు

బాధ లేని చోట
వెలుగుంటుంది వాస్తవమే
వెలుగున్న ప్రతీ చోట
బాధుంటుందని కూడా తెలుసుకోవాలి ◆

---

అనుబంధాలు పెంచుకుంటాం కదూ గంగా" అంది అంజమ్మ.

"అవును. నీ బిడ్డ దేవుడే. రేపటి నుంచీ నేను కూడా నీతోబాటు పనిచేస్తాను. పనీ పాటలు చేసుకునే శరీరాలు మనవి. మళ్ళీ ఈ శరీరాన్ని దారిలోకి తీసుకురావాలి. ఆశ్రమంలో కూడా పని చేయిస్తారు. అయితే అది వేరు. తోటపనిలో ఆనందం వుంటుంది. ఇంటిపనిలో శ్రమవుంటుందేమో కానీ... " అంది.

"మరేం తొందర్లేదు. అలవాటు పడటానికి సమయం కావాలి. మెల్లమెల్లగా చేద్దుగానిలే. రెండు రోజులు హాయిగా తిని నిద్రపో." అంటూ సేదదీర్చింది స్నేహితురాల్ని అంజమ్మ.

ఆ తర్వాత తోటపనిలో గంగ సులువుగా చేయగల పనిని అప్పగించింది. శ్రమలేకుండా ఒకచోట కూర్చుని చేయగల పని చెప్తూ అంజమ్మ మెల్లగా అలవాటు చేసింది. సూర్యం, మణి ఆ వయసులో వారిద్దరి ఉత్సాహం చూసి ఆశ్చర్యపోయారు. అరవైఏళ్ళు వచ్చేసరికి పెద్ద వయసు వచ్చేసింది నువ్వాపని చేయకు అలా కూర్చో అని ఏ వ్యాయామమూ లేకుండా చేస్తే కీళ్ళన్నీ బిగుసుకుపోతాయి తప్ప అది వృద్ధాప్యలక్షణం కాదు. శారీరకంగా కొంత మార్పు రావచ్చు కానీ ఏ పనీ చేయలేరన్నది నిజం కాదు. అందుకే ఈ రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా వృద్ధాప్యం అనే ఆలోచన రాకుండా యోగా, ఎక్సర్‌సైజులు, నడక చేయాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. ఇందువలన అనారోగ్యం అనేది రాదు. అని వీళ్ళిద్దరూ నిరూపిస్తున్నారు" అంది మణి.

"అవును మణీ నువ్వు చెప్పేది నిజం. అమ్మకి గ్రామంలో ఏదో ఒక పని సరిపోయేది. పెద్ద ఇల్లు, పొలం పన్లూ రోజులు ఇట్టే గడిచిపోయేవి. అందుకే అక్కడే వుంటాను అనేది. ఈ తోట తరతరాలకూ ఇలాగే పచ్చగా ఉండాలని మనమే కాదు మన పిల్లలు కూడా తెలుసుకుంటారు. అందుకు కృషి చేస్తారు. మన చిన్నతనంలో ఒక కథ విన్నాం. ఒక తాత మొక్కనాటి నీరు పోసి చుట్టూ కంచె వేసి శ్రద్ధగా సంరక్షిస్తూ వుండేవాడు. అతడిని చూసి అందరూ హేళన చేశారు. "అబ్బో ఈ తాతకి ఎంత ఆశా.. ఈ చెట్టు కాయలు కాసి పళ్ళు పండితే తినాలని.. ఎదురు చూస్తున్నాడు. అది జరిగే పనా.. అని! ఆ రోజుల్లో మొక్క పెరిగి వృక్షమై కాయలు కాయడానికి చాలా సంవత్సరాలు పట్టేది. అప్పుడా తాత "నాయనలారా ఈ మొక్క చెట్టై కాయలు కాసినపుడు నేను చూడకపోవచ్చు. కానీ మీరు మీ పిల్లలూ తప్పకుండా తినగలరు అని భావితరానికి జరగబోయే మేలుకే తానీ మొక్కను పెంచుతున్నట్టు చెప్పాడు. అందులో ఎంత నీతి వుందో!

కాలం మారింది. కాలంతోపాటు మానవ మేధా పెరిగి కొత్త ఆలోచన్లు, అవసరాలూ పుట్టుకు వచ్చాయి. ఇప్పుడు హైబ్రిడ్ విత్తనాలు వేసినా మొక్కలు నాటినా అమ్మ, గంగ పెద్ది చూడగలరు. తినగలరు. మన చేత్తో నాటిన మొక్క ఫలపుష్పాలు, కాయగూరలు ఇస్తుంటే.. వాటిని చూసినపుడు కలిగే ఆనందం, తృప్తి వేటికీ సాటిరావు" అన్నాడు సూర్యం.

"అవును సూర్యం. ఇంట్లో వుండే కుటుంబ పెద్దలను గౌరవిస్తూ వారికి తగిన పని కల్పిస్తే అనారోగ్యం వుండదు సరికదా వారి దీవెనలే పిల్లలకు రక్ష" అంది నాగమణి. ◆

# విద్యుత్ సమరం... సహస్రాబ్ది స్వరం @ 20

- తెలకపల్లి రవి



హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో విద్యుత్ అమరవీరుల స్మారకస్థూపం

నూతన సహస్రాబ్ది ప్రారంభంగా 2000 సంవత్సరంలో తెలుగు సమాజాన్ని సమరపథం తొక్కించిన విద్యుత్తేజానికి సంకేతం విద్యుచ్ఛక్తి పోరాటం. కాలంలో మార్పుతో పాటు రాజకీయాలలో కూడా విద్యుదుద్యమానికి ముందు తర్వాత అని విభజించవలసిన ప్రస్ఫుటమైన ప్రభావం ప్రసరించిన ప్రజాచైతన్య ప్రవాహం. రెండవసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి హైటెక్ పాలకుడుగా సిఇవోగా ప్రపంచబ్యాంకు అడుగు జాడల్లో విద్యుత్ బోర్డును విభజించి ప్రైవేటీకరించి ప్రజలపై రాష్ట్రంపై భారాలు రుద్దిన చంద్రబాబు ప్రభుత్వ విధానాలను నిలవేసిన ప్రతిఘటన. వామపక్షాల చొరవతో మొదలైన కాంగ్రెస్ సహా అన్ని ప్రతిపక్షాలూ ఆ పోరాటంలో భాగం పంచుకోవలసిన పరిస్థితిని తీసుకొచ్చింది. నిర్బంధాలను తట్టుకుంటూ విలక్షణ పోరాట రూపాలను సృష్టించి ప్రజల్లోకి చొచ్చుకువెళ్ళింది. కొత్త తరాలలో సమరశీలత సన్నగిల్లుతున్నదన్న అపప్రదను తుత్తునియలు చేసింది. పోరాటానికి పతాకస్థాయిగా ఆగస్టు 28న చలో అసెంబ్లీ కార్యక్రమం ఒక సంచలనమై బషీర్‌బాగ్‌ను జలియన్‌వాలాబాగ్ అనిపించింది. ఆ అమరవీరులు ప్రజాపోరాటాల చరిత్రలో నిలిచిపోగా లాఠీ దెబ్బలకు, తూటాలకు గురైన ఎందరో కార్యకర్తలు పోరాటా పోతాలు నేర్చుకుని నేటికీ ఉద్యమాలలో ముందు నిలబడుతున్నారు. విద్యుచ్ఛక్తి సమరం రాష్ట్రంలోనే గాక దేశంలోనూ ప్రపంచంలోనూ కూడా గొప్ప ప్రభావం చూపించి ప్రపంచబ్యాంకు ప్రజావ్యతిరేక నమూనాపై ప్రజాఉద్యమాల నిర్మాణానికి స్ఫూర్తి నిచ్చింది. ఆ తర్వాత కొద్ది కాలానికే ఆసియా సామాజిక వేదిక అంతర్జాతీయ సమావేశాలు కూడా హైదరాబాద్‌లోనే జరిగాయంటే ఈ పోరాట ప్రభావమే కారణం. క్షేత్రస్థాయి పోరాటాలతో పాటు మీడియాలోనూ ప్రత్యామ్నాయాలను ముందుకు తెచ్చి కొత్త ముద్ర వేసింది. ప్రజల ఆగ్రహానికి అసంతృప్తికి అద్దం పట్టిన ఈ ఘట్టం తర్వాతనే కెసిఆర్ టిఆర్ఎస్ ఒకవైపు, వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం మరోవైపు తమ తమ రాజకీయ లక్ష్యాలవైపు నడిచాయి. తొమ్మిది వామపక్షాల ఐక్యతకూ ప్రజా సంఘాల సమన్వయానికి వారధిగా నిలిచింది. ఈనాటికీ ప్రజలు ఏ సమస్య వచ్చినా వామపక్షాలే వాటిపై పోరాటానికి ముందుంటాయనే బలంగా విశ్వసిస్తూ అండదండలిస్తున్నారంటే ఆ వరవడి ఒక కారణం. ఇప్పటికీ తెలుగు రాష్ట్రాలలో సూటిగా విద్యుత్ ఛార్జీలు పెంచడానికి జంకుతున్న పాలకులు డొంకతిరుగుడుగా ప్రకటిస్తుంటారు. నాటి నేటి పాలక పక్షాల అవకాశవాదం కారణంగా ఆ విధానాలు మరింత ముదిరిపోయినా కరోనా కల్లోలంలోనూ సమస్యలను వినిపించడమే గాక ఆన్‌లైన్ పోరాటాలు పరిమితుల్లోనే ఉద్యమాలు సాగించడం చూస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా ఎప్పటికైనా పోరాటాలు ఉద్యమాలతోనే పాలకుల పోకడలకు పగ్గాలు వేయడం సాధ్యమనే సందేశమే విద్యుదుద్యమం ఈనాడు మరోసారి కేంద్రం తెచ్చిన సరికొత్త వినాశకర జాతీయ విద్యుత్ విధానాన్ని వెనక్కుకొట్టడానికి మార్గదర్శకంగా నిలిచే చారిత్రక వారసత్వం అది. అందుకే ఆ మహత్తర చైతన్యానికి జేజేలు. ♦




# వలస జీవుల యదార్థగాథ

- డా॥ ఎ.ఎ. నాగేంద్ర
9490188263

*పట్టణాల్లో కరువైన ఉపాధి, పల్లెల్లో వెదుక్కోవాలనే ఆరాటం, కనీసం పల్లెల్లో బతికుంటే బలుసాకైనా తిని బతకచ్చునే నమ్మకంతో ఉన్న వారి ఆశలకు 'లాక్‌డౌన్' ఎలాంటి తాళం వేసింది. వారి ఆశలు, ఆశయాలు ఎలా ఆవిరైపోయాయో ఈ కవితలన్నీ మనతో ఆర్ద్రతతో తమగోడు వెళ్లబోసుకుంటాయి. ఈ అక్షరాల నిండా వలస జీవుల కన్నీటి తడి ఉంది. పట్టుమని సర్దితే రెండు చేతి సంచులకు సరిపడే బ్రతుకు గల పేదల జీవితాలు ఉన్నాయి.*

కరోనా వైరస్ మానవ మనుగడకే సవాలు విసురుతోంది. మనుషుల మధ్య మరణభయాన్ని నిలిపింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమందిని పొట్టన పెట్టుకుంటోంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత మానవుడు ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మనిషి ముందు నిలబడింది.

ప్రకృతిని ధ్వంసం చేస్తూ సాటి మనిషిని తొక్కేస్తూ గర్వంతో ఊగిపోతున్న మనిషికి కంటికి కనిపించని వైరస్ ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

'కరోనా' కట్టడిలో భాగంగా సరైన ముందస్తు వ్యూహం లేకుండా దేశంలో 'లాక్‌డౌన్' ప్రకటించడంతో రోజువారి కూలీలు, రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు, నిర్మాణ రంగంలో కీలక భూమికను పోషిస్తున్న కార్మికుల పరిస్థితి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల లోకి దిగజారిపోయి వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది.

దేశ జనాభాలో దాదాపు 20 కోట్ల మంది అంటే జనాభాలో 15% మంది వలస కార్మికుల బ్రతుకులు గాలిలో దీపంలా మారిపోయాయి. ప్రభుత్వాలు విధించిన 'లాక్‌డౌన్' తక్షణం అమలులోకి రావడం వల్ల చేసేందుకు పనిలేక, తినేందుకు తిండిలేక, ఉండేందుకు సరైన వసతి లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దానికి తోడు 'కరోనా' మహమ్మారి భయంతో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని గడుపుతున్న కార్మికులకు ఎవరూ సరైన భరోసా కల్పించకపోవడంతో చావైనా, బ్రతుకైనా సొంతూరిలోనే అని వాళ్ళు 'నడక' ను మొదలు పెట్టారు. వలస కార్మికుల నడకను చూసి పౌర సమాజం ఆశ్చర్యపోయింది. కన్నీరు పెట్టింది. కొంతమంది అపన్నహస్తాన్ని అందించారు.

మానవహక్కుల కార్యకర్త డా॥ లుబ్నా సార్వత్ పేర్కొన్నట్లు "వలస కార్మికులు లాక్‌డౌన్‌లో జీవించే హక్కు, తమ ఊళ్ళకు తాము పోయే హక్కు, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, జీవనోపాధి హక్కులు ఇలా ఎన్నో కోల్పోయారు. పేద ప్రజల పట్ల బాధ్యతా యుతంగా, గౌరవంగా వ్యవహరించక పోవడం బాధాకరం. ఇలా చేయడమంటే వారి ప్రాథమిక మానవ హక్కులను గౌరవించకపోవడమే" అని అంటారు.

వలస కూలీలు, కార్మికులు సొంత ఊరికి ప్రయాణమయ్యారు. అక్కడ వారికి వెళతానే వడ్డించిన విస్తరి దొరకదు. అక్కడ కూడా వాళ్ళు ఎలాంటి బాధలు అనుభవిస్తారో ప్రసాదమూర్తి ఈ విధంగా అంటారు.

**"అక్కడేమీ విస్తళ్ళలో జీవితం వేడివేడిగా పొగలు కక్కదు అక్కడ కూడా చెంపల మీద చీకటినే తుడుచుకోవాలి. చీకటి పొట్టలో మోకాళ్ళు పెట్టుకు ముడుచుకోవాలి అయినా వాళ్ళు ఇళ్ళకే పోవాలి. ఆకలితో చచ్చినా అక్కడ కనీసం శవాలను గుర్తుపట్టే మరికొన్ని శవాలుంటాయి. స్క్రీన్ మీద జాలువారే**

**ఈ డిజిటల్ కన్నీళ్ళకంటే కొన్ని తడి నీళ్ళయినా వారి ఆత్మలకు అక్కడ తగిలే అవకాశాలుంటాయి."** (పుట 34)

సొంత గ్రామానికి చేరుకుంటే అక్కడ వారికి దారిద్ర్యమే స్వాగతం పలికినా, చివరికి ఆకలితో తనువు చాలించినా, శవాన్ని గుర్తుపట్టే వారుంటారు. అంటూ హృదయవిదారకంగా కవిత్వీకరిస్తాడు కవి.

ప్రభుత్వం ప్రజలకోసం ప్రవేశపెట్టిన పథకాలు పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పేదలకు చేరడం లేదు అనేది అక్షరసత్యం. 'జన్‌ధన్' ఖాతాలు కేవలం ఖాతాలు గానే మిగిలిపోతున్నాయి. సరైన తిండిలేక బక్కచిక్కిన పేదల ఆరోగ్యం ఆరోగ్యసూచీలో ఎక్కడుందో వెతుక్కోవల్సిన పరిస్థితి మనది. డా॥ నూకతోటి రవికుమార్ ఇలా ప్రస్తావిస్తారు.

**"జన్‌ధన్ ఖాతాలు వాళ్ళని చూసి ముక్కు మూసుకుంటాయ్ సరిహద్దు గీతలు వాళ్ళ కన్నీళ్ళ స్రేతో బావురమంటాయ్ వాళ్ళ ఆహారం, వాళ్ళ ఆరోగ్యం చూసి స్వతంత్ర్యం వెక్కెక్కి ఏడుస్తుంది. ఉదారగుణంలో పేరొందిన లెక్కలేనన్ని ట్రస్టులు స్వర్ణభారతంలో తడిసి పునీతం అవుతాయి."**

రెండు సందర్భాలలో దేశంలోని ప్రజలు ఉలిక్కిపడి, ఎంతటి కష్టాలు ఎదుర్కొన్నారో మనందరికీ తెలుసు. ఉన్నట్టుండి పిడుగు లాంటి వార్త "నోట్ల రద్దు". కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టుండి నోట్లరద్దు ప్రకటించినప్పుడు ఎన్నో ఇబ్బందులకు గురైంది. పేదలు, సామాన్య జనమే. మృత్యువుకు వేలాడింది కూడా సామాన్య ప్రజలే. 'క్యూ' లైన్లో నిలబడి ప్రాణాలు వదిలిందీ పేద ప్రజలే. ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం తక్షణ 'లాక్‌డౌన్' వల్ల పేదలు, కార్మికులు, సామాన్య ప్రజలే ఎక్కువ సమస్యలు ఎదుర్కొన్నది ఎదుర్కొంటున్నది. నిరంతరం పేదల వైపు నుంచి ఆలోచించే కవి కోడూరి విజయ్‌కుమార్ ఇలా కవిత్వీకరిస్తున్నారు.

**"రేపటి పని దినానికి సిద్ధమవుతున్న సాయంత్రం రాబోయే సెలవు దినం ఊహల్లో వున్న సాయంత్రం మన జేబుల్లోని పచ్చనినోట్లు చెల్లని నోట్లయిన రోజులానే ఒక ఆకస్మిక ప్రకటన వినిపించింది 'స్టే హోం - ఇళ్ళలోనే'**

మన దేశ ఆర్థిక వ్యవస్థను మెడపట్టి కిందకి లాగింది 'కరోనా వైరస్' అని మేధోమధనాలు మేధాసదస్సులు అన్నీ డొల్ల విశ్లేషణ గారడీతో 'ఢీ' లా పడుతున్నాయంటూ చెబుతూ, ఏదేశంలోనైనా శ్రీమంతులు బాగానే ఉంటారు. పేదలే నిరుపేదలవుతారంటూ ఆవేదనతో ఇలా అంటారు. ప్రముఖకవి డా॥ ఎన్.గోపి

**"సకల మేధస్సులూ/ డొల్ల విశ్లేషణల్లో డీలా పడ్డాయి"**

**"ఏ దేశంలోనైనా/శ్రీమంతులు బాగానే ఉంటారు/ ఎల్లని వారిదేలొల్లి"** మనిషి, మానవత, సహనం, సంకల్పం ఈ పదాలన్నీ నిరర్థకంగా రాలిపోతున్నాయి అంటూ ఆవేదన చెందుతాడు కవి.

చరిత్ర చెక్కిలపై ఎర్రటి కన్నీటి శిల ఎడతెగని ప్రయాణంలో దుఃఖపు మూటలు మోసుకెళ్ళుతున్న అభాగ్యుల దీనఘోష గురించి లావణ్య సైదీశ్వర్ ఇలా చెబుతారు.

**"ఎక్కడికని వెళ్లను/ గాయం చేసిన చోటు నుండి/ ఎలా అడుగెయ్యను/ తిరస్కృతుల సమూహం నుండి"**

ఒకప్పుడు ఉపాధి కోసం ఆహ్వానించిన నగరమే ఇప్పుడు గాయపడింది. నన్ను తిరస్కరిస్తూ వెళ్ళి పొమ్మంటున్నదంటూ ... నేను ఎలా అడుగు వేయను అంటూ నగరానికి, కార్మికునికి, నగరానికి కూలీకి ఉన్నా అవినాభావ సంబంధాన్ని ఆర్ద్రతతో చెబుతారు కవి.

ఇప్పుడు నడాలే కాదు, నవ్వులు కూడా విరిగి పోతున్నాయి. ఎన్నో సవాళ్ళు చుట్టుముట్టు తున్నాయంటూ వలసజీవుల ప్రయాణంలో ఎదురయ్యే సంఘటనలు కళ్ళ ముందు ఉంచుతాడు కవి.

**"విరిగిన నవ్వులొక వైపు/ నిశ్శబ్ద సవాళ్ళింకొక వైపు/ అబద్దపు చిరునామాల్లో/ రుజువు కాని అవ్యక్త ప్రయాణం"**

ఎండిపోయిన డొక్కల్ని పట్టుకొని వలస వెళ్ళిన పేదజీవులు, 'లాక్‌డౌన్' కారణంగా తిరిగి వస్తే, ఇక్కడ కూడా వారికి పిడికెడు మెతుకులు దొరక్క మరణిస్తారో, లేక కరోనా ద్వారా మరణిస్తారో తెలియని సందిగ్ధ పరిస్థితులు ఉన్నాయి. విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలలోని శాస్త్రవేత్తలు కరోనా వైరస్‌తో పాటు 'ఆకలి' కి కూడా మందు కనిపెట్టి ఆకలిలేని సమాజాన్ని ఆవిష్కరించాలని కవి ఆశగా అర్థిస్తున్నాడు.

**"పిడికెడు మెతుకుల కోసం/ ఎండిన డొక్కలకు ఆశల రెక్కలను అతికించి/ సప్త సముద్రాలు దాటి వెళతాయి వలస పక్షులు/...../..../ శాస్త్రవేత్తలారా....!/ కరోనా వైరస్‌తో పాటు/ ఆకలి వైరస్‌కూ మందు కనిపెట్టండి!!"**

ఈ దేశంలోని పేదలకు ఎలాంటి బాధ్యత, హక్కులు ఉన్నాయి. ఉన్నవాడికి ఒక న్యాయం లేని వారికి మరోన్యాయం. నోరున్న వాడిదే రాజ్యం. దోపిడీ అవినీతి అనే అంటువ్యాధితో సమాజం ఎలా కునారిల్లుతూ లాక్‌అప్‌లో వుందో స్పష్టంగా

వివరిస్తాడు రామచంద్రమౌళి కవి.

**"నిజానికి/ ఈ దేశం కొన్ని దశాబ్దాలుగా దీర్ఘ దోపిడీ, అవినీతి అనే అంటువ్యాధితో/ 'లాక్‌అప్' లో వుంది"**

మానవత్వం లేని మనుషుల్ని, బాధ్యతలేని ప్రభుత్వాన్ని మీడియా గొట్టాల ముందు సారం లేని స్టేట్‌మెంట్‌లు వదిలే పబ్లిసిటీ పిచ్చోళ్లు గురించి నిక్కచ్చిగా "మేమింతే" అంటూ చక్కగా చెబుతాడు కవి మల్లెగోడ.

**"ఏ దేహాల వీపులు ఇటుకలు మోసాయో**
**ఏ దేహాల భుజాలు సౌధాలను కట్టాయో**
**ఆ దేహాలను రాత్రంతా పట్టాల వెంట నడిపిస్తాం**
**అక్కడే పడుకోబెడతాం, బతుకుల్ని ఛిద్రం చేస్తాం**
**అరెరె ఘోరం జరిగిందే అని ట్వీట్లు పెడతాం**
**నేల పగుళ్లను, రక్తధారలను అరికాళ్లలో తెప్పిస్తాం**
**అరెరె హృదయవిదారకం అని స్టేట్‌మెంట్స్ ఇస్తాం"**

అంటూ ప్రస్తుత వ్యవస్థను తూర్పారపడతాడు కవి.

భారత్ వెలిగిపోతోంది. స్వర్ణభారతం అంటూ గొప్పలు చెప్పే ప్రభుత్వాలు, పేదరికం తగ్గిపోయిందంటూ అసత్య గ్రాఫ్‌లతో పాలన చేస్తున్న ప్రజానాయకుల్ని 'రోడ్డును నిందిద్దాం రండి' అంటూనే వ్యవస్థలోపాలను ఎత్తిచూపుతాడు గుడిపల్లి నిరంజన్.

**"ఈ రోడ్డు ఏందిరా బై/ దేశ రహస్యాలన్నీ బయట పెట్టేసింది/ విత్తనం భూమి పొరలను చీల్చుకొని/ మొలకెత్తినట్లు ఈ వలస కూలీలు రోడ్డును/ రక్తం ధారలతోనే నింపుతున్నారు"**

అంటూనే

**"ఆకలైనా అన్నం లేకున్నా/ దేశభక్తి చూపించాలి అన్న మినిమమ్ మానర్స్ లేదు/ అనేకానేక లేత పిల్లల ముఖాల్లో/ ఆకలి భారతం వినిపిస్తున్నా/ మూటల్తో ముల్లెలతో రోడ్డు మీదకొచ్చి/ నడవడం నిజంగా నేరమే"**

మన భారతదేశంలోని యదార్థ సంఘటల్ని మన ముందు నిక్కచ్చిగా ఆవిష్కరిస్తారు.

ప్రతి మనిషి ఎన్ని దేశాలు, ఎన్ని ప్రదేశాలు తిరిగినా చివరికి అతనికి సొంత ఊరే స్థానికత 'నేటివిటి'. మనిషికి తన సొంత ఊరుపై ఉన్న 'మర్లు' గొప్పగా ఉంటుంది. తన సొంత మట్టిపై మమకారం ఎనలేనిది. ఎన్నో బాల్యస్మృతులు అతన్ని అల్లుకొని వుంటాయి. గట్టు రాధిక కూడా అలాంటి ఆలోచనల్ని మన ముందు పరుస్తోంది.

**"ఇక్కడి గాలినెందుకో పీల్చుకోలేక పోతున్నాను**
**నా చూపంతా పుట్టినూరు దిక్కు బిక్కు బిక్కుమని చూస్తుంది**
**గుండెలో అంతా అక్కడి జ్ఞాపకాలేవో కొట్టుకుంటున్నాయి**
**అందుకే ఇక్కడి నుండి వెళ్ళిపోతున్నాను**
**కంటికందని నా ఊరిని చేరుకోవడగానికి**
**నా ఊరిలో**
**నా కోసం ఎదురుచూసే**
**ఆరడుగుల నేల కోసం మొఖం మీదేసుకొనె**
**పిడికెడు మట్టికోసం"** (పుట 160)

'లాక్‌డౌన్' వల్ల ఛత్తీస్‌ఘడ్ వలస కూలీలు సొంతూరికి బయలుదేరే క్రమంలో అలసిపోయి పట్టాలపై నిద్రించడం వల్ల ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో పట్టాలపై నిద్రిస్తున్న వలస కార్మికుల మీద నుంచి గూడ్స్ రైలు దూసుకెళ్ళిన ఘటనలో 16 మంది మరణించారు. ఈ సంఘటన ఎంతోమందిని కదిలించి కన్నీరు పెట్టించింది. ఈ సంఘటనపై చలించిన కవి మిత్రుడు తండ హరీష్‌గౌడ్ గుండెల్ని పిండే విధంగా ఆవిష్కరిస్తారు.

**"మాయదారి పురుగు/ ఇంతదూరం రాదనుకున్నట్టే/ రక్తం పీల్చే ఈ రైలు రాదనుకున్నాం/ఇయ్యాళ నుజ్జునుజ్జయిన శరీరాలు/చిందిన రక్తం మీ కళ్ళకు కనబడ్డాయి/ ఇవాళ మీ కళ్ళముందు సానుభూతి కోసం/ కొత్తగా సచ్చిపోయినం అంతే!"**

సామాన్య జనం గౌరవం లేక, భద్రత లేక వారిపై పాలకులకు కనికరం లేక ఎప్పుడో సచ్చిపోయారు. ఇవాళ మీ కళ్ళముందు సానుభూతి కోసం కొత్తగా సచ్చిపోయినం అని చెప్పడం. పేదల్ని గౌరవించని వారి హక్కుల్ని కాపాడలేని మనందరం ప్రశ్నించుకోవాల్సిన సందర్భం.

సరియైన తిండిలేక, ఎముకల గూడు మోస్తున్న పచ్చి బాలింతరాలు తన బిడ్డకు పాలు ఎలా ఇవ్వగలదు. కానీ బిడ్డ ఏడుపు మాన్పించడానికి పాలురాని స్తనాన్ని నోట్లో పెట్టి బిడ్డ ఏడుపు మాన్పించడానికి తల్లి పడే యాతన వర్ణనాతీతం. అలాంటి సాక్ష్యం తంగిరాలసోని ఈ కవిత హృదయాన్ని ద్రవింపజేస్తుంది.

**"పాలురాని తల్లి స్తనాలను చీకుతున్న చిన్నారి**
**చెంపలపై కారిన కన్నీళ్లు**
**కొన్నివేల సంవత్సరాలు చరిత్రను చెబుతున్నాయి**
**గుడిసె పక్కన ఒట్టిపోయిన కుండ**
**ఎన్నిరోజులు పొయ్యి రాజేయలేదో సాక్ష్యం పలుకుతుంది**

**కట్టెలు మండుతున్నాయి ఆకలి మండుతుంది"**

కవిత్వంలో వేగం పెంచుతున్న కవి, సారవంతమైన కవిత్వాన్ని అందించాలనే ఉబలాటపడే కవి ఆది ఆంధ్ర తిప్పేస్వామి.

ప్రభుత్వం ప్రకటించిన కోట్ల ప్యాకేజీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూనే, పూలవర్షం కురిపించడం, అద్దాల భవంతుల్లో నిలబడి చప్పట్లు చరచడం, గంటలు మ్రోగించడంతోనే మన పని అయిపోలేదని, వందల కిలోమీటర్లు నడుస్తున్న వలస కూలీలు వారి సొంత గ్రామాలకు పోవడానికి ఎంతటి క్షోభను అనుభవిస్తున్నారో ప్రభుత్వం ఎందుకు పేద కార్మికులను, పేదకూలీలను పట్టించకోలేదో ఆక్రోశిస్తూ, చంటి బిడ్డను చంకలో నెత్తిన బరువైన మూటతో భారంగా అడుగులు వేస్తున్న స్త్రీమూర్తిని గౌరవిస్తూ రాసిన కవిత ఇది.

**"క్షమించు తల్లీ!/ నిచ్చెనేసి/ ఆకాశంలో నిలబెట్టాలని నువ్వెన్నడు అడగలేదు/ సొంతూరికి చేర్చమని కాళ్ళా వేళ్లా పడుతున్నావు!/ రోజూ పరమాన్నంతో కడుపునింపమని కోరలేదు/ ఆకలితో చచ్చిపోయే ప్రాణాలకింత/ గంజి పోయమంటున్నావు అంతే!"** అని అంటూ

**"కోట్ల ప్యాకేజీలు/ ఏ అద్దాల మేడల్లో వేలాడుతున్నవో"** అంటూ నర్మగర్భంగా పాలకుల్ని నిలదీస్తాడు.

**"నెత్తుటి సంతకాలు చేసుకుంటూ వెళ్ళే నీకు**
**చలువ పందిళ్లు పరచి పూలవానలు కురిపించలేను**
**చిమ్మ చీకటిని చీల్చుకుంటూ మైళ్ళ దూరానికి**
**రెక్కలు తొడిగి నీకు దారి దీపాన్ని కాలేక పోతున్నా!"**

నీవు నడిచే దారిలో నీ కాళ్ళు వెంట రక్తం కారి నెత్తుటి సంతకాలు చేసుకుంటూ, చిమ్మచీకటిని చీల్చుకుంటూ ముందుకు వెళుతున్నావు. ఆ క్రమంలో నీకు దారి దీపాన్ని కాలేకపోతున్నాను క్షమించు తల్లీ అంటూ కవి ఆవేదన చెందుతాడు.

ప్రముఖ కవి డా॥ కత్తి పద్మారావు భారతదేశ సంపద ఎవరి చేతుల్లో ఉందో ప్రశ్నిస్తారు. భారతదేశ నిర్మాణమంతా కుల, మత వైషమ్యాలే అంటారు. 'సర్వేజనా సుఖినోభవంతు' అని చెబుతారు కానీ మాటకు చేతకు అనంతమైన వైరుధ్యం ఉందంటాడు. వేదాంతంకడుపునిండిన వాడికి, కడుపులో వేదన ఉండేవాడికి పట్టెడు మెతుకులు కావాలంటూనే మనిషి లేని చోట దేవుడు లేడనే సత్యాన్ని చెబుతాడు.

**"వేదాంతం కడుపునిండిన వాడికి**
**కడుపులో వేదన ఉండేవాడికి కావాల్సింది**
**పట్టెడు మెతుకులు దోసెడు నీళ్ళు"**

'వలస దుఃఖం' సంకలనంలోని కవితలన్నీ పేదల, వలసకార్మికుల, అసంఘటిత కార్మికుల పక్షం వహించి పాలకుల అనాలోచిత నిర్ణయాల్ని ప్రశ్నిస్తాయి.

అభివృద్ధి అంటే అద్దాల మేడలు, సుందర నగరాలే కాదని, పేదవారికి పట్టెడన్నం పెట్టే చేతులు కావాలని గొంతెత్తి కోరుతాయి.

కరోనా మహమ్మారి తమ జీవితాల్ని అతలాకుతలం చేస్తే, పాలకుల నిర్లక్ష్యం తమ జీవితాల్ని ఎంతటి ఆవేదనకు గురిచేసిందో సూటిగా చెబుతాయి.

పట్టణాల్లో కరువైన ఉపాధి, పల్లెల్లో వెదుక్కోవాలనే ఆరాటం, కనీసం పల్లెల్లో బతికుంటే బలుసాకైనా తిని బతకచ్చనే నమ్మకంతో ఉన్న వారి ఆశలకు 'లాక్‌డౌన్' ఎలాంటి తాళం వేసింది. వారి ఆశలు, ఆశయాలు ఎలా ఆవిరైపోయాయో ఈ కవితలన్నీ మనతో ఆర్ద్రతతో తమగోడు వెళ్లబోసుకుంటాయి.

ఈ అక్షరాల నిండా వలస జీవుల కన్నీటి తడి ఉంది. పట్టుమని సర్దితే రెండు చేతి సంచులకు సరిపడే బ్రతుకు గల పేదల జీవితాలు ఉన్నాయి. పేదలు కూటికి పేదవారు కావచ్చు కానీ గుణానికి కాదు అని నిరూపించే నిజాయితీ పరుడైన తండ్రి ఇక్బాల్ కన్పిస్తాడు. పట్నం ఎండమావుల్లో ఎంత తోడుకున్నా ఏమి మిగలడం లేదనే విషాద సత్యాన్ని, ముస్లింలు తమ దేశభక్తి నిరూపించుకోవడానికి పడే పాట్లు, దుఃఖమెప్పుడూ అరికాలిని లేచిన పుండులా ఉండటం, చిరిగిన బతుకులు కట్టుకోలేని నిస్సహాయ పేదలు, వలస భారతంతో పాటు ఆకలిభారతం కన్పిస్తుంది.

**'వలస దుఃఖం'** మీద తడితడి కవిత్వాన్ని ఎంపిక చేసిన సంపాదకులు బిల్ల మహేందర్, డా॥ ఏరుకొండ నరసింహులు కు శుభాకాంక్షలు.

మొత్తం 110 మంది కవులు రాసిన కవితలతో ఈ పుస్తకం నిండుగా ఉంది. కవులందరూ సామాజిక బాధ్యతతో ఆర్ద్రతతో రాసిన అక్షరాలే మనకు అందించారు.

సీనియర్ కవులతో పాటు వర్ధమాన కవులు, కవయిత్రులు రాసిన కవితలు ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి. కవులందరూ తడికలాలతో రాసిన కవితలన్నీ మన హృదయాన్ని కదిలిస్తాయి. **'వలస దుఃఖం'** సంకలనం నిండా వలసజీవుల యదార్థగాథ మనకు కనిపిస్తుంది. ♦

## నివాళి



22.2.1939 - 25.8.2020

# కలువకొలను సదానంద కన్నుమూత

ప్రముఖ రచయిత కలువకొలను సదానంద ఆగస్టు 25న తుదిశ్వాస విడిచారు. ఆయన బాలల కథలు, గేయాలు, నవలలతో పాటు తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలో రచనలు చేసి పేరు పొందారు. 1939 ఫిబ్రవరి 22నచిత్తూరు జిల్లా పాకాలలో నాగమ్మ, కృష్ణయ్య దంపతులకు ఆయన జన్మించారు. 1958లో ఆయన తొలి కథానిక "రచన ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితమైంది. తర్వాత కాలంలో తెలుగు స్వతంత్ర, సైనిక సమాచార్, జయంతి, స్రవంతి, ఆనందవాణి, చిత్రగుప్త, భారతి, ఆంధ్రపత్రిక ఆయన రచనలను ప్రచురించాయి. ఆయన కేవలం రచనలకు మాత్రమే పరిమితం కాకుండా కార్టూన్లు కూడా వేసేవారు. నిజాయితీగా, వాస్తవిక ధోరణితో స్వేచ్ఛగా రచనలు చేసేవారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిగా పనిచేసినా అందులోనూ ప్రతిభ కనబరిచారు. 1992లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ పురస్కారం అందుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సత్కారం సైతం పొందారు. రక్తయజ్ఞం, పైరుగాలి, నవ్వే పెదవులు ఏడ్చే కళ్లు తదితర కథా సంపుటాలను రచించారు. గాడిద బ్రతుకులు, గందరగోళం, బంగారుమామ వంటి నవలలు రాశారు. ఆయన రచించిన అడవితల్లి నవలకు 2010 లో కేంద్రప్రభుత్వ సాహిత్య అకాడమీ అవార్డును సైతం అందుకున్నారు. 1992లో ఉత్తమ ఉపాధ్యాయునిగా జాతీయ అవార్డును పొందారు. నవ్వే పెదవులు-ఏడ్చేకళ్లు కథల సంపుటికి ఆంధ్ర సాహితీ అవార్డు అందుకున్నారు. సృజనాత్మక సాహిత్యానికి తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం, వెల్లువలో మనం కవితా సంపుటికి కుప్పం రెడ్డమ్మ సాహితీ సత్కారం, డాక్టర్ నన్నపనేని మంగాదేవి బాలసాహిత్య పురస్కారం, పులికంటి సాహితీ సత్కారం, అధికార బాషాసంఘంవారి బాషా పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు వెలుగు పురస్కారాలు పొందారు. ◆

# గాయపడ్డ పిడికిళ్లు

కవిత

- మల్లారెడ్డి మురళీ మోహన్
8861184899

*ఊపిరి పీల్చుకోడానికి, ఉనికి నిలుపుకోడానికీ,*
*ఇప్పటికీ ఉద్యమాల అవసరం తీరని*
*పురోగామి నాగరికత నీదీ-నాదీ!*

*పోరులో ఓటమి నీది, నాది మాత్రమే కాదు,*
*సమిష్టిగా సమాజానిది...*
*శత్రువు గెలుపుకి బాధ్యులెవరో కాదు*
*ఇలాంటి సంక్లిష్ట సంఘ నిర్మాణంలో*
*ఓ పాత్ర పోషించిన నువ్వూ-నేనూ!*

*విషం పూసుకున్న అరచేతులు*
*రహస్యాలు దాచుకున్న గుప్పిళ్లవుతాయి,*
*నినాదాన్ని అమ్ముకుని, అర్థించే దోసిళ్లవుతాయి కానీ,*
*రణ నినాదాన్ని రచించే పిడికిళ్లు కాలేవు.*

*పోరాటాలని గాజుతెరల పరదాలపై జాలిపడుతూ*
*చూస్తుంటాన్నేను*

*రేపటి నా పోరాటాన్ని నువ్వూ*
*ఏ రంగు కళ్లద్దాలతోనో చూసి జాలిపడు...*
*ఇలా చీలిన మన ఒంటరిపోరాటాలు*
*సంఘటితం కానంతవరకూ,*
*పిడికిళ్లను పూలు కోసినంత సుకుమారంగా కోసి,*
*మన సమాధులనే అలంకరిస్తున్న*
*సంక్షుభిత కాలంలోనే ఉంటాం...నువ్వూ-నేనూ!*

*నడిపించలేని నాయకుల మధ్య,*
*రంగు వెలిసిన జెండాల నీడలో,*
*చెమటకు విలువలేని నాగరికతలో,*
*ఓటు వేసిన బందీలం, బానిసలం నువ్వూ-నేనూ!!!* ◆

## గాయాల దండయాత్ర

- వల్లభాపురం జనార్దన
9440163687

ముట్టడి - దాడి - ముట్టడి -
దాడి
జీవితం చుట్టూ
ఆలోచనల చుట్టూ
బతుకుచుట్టూ
స్వేచ్ఛ గొంతుచుట్టూ
గాయాల ముట్టడి-దండయాత్ర
రెక్కలు తెగి పడడం
కండలూడి పడడం
కీళ్లు విరగడం
కాళ్ళు విరగడం
చీకటి కీకారణ్య ముట్టడి
తడి ఆరకముందే తగులుతున్న
కొత్తగాయం
పటుత్వాన్నీ - మానసిక బలాన్నీ
నిరోధక శక్తినీ - ధ్యేయాన్నీ
నిప్పుల కుంపట్లోకి
దొబ్బుతున్నది

తగులుతున్న గాయాలు ఊపిరాపేస్తుంటే
మానువట్టుతున్న గాయాలు
ప్రాణం మీద తీపికి
పహరా కాస్తూనే
ఎదురుదాడికి సిద్ధమౌతున్నవి
జీవితం తుఫాను తాకిడికి విరిగిన చెట్టు
అగాధంలోకి పడిపోతున్న శిఖరం
పడిలేస్తున్న కెరటం
సామాజిక భద్రత
మానసిక సమర్థత
చైతన్య సంజీవని దొరకక
ఒయాసిస్సును పోగొట్టుకుంటున్న ఎడారి
అయినా జీవితం
మలాములు
పూసుకొని
కొత్తరక్తాన్ని నింపుకుంటూ



దౌష్ట్యపు గుండెకు రక్త సరఫరా
ఆపేస్తూ
వరద తర్వాత శిరసెత్తిన
గరిక పోచలా సగర్వంగా
పతాకై ఎగురుతుంది ◆

## మౌనరోదన

కరోనా కవిత

సి. శేఖర్
9010480557

మనసెందుకో
మౌనంగానే
లోలోపల రోదిస్తుంది

రోజురోజుకు మనుషులు
తమకు తామే విచక్షణ మరచి
విచ్చలవిడితనాన్ని
చూపుతుండ్రు

పెనుతుఫానులా
ధరణిపై దావాణంలా
కనిపించకుండా దహనం
చేస్తుంది
కరోనా కాలనాగు విషాగ్నులు
కుమ్మరిస్తూ
మరణమృదంగం మోగిస్తుంది
పీల్చేగాలిలో జీవనం చేస్తూ
మానవ జీవనగమనంలో


భవిష్యత్తో పీడకలై
నడిసంద్రంలో అలజడిలా
నరకయాతనచూపి బతికున్నప్పుడే
జీవితాలను బలిస్తున్నది

లోకంలో
మనిషితీరు మారడంలేదు
కాటేసే కరోనా జోరు ఆగడం లేదు

భయమేస్తోంది
కరోనాకంటే కూడా
బాధ్యతెరగని జనాన్ని
వారిలో నిర్లక్ష్యపు ధైర్యాన్నిచూసి
ఏంజరిగినా మనకేమి
కడపదాటితే
మనకుమనమే దిక్కుతోచని
దీనస్థితిలోకి జారుకుంటామందరం

మందులేని మాయరోగం
కరోనాకు కళ్ళెమెవడేస్తడోనని
జగతంతా ఎదురుచూస్తున్నరు
శ్మశానాలన్నీ సస్యశ్యామలంగా
రోజుకో వేడుకై వెలుగులీనుతున్నాయ్
భయంగానే

స్థితప్రజ్ఞత కలిగి
విచక్షణనెరిగి
వివేకమెరిగి
కరోనా భూతాన్ని తరిమి
వర్తమాన వీరుడుగా
విజయాన్నందుకో..
జగతిని రక్షించుకో
భవిష్యత్తును నిర్మించుకో ◆




# దేవరాజు మహారాజు వైజ్ఞానిక నాటికలు

- కె.పి.అశోక్ కుమార్
9700 000948

*అందరికీ అర్థమయ్యే రీతిలో సహజంగా, సులభంగా వుండే విధంగా కథ – సంభాషణలతో ఈ నాటికలను తీర్చిదిద్దారు. శాస్త్రీయత, హేతువాదం, తార్కికతలతో కూడిన వైజ్ఞానిక నాటికలతో శ్రోతలను ఎడ్యుకేట్ చేయడానికి ప్రయత్నించడంలో దేవరాజు మహారాజు కృషి అభినందనీయం.*

తెలంగాణ ప్రజల భాషలో కవిత, కథ చెప్పి మెప్పించి దేవరాజు మహారాజు కవిగా, కథకుడిగా స్థిరపడ్డారు. భారతీయ భాషల కవిత్వాన్ని తెలుగులోకి అనువదించి, తెలుగు కళ్ళకు ఇరుగుపొరుగు దృశ్యాల్ని చూపించారు. తెలుగు సాహిత్య పాఠకులకు ఒక కొత్త కిటికీ తెరిచారు. వెండితెర కవిత్వంగా కొనియాడబడుతున్న భారతీయ సమాంతర సినిమాను విశ్లేషించారు. ఆధునిక యుగ వైజ్ఞానిక స్పృహతో జానపద సాహిత్య పరిశీలన చేశారు. సమాజంలో శాస్త్రీయ అవగాహనను పెంచడానికి విజ్ఞాన శాస్త్ర గ్రంథాల్ని ప్రచురించారు. బాల సాహిత్యంలోనూ, రేడియో నాటకరంగంలోనూ కృషిచేశారు. వీరు రాసిన వైజ్ఞానిక రేడియో నాటికలు "లైఫ్ టానిక్" పేరిట 2007 లోనే పుస్తక రూపంలో వచ్చాయి.

125 ఏళ్ళుగా విలసిల్లుతున్న తెలుగు నాటక రంగంలో వైజ్ఞానికపరమైన నాటకాలు ఎన్ని వచ్చాయో చెప్పమంటే తడుముకోక తప్పదు. శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధత, తార్కికత వున్న రచయితలే వైజ్ఞానిక పరమైన రచనలు చేయగలుగుతారు. ప్రయోగదృష్ట్యా కూడా దృశ్య మాధ్యమం కంటే శ్రవ్య మాధ్యమమే దీనికి అనుకూలమైనదని చెప్పవచ్చు. ఎందుకంటే స్వరాన్ని, శబ్దాన్ని, సంగీతాన్ని ఉపయోగించి కాల్పనిక, స్వాప్నిక వాతావరణాన్ని సులభంగా సృష్టించవచ్చు. అందుకే అనేక ఆధునిక వాదాల ప్రయోగాలకు రేడియో అనువైనదిగా మారింది.

తెలుగులో మొట్టమొదటి రేడియో నాటిక 1938 లో ముద్దుకృష్ణ రచించిన "అనార్కలి". తర్వాత కాలంలో రేడియో నాటికలు విశేష ప్రజాదరణను పొందాయి. తెలుగులో వున్న ప్రముఖ రచయితలు – కవులందరూ దాదాపుగా రేడియోకు వ్రాసినవారు వున్నారు. ప్రజాదరణను బట్టి రేడియో నాటకాలను పున:ప్రసారం చేయడం మామూలే. కాని రేడియో నాటకాలుగా పేరు గడించిన వాటిని, పుస్తకాలుగా వేసినవారిని వేళ్ళమీదనే లెక్కబెట్టుకోవాల్సి వస్తుంది. బుచ్చిబాబు, కొడవటిగంటి, గోరాశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, గొల్లపూడి, ఆదివిష్ణు లాంటి కొద్ది మంది మాత్రమే కనిపిస్తారు. రచయితలకు స్వయంగా అచ్చు వేసుకునే స్థోమత లేక, పబ్లిషర్లు ముందుకురాక ఎన్నో మంచి నాటకాలు గాలిలో కలిసిపోయాయి.

వీటన్నింటిలో వస్తువరంగా, శిల్పవరంగా ప్రయోగాత్మకంగా వెలువరించిన శ్రీశ్రీ నాటకాలే 1+1=1 పేరుతో పుస్తకంగా వెలువడ్డాయి. ఈ సంపుటిలో వున్న "చతురస్రం, మరో ప్రపంచం, అనంత యాత్ర, గవేషణ"

అనే నాటికలను వైజ్ఞానిక నాటకాలుగా పేర్కొంటారు. నిజానికి వీటిని వైజ్ఞానిక నాటకాలుగా చెప్పడానికి వీలులేదు. ఇవి మానవుడి భవిష్యత్తును గురించిన ఊహలకు సంబంధించినవి. వీటిలో రచయిత కాలంతో, దేవుడితో, మృత్యువుతో పోరాడటానికి ప్రాధాన్యతనిస్తాడు. ఇందులో ముఖ్యంగా "చతురస్రం" నాటికను చూద్దాం. 1999 డిసెంబర్ '31వ తేదీతో, ఈ నాటికలో కథ ప్రారంభమవుతుంది. చంద్రలోకం నుంచి మానవుడు తెచ్చిన అమృతాన్ని ప్రపంచ ప్రజలందరికి పంచాలని ఐక్య రాజ్య సమితి నిర్ణయిస్తుంది. ఈ సమావేశంలో బ్రిటన్, అమెరికా లాంటి అగ్ర రాజ్యాలు ఆ ప్రయత్నాన్ని నిరోధిస్తాయి. ఆఫ్రో–ఆసియన్ రాజ్యాల తరఫున లుముంబా జూనియర్ ప్రతిపాదించిన తీర్మానం నెగ్గి అమృతాన్ని పంచడానికి నిశ్చయిస్తుంది ఐక్యరాజ్యసమితి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి డాక్టర్ వచ్చి ఇంజెక్షన్ల రూపంలో, టాబ్లెట్ల రూపంలో – వివిదాభిప్రాయాలు గల జ్ఞానం, రాజ్యం, సిరి, కళలనే వ్యక్తులకు – అమృతం ఇచ్చి వెళతాడు. అందరూ ముప్పై ఏళ్ళవారవుతారు. ఇక వాళ్ళలో గొడవ మొదలవుతుంది.

ఇదే పోలికలతో వచ్చిన దేవరాజు మహారాజు రాసిన "లైఫ్ టానిక్" రేడియో నాటికను చూద్దాం. ఇందులో మానవాళిని మృత్యుముఖం నుంచి తప్పించే లైఫ్ టానిక్‌ను అమెరికాలో స్థిరపడ్డ ప్రొ.రావు కనుక్కుంటాడు. ఆయన ఢిల్లీ వెళ్ళి అక్కడి నుండి ప్రపంచ పౌరులకు అమృత్ – ఇండియా పంపిణి చేసే కార్యక్రమాన్ని తలపెడతాడని రేడియోలో న్యూస్ వస్తుంది. "దీనికి మెడికల్ సైన్స్ ఒప్పుకోదు. అందరూ బతికితే, ఆరోగ్యంగా వుంటే మా ప్రాక్టీస్ ఏంకాను?" అని డాక్టర్ ప్రశ్నిస్తాడు. ఎంజాయ్ చేయాలనే మనస్తత్వం కల విలాస పురుషులకు ఇది బాగానే వుంటుంది. ప్రతిదాన్ని ప్రశ్నించే మనస్తత్వం కల కారుడ్రైవర్ కొండన్న "మానవుడు మరణం లేకుండా దేవుడ్ని జయించాడా? లైఫ్ టానిక్ కనిబెడితే దేవుడేం కావాలని" అనుమానిస్తాడు. ఇతడు విచక్షణా జ్ఞానంతో ప్రవర్తిస్తాడు. దేవుడు హేతుబద్ధంగా మాట్లాడి, మానవశక్తి గురించి గొప్పగా చెబుతాడు. స్వామిజీలో మంచి తార్కికత వుంటుంది." మరణాన్ని జయించడం వేరు. ఆయువును పొడిగించడం వేరు.ఉదా: లక్ష్మణుడు, భీష్ముడు. ఒకవేళ సాధ్యమైతే అతను జీవించదలచుకున్నది ఏ ఉన్నతాదర్శాల కోసం?" అని ప్రశ్నిస్తాడు. మరణం ఎంత అద్భుతమైన అనుభవమో పేషంట్ తెలియజేస్తాడు. సైకియాట్రిస్ట్ మరణం నుంచి బయటపడ్డవారి అనుభవాలను రికార్డ్ చేస్తుంటాడు. లైఫ్ టానిక్ గురించిన చర్చలను, చర్యలను కనిపెడుతూ వ్యాఖ్యానిస్తుంటాడు. జర్నలిస్టు అనంతర పరిణామాలైన జనాభా, మనమీద చూపే ప్రభావం, జాతీయ – అంతర్జాతీయ ఒత్తిడుల గురిచి చర్చిస్తాడు. చివరగా ప్రొఫెసర్ రంగారావు "మనిషి జీవిత కాలాన్ని పెంచే అమృతాన్ని కాక, మనిషిలోని స్వార్థాన్ని రూపుమాపే మందేదన్నా కనుక్కోవాల్సింది...లైఫ్ టానిక్‌తో చావును జయించినా, బతకాల్సింది ఈ భూమి మీదే కదా. ఈ కాలుష్యాల మధ్య, ఈ వైషమ్యాల మధ్య, ఈ కుళ్ళు రాజకీయాల మధ్య, ఇంతమంది కుసంస్కారుల మధ్య, ఇంత దుర్భరంగా, ఇంత దారుణంగా బతకడం కన్నా, మరణాన్ని మనసారా ఆహ్వానించడం మేలని" ఆవేదనతో తెలియజేస్తాడు. అద్యంతం ఈ నాటిక ఆసక్తికర సంభాషణలతో కొనసాగుతుంది. ఊహించని ట్విస్ట్‌తో నాటికను ముగించడం బాగుంది.

ఆధునిక మానవుడు, ఆది మానవుడు, ప్రకృతి ముఖ్య పాత్రలుగా "ప్రకృతి" నాటిక రూపుదిద్దుకుంది. ముందుగా ఆధునిక మానవుడు ప్రవేశించి, మనిషి ప్రకృతి అధీనంలో వున్నంత కాలం జంతువే. ప్రకృతిని అదుపులో పెట్టుకోగానే – ప్రకృతి సంపదను ఇష్టం వచ్చిన రీతిలో అనుభవించడం మొదలు పెట్టగానే మానవుడయ్యాడని నిర్ధారిస్తాడు. ప్రకృతిలో ప్రతి జీవి పరిసరాలకు తగినట్లుగా మారేది. కాని ప్రకృతినే మార్చడం వల్ల మన గొప్పతనం బయటపడిందని భుజాలు చరుచుకుంటాడు. దానికి ఆది మానవుడు "నేను నా విలువను తెలుసుకుని, నా శక్తి సామర్థ్యాన్ని గ్రహించి ప్రకృతిని ఆరాధిస్తూనే, అర్థం చేసుకుంటూనే దాన్ని ఎదిరించాను." అని తెలియజేస్తాడు. వీరి మాటలు వింటూ స్త్రీ రూపంలో ప్రవేశించిన ప్రకృతి "ఒకరిది అజ్ఞానం.మరొకరిది అతి తెలివి" అని వారి వాదనలను ఖండిస్తుంది. ఆధునికత పేరిట అటవీ నాశనం, పరిశ్రమల కాలుష్యం, విష పదార్థాలు, మారణాయుధాల ఉత్పత్తితో పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని చెబుతుంది. సమయానికి వర్షాన్ని కురిపించకపోతే, కృత్రిమ వర్షం కురిపించడానికి ప్రయత్నిస్తున్నారే గాని, ప్రకృతిని సహజ సిద్ధంగా వుండనిస్తే, సహజసిద్ధమైన వర్షాన్ని పొందవచ్చుకదా అని హితవు పలుకుతుంది. ప్రకృతిని కాపాడుకుంటేనే మానవాళి బతికి బట్టకడుతుందనే సందేశాన్ని ఇస్తుంది ఈ నాటిక.

వైజ్ఞానిక ప్రగతి వల్ల అమరిన ఆధునిక సౌకర్యాలతో మానవ జీవితం " 21వ శతాబ్దం" లో ఎంత సుఖమయంగా తయారవుతుందో ఈ నాటిక తెలియజేస్తుంది. ఈ నాటిక మనుషుల్లో పెరుగుతున్న వ్యాపార మనస్తత్వాన్ని, ముందు చూపు లేకపోవడాన్ని తెలుపుతుంది. ఇంకోవైపు ఆధునిక సౌకర్యాలు మనిషిని ఎంత బద్ధకస్తుడిగా మార్చుతాయో ఈ నాటిక తెలియజేస్తుంది. ఉదా: రోబోట్లు అన్ని పనులు చేసిపెడతాయి. మానవ అవయవాలను స్పేర్ పార్ట్స్‌గా అమర్చుకోవచ్చు. ఆహారానికి బదులుగా ఫాస్టెట్స్ ఫుడ్స్, ఎనర్జీ టాబ్లెట్స్ వస్తాయి. ఇంకోవైపు ఆధునికత, వైజ్ఞానిక ప్రగతి పేరిట పరిసరాలను ఎలా నాశనం చేసుకుంటున్నాడో ఈ నాటిక తెలుపుతుంది. విగ్రహాల నిమజ్జనంతో సిటీ లేక్‌ను పూడ్చివేస్తారు. దాని స్థానంలో అపార్ట్‌మెంట్స్ కట్టడానికి ప్లాన్ వేస్తారు. 21 వ శతాబ్దంలో మనం ఎటువైపు పోతున్నామని ఈ నాటిక మనల్ని నిలదీస్తుంది.

ఈ నాటిక చదువుతుంటే, శ్రీశ్రీ నాటిక "మరో ప్రపంచం" జ్ఞాపకమొస్తుంది. ఇందులో మరో ప్రపంచం నుండి 21వ శతాబ్దపు మనిషి వచ్చి ఆ లోకానికి సంబంధించిన విశేషాలు వినిపిస్తాడు. యువకులతనికి స్వాగతం పలకగా, వృద్ధులు వ్యతిరేకిస్తారు. అలా వ్యతిరేకించిన వృద్ధులు మృత్యువును ఆరాధిస్తూ వెనక్కెళ్ళిపోతారు. యువకులు మరో ప్రపంచపు మహత్వాకాంక్షతో మునుముందుకు సాగిపోతారు.

రైలు ప్రయాణంలోని ఒక కంపార్ట్‌మెంట్ ఆధునిక సమాజపు వర్తమాన చిత్రణకు ప్రతిబింబంలా నిలుస్తుంది. రకరకాల ప్రయాణీకుల విభిన్న మనస్తత్వాలు, ఒకరినొకరు ఎక్స్‌ప్లాయిట్ చేసుకుంటూనే కలిసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వుంటుంది. ఇందులో దొంగ బియ్యం రవాణా చేసే సేటు, మూగదాన్నని చెప్పి డబ్బులడుక్కునే ముసల్ది, ప్రయాణీకులను మోసం చేయాలని ప్రయత్నించే తినుబండారాల వాళ్ళు, తోవలో పేకాట గాళ్ళు అందరిదీ ఎక్స్ ప్లాయిటేషనే. వీళ్ళందరినీ గమనిస్తూ, లోకరీతిని వ్యాఖ్యానిస్తూ, కర్తవ్యాన్ని బోధించే జర్నలిస్టు – అంతా కలిసి "మూగమోసం" నాటికను రక్తి కట్టిస్తారు.

ఈ నాలుగు నాటికలలో "ఆకృతి" 1986 లో రాగా, మిగతావన్నీ 1991, 92 లలో వచ్చాయి. ప్రయోగాత్మకంగా, సందేశాత్మకంగా వున్న ఈ నాటికలు ఆకాశవాణిలో పదే పదే ప్రసారం కావడం రచయిత విజయం గానే భావించాలి. ఒక రేడియో నాటిక విజయవంతం కావడానికి నాలుగు కారణాలుంటాయి.

మంచి స్క్రిప్టు: నాటికగా రూపొందించిన కథా వస్తువును ఆసక్తికరంగా మలచాలి. కథ చెప్పే పద్ధతిని ప్రణాళికాబద్ధంగా విభజించుకొని దాని టెంపో తగ్గకుండా నడిపించగలగాలి. అది ఎలాంటి కథ అయినా సరే ఆసక్తికరమైన మలుపులతో శ్రోతను ఆకట్టుకోగలగాలి. వైజ్ఞానిక నాటికలంటే ఒక కొత్తదనం వుండాలి. తెలియని విషయాలు, తెలిసీ తెలియని అంశాలు ప్రేక్షకులలో ఆసక్తిని కలుగజేస్తాయి. ఉదా: మృత్యువును జయించడం, పర్యావరణ నాశనం, సామాజిక అసమానతలు మొదలైనవి. వీటితో పాటు రచయితను ఇబ్బంది పెట్టేది కాలపరిమితి. అరగంట, గంట నిడివి వుండే నాటికలను కాలాన్ని దృష్టిలో వుంచుకొని రాయాలి. ఇదో పెద్ద కసరత్తు.

సంభాషణలు: నాటికకు సంభాషణలు ప్రాణం పోస్తాయి. పాత్రధారుల స్వభావానికి తగ్గట్లుగా సంభాషణలు వుండి అవి కథా గమనానికి దోహదం చేయగలిగాలి. సంభాషణల్లో మంచి పట్టు వుండాలి. కొన్నిసార్లు కథ లేకపోయినా, కథ బలహీనంగా వున్నా సంభాషణల ద్వారా దాన్ని రక్తి కట్టించవచ్చు. పాత్రోచిత భాష ఆ నాటికకు సహజంగా అమరిపోవాలి. ఉదాహరణకు "మూగమోసం"లో రైలు వరంగల్ నుండి సికింద్రాబాద్‌కు వస్తుంటుంది. అందులో వున్న ప్రయాణీకులు కొందరు తెలంగాణా మాండలికంలో మాట్లాడితే షరీఫ్ ఉర్దూలో, జర్నలిస్టు వ్యావహారికంలో మాట్లాడతారు. అదే 21వ శతాబ్దంలో స్పుత్నిక్ బాబు ఇంగ్లీష్ కలగలిసిన తెలుగులో మాట్లాడుతాడు. సంభాషణలు ఆసక్తికరంగా వున్నప్పుడు, మధ్యలోంచి వింటున్న శ్రోత ఆ డైలాగులతో ఆకర్షితులై చివరిదాకా వినేస్తారు. నాటకం మొదటి నుండి విన్నవారు చివరి దాకా రేడియోను అంటిపెట్టుకోక తప్పదు. ముఖ్యంగా "లైఫ్ టానిక్, మూగమోసం" నాటికలలో సంభాషణల పరమైన హాస్యం శ్రోతలను కట్టిపడవేస్తుంది.

గాత్రధారులు: ఎంత మంచి స్క్రిప్టు వున్నా, సంభాషణలు వున్నా వాటిని స్పష్టంగా, ఆకట్టుకునే విధంగా చెప్పకపోతే ఆ నాటిక రక్తి కట్టదు. ముఖ్యంగా "మూగమోసం" నాటికలో ఎడ్డిది, పండ్లమ్ముకునేవాడు, షరీఫ్, సేటు – వాళ్ళ మధ్య జరిగిన సంభాషణలు అత్యంత సహజంగా, ఆసక్తికరంగా రూపొందాయి. గొంతును బట్టి ఆ పాత్రధారిని, ఆ పాత్ర స్వభావాన్ని గుర్తించగలుగుతాడు శ్రోత. రచయిత

## కవిత



### జ్ఞాపకాల నిశీధి

**- సునీత గంగవరపు**

రాత్రి నన్ను సమీపిస్తుంటే
మెత్తటి గాయాలేవో పచ్చిగా
విచ్చుకున్నట్లుంటుంది
గత స్మృతుల లేత గుబుర్లను
పరవశంతో హత్తుకున్నట్లుంటుంది

చీకటి చూరు కింద కలల దీపాలు
వెలిగించుకొని..
కఠిన పాఠాలెన్నో నేర్చుకున్నాను

ఆకాశ వనంలో వేలాడే తారల్ని
లెక్కిస్తూ..గెలుస్తూ ఓడిపోయాను
ఓడిపోతూ..గెలిచాను

గుండె చెమరింతకు
రాలిపోయిన ఆకుల్నీ..
వాడిపోయిన ఆశల్నీ రాశి పోసి
మోకరిల్లిన చూపులతో
అలసిపోతుంటాను
చందమామ నవ్వుల్నీ
చైత్రమాసపు పువ్వులనీ ఏరుకుంటూ..
నన్ను నేను మరచిపోతుంటాను

చీకటిలో..నాకు నేను కనిపిస్తాను
వేనవేల ప్రతిబింబాలుగా
విస్తరిస్తాను

ఈ నిశీధి నాకు ఎన్నో విషయాలు
చెప్తుంది
విషాదాలు పరిచయం చేస్తుంది
నాకు రాత్రి పూట
అమ్మ పాడే జోలపాట వినిపిస్తుంది
రాత్రిలో కరుగుతుంటే
ప్రతి క్షణం కొత్తగా
బతుకుతున్నట్లుంటుంది

బహుశా.. అందుకేనేమో
నేను రాత్రి కోసం కలలు కంటాను
జ్ఞాపకాలను ఒలుచుకుంటూ
చీకటి సంద్రంలో
మళ్లీ మళ్లీ మునుగుతుంటాను ♦

---

చెప్పదలుచుకున్న అంశాన్ని శ్రోతకు చేరవేయడంలో గాత్రధారులు సఫలం అయినప్పుడే ఆ నాటిక విజయవంతం కాగలుగుతుంది.

నేపథ్య సంగీతం: ప్రేక్షకులు బోరు కాకుండానో, సీన్లు మార్చడానికో నేపథ్య సంగీతం అన్న భావనకు కాలం చెల్లింది. సంగీతం రాబోయే సన్నివేశానికి అనుగుణంగా శ్రోతను సన్నద్ధం చేస్తుంది. నాటికను మరింత శక్తివంతం చేయడానికి సంగీతం తోడ్పడుతుంది. నాటిక కొనసాగుతుండగా దృశ్యాలు, సంఘటనలు, కాలం మారుతున్నట్లు శ్రోతలకు స్పష్టంగా తెలియజేస్తుంది. సంగీతం కథా వాతావరణంలోకి శ్రోతను తీసుకుపోతుంది. ఉద్వేగ భరితమైన వాతావరణాన్ని, మానసిక పరిస్థితులను వ్యక్తీకరించడనికి, నేపథ్యాలు – ఫ్లాష్ బ్యాక్‌లు తెలియజేయడానికి సంగీతం ఎంతగానో ఉపయోగపడుతుంది.

**శ్రీశ్రీ – దేవరాజు మహారాజు నాటికలు: విశ్లేషణ**

రేడియో నాటికల్లో కథ ప్రధానం. అది అందరికి తేలిగ్గా అర్థమవ్వాలి. కాని శ్రీశ్రీ రాసిన "చతురస్రం" "మరో ప్రపంచం" వంటి నాటికల్లో కథ అంత తేలిగ్గా కొరుకుడుపడదు. కథాకాలం శ్రోతకు తెలియాలి. భవిష్యత్తు, వర్తమానం, భూతకాలం కలగలిసిపోయి శ్రోతను అయోమయానికి గురిచేయకూడదు. కాని శ్రీశ్రీ నాటికల్లో జరిగింది ఇదే. కవితాత్మకమైన వచన ధోరణి. పైగా వాక్యాలతో సర్కస్ ఫీట్లు చేయిస్తాడు. తన కవిత్వంలో సామాన్య ప్రజల గురించి శ్రీశ్రీ ఎంత చెప్పినా, నాటికలు మాత్రం సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉండిపోయాయి. వారి నాటికలు మేధావులైన శ్రోతల మస్తిష్కాలను పదును పెట్టేవిగా తయారయ్యాయి.

రేడియో నాటిక చదివి ఆనందించేది కాదు. ఇది కేవలం సామాన్య ప్రజలకు, గ్రామీణులకు, నిరక్షరాస్యులకు కూడా అర్థమయ్యే విధంగా రూపొందాలి. ఇది గుర్తుంచుకున్న దేవరాజు మహారాజు తన పాండిత్యాన్ని ప్రదర్శించుకోవడం కాకుండా అందరికీ అర్థమయ్యే రీతిలో సహజంగా, సులభంగా వుండే విధంగా కథ – సంభాషణలతో ఈ నాటికలను తీర్చిదిద్దారు. శాస్త్రీయత, హేతువాదం, తార్కికతలతో కూడిన వైజ్ఞానిక నాటికలతో శ్రోతలను ఎడ్యుకేట్ చేయడానికి ప్రయత్నించడంలో దేవరాజు మహారాజు కృషి అభినందనీయం. ♦



# మామిడి తోపు

- మూగాటి శబరీష్
9885566388

ఆకాశంలో మబ్బులు కమ్ముకొని ఉండటం వల్ల వర్షం పడుతుందనే ఆశతో మామిడితోపులోని చెట్లన్నీ మురిసిపోతున్నాయి. మామిడి తోపుకు అటువైపుగా దళితవాడ దర్శనమిస్తోంది. మామిడితోపుకు పడమర దిక్కుగా కాస్త దూరంలో పెద్దకులం వాళ్ల ఇండ్లు అగుపిస్తున్నాయి. వాన రావడానికి ముందు గాలి చప్పుడు గొల్లున వినిపిస్తోంది. ఎటుచూసినా రణగొణ ధ్వని ఆవహించి ఉంది. రోజూ నాయుడుపల్లి గోలగోలగా ఉంటుంది. మాలోల్లు, మాదిగోల్లు, ఇర్లోళ్లు, యానాదోళ్లు అందరూ నాయుడుపల్లికి వచ్చి తమ జమిందార్ల దగ్గర, యజమానుల దగ్గర ఏయే పనుల్లోకి వెళ్లాలో తెలుసుకుంటూ ఉంటారు. కొందరికి డబ్బులు అవసరం అయితే నాయుడోళ్ల కాళ్లు పట్టుకుని బతిమిలాడుకుంటుంటారు. గొడ్డుచాకిరీ పనులు చేసిన తర్వాత నాయుడిచ్చిన డబ్బుల్ని కళ్లకద్దుకుని భుజాలెగరేసుకుంటూ గర్వంగా ఇంటిబాట పడుతారు. అయితే ఈ రోజు మాత్రం ఆ నాయుడుపల్లి చడీచప్పుడు కాకుండా ఉందంటే ఏదో అనర్థమే జరుగుండాలి.

మధ్యాహ్నం వేళకు ఇంకా మూడు గంటలుంది. వాన రావడానికి ముందే ఉరుముల శబ్దం హోరుమంటోంది. మామిడితోపులో మాత్రం ఉరుముల శబ్దం కాకుండా ప్రాణంపోతున్న శబ్దం వినిపిస్తోంది. మామిడితోపుపైన ఐదారు గెద్దలు తిరుగుతూ ఉన్నాయి. కావ్ కావ్ అంటూ కాకుల గోల కూడా ఎక్కువయ్యింది. దళితవాడలో కుక్కల అరుపులు కాకుల కూతకు పోటీనిస్తున్నాయి. సరిగ్గా ఆ సమయంలోనే మామిడి తోపులోని బావిలో ఓ శరీరం తేలియాడింది. ఆమె దళితవాడలోని భానుమతిలా ఉంది. చిన్నప్పటి నుంచి అదే మామిడితోపులో బావి వద్ద ఆడుకున్న భానుమతి ఇవాళ జీవచ్ఛవంలా పడి ఉంది. కనురెప్పలు తెరుచుకోని ఉండటం చూస్తుంటే ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లుగానే ఉంది. అయితే ఆమె బతికే ఉందా లేక చనిపోయి ఉందా అనే అనుమానంతో బావిపైనున్న ఉడుత సపోట గింజను ఆమెపైకి విసిరింది. ఆ గింజ తగలగానే భానుమతి గింజుకోవడం మొదలుపెట్టింది. భానుమతి కొనఊపిరితో ఉన్నట్టు ఆ ఉడుత గమనించింది కాబోలు.. అందరికీ వినపడేట్టుగా అరవడం మొదలుపెట్టింది. చుట్టూ ఎన్నో జీవులు అరుస్తున్నా భానుమతి కళ్లు మాత్రం ఎవరికోసమో ఎదురుచూస్తున్నాయి. ఆ ఎదురుచూపులోనే ఆమె గతం కళ్ల ముందు మెదిలాడింది.

అది 2017 ఏప్రిల్ నెల... వేసవి సెలవులు ఉండటం వల్ల కళాశాలలు, పాఠశాలలు, ఆట స్థలాలు.. అన్నీ బోసిపోయాయి. విద్యార్థుల రాకకోసం అవన్నీ ఎదురుచూస్తున్నాయి. చిత్తూరు జిల్లాలోని పలమనేరులో

వేడుకగా అమ్మవారి జాతర జరుగుతోంది. ఎటుచూసినా జనం.. బండ్లు కట్టుకుని, ట్రాక్టర్లలో చుట్టు పక్కల గ్రామాల్లోని వారంతా జాతరకు చేరుకున్నారు. అంతా సందడి సందడిగా ఉంది. దళితవాడకు చెందిన కేశవులు ఆ జాతరలో మైక్ సెట్ పనులన్నీ చూసుకుంటున్నాడు. వాడికి తోడుగా వాడి గ్యాంగ్ కూడా అక్కడే ఉంది. అయితే వాళ్లు మాత్రం పనిచేయడం లేదు. జాతరకు వస్తున్న పడుచు అమ్మాయిలను, యువతులను చూస్తూ మురిసిపోతున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఆ జాతరకు ఆరోజే చివరి రోజు. హరికథలు, రాత్రి వేసే నాటకాలు చూడటానికి ఆ రోజే ఎక్కువ మంది వస్తారు. ఇక చివరి రోజు కాబట్టి కేశవులు కూడా తన గ్యాంగ్ తో పాటే అమ్మాయిల వెనక తిరగడం మొదలుపెట్టాడు. నాకు ఆ అమ్మాయి కావాలి.. నువ్వు ఈ అమ్మాయిని తీసుకో.. అంటూ ఒకరికొకరు పందేలు వేసుకుంటున్నారు. వీళ్ల కోతి చేష్టలు చూస్తున్న ఆ అమ్మాయిలు మాత్రం.. ముఖం మీద ఉమ్ముతున్నారు. కాళ్లకు వేసుకుని ఉన్న చెప్పులను చూపిస్తూ దవడ వాయిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. అమ్మాయిలు అంత మాటలంటున్నా ఒక్క వెధవకు కూడా సిగ్గు వేయడం లేదు. వాళ్ల తిట్లను ఏవో పొగడ్తలుగా భావించి రెచ్చిపోతున్నారు. కేశవులు తన గ్యాంగ్ చేసే అల్లరి పనులకు ముసిముసిగా నవ్వుతూనే ఉన్నాడు. ఇంతలో భోజనాలు రెడీ అయ్యాయి.. అందరూ వచ్చి భోజనం చేయండి అంటూ మైక్ సెట్ నుంచి పిలుపులు వినిపించాయి.

హరికథ అయిపోవడం వల్ల ముందు భాగంలో కుర్చీలల్లో కూర్చున్న ఆడవాళ్లు మాత్రం భోజనాలకు వెళ్తున్నారు. వారి వెనుకగా నేలపై కూర్చోని ఉన్న వాళ్లు మాత్రం వడివడిగా లేచి భోజనం వడ్డించే పనుల్లో మునిగిపోయారు. జాతరలో ముందుగా నాయుడుపల్లిలోని ఆడవాళ్లు భోజనం చేస్తారు. వారికి దళితవాడలోని ఆడవాళ్లు వడ్డించాలి. పెద్దకులం ఆడవాళ్లు తినేసి తర్వాత మిగలగా ఉన్న భోజనాన్ని దళితవాడ మహిళలు తినాలి. అయితే అప్పుడు కూడా వాళ్లు నేలపైనే కూర్చొని తినాల్సి ఉంటుంది. ఇద్దరికీ ఒకే రకం భోజనం ఉండదు. పెద్దకులం వాళ్లకు చిత్రాన్నం, పెరుగన్నం, వడ, పాయసం, తాళింపు, లడ్లు, రవ్వలడ్డు, ఇలా రకరకాల వంటకాలు ఉంటాయి. దళితవాడలోని వారికి మాత్రం అన్నం, సాంబారు, రసం మాత్రమే వేస్తారు. ఇక అందరూ భోజనాల పని ముగించుకున్నాక రాత్రి నాటకం మొదలయ్యింది.

రాత్రి నాటకం అంటే కేశవులకు చాలా ఇష్టం. అతను కూడా నటుడు అవ్వాలనుకున్నాడు. కానీ ఇంట్లో వాళ్ల నాన్న భయం పెట్టాడు. ఆ రోజు వస్త్రాపహరణం నాటకం జరుగుతోంది. ద్రౌపది పాత్ర వేసిన సాంబయ్య పాటలంటే చాలా మందికి ఇష్టం. అందరూ నాటకంలో పాడుతున్న పాటలను వింటూ మైమరచిపోతున్నారు. నాటకం వేసేవాళ్లకు టీ తీసుకురావాలని ఆ ఊరి పెద్ద రంగయ్య కేశవులకు ఆ పని అప్పగించాడు. రాత్రి 9 గంటలకు రంగయ్య ఇంటికి కేశవులు బయల్దేరాడు. శ్మశానాన్ని దాటుకొని, మామిడితోపుకు అవతల ఉన్న రంగయ్య ఇంటికి కేశవులు చేరుకునే సరికి ఇళ్లు మొత్తం చీకటిగా ఉంది. కరెంటు లేకపోవడం వల్ల ఊరు మొత్తం చీకటిగానే ఉంది. తలుపు కూడా తెరిచే ఉంది. బహుశా టీ కోసం ఎవరైనా వస్తారేమోనని తలుపు తెరిచే ఉన్నారనుకుని కేశవులు చప్పుడు చేశాడు. తలుపు చప్పుడు విని ఇంట్లో నుంచి ఎవరో వస్తున్నారు. గజ్జల శబ్దం ఘల్లు ఘల్లు మంటోంది. ఎవరు? ఎవరు కావాలి.. అంటూ అటువైపు నుంచి వచ్చిన మృదువైన మాటలకు.. అమ్మగారు పెద్దయ్య టీ తెమ్మన్నారండి అంటూ కేశవులు సమాధానమిచ్చాడు. ఇంతలో.. ఒక్క నిమిషం ఉండండి తెస్తానంటూ ఆ మధురమైన మాటలు ఆగిపోయాయి.

కేశవులుకు ఆ గొంతు ఎప్పుడూ విన్నట్టు లేదు. ఎవరయ్యుంటారబ్బా అనుకున్నాడు. అప్పటి వరకూ ఆ ఊరికి రెండు మూడు సార్లు తప్పా కేశవులు ఎప్పుడూ వచ్చింది లేదు. పెద్దయ్య, అమ్మగారు జాతరలో ఉంటే ఇంట్లో ఉండేది ఎవరయ్యుంటారబ్బా అని ఆలోచనలో పడ్డాడు. అప్పుడే రంగయ్య కూతురు భానుమతి తలుపులు తెరుచుకుని బయటకు వచ్చింది. కేశవులుకు గుండె ఒక్కసారిగా ఆగినంత పనయ్యింది. కాటుక కళ్లు, గులాబీ పెదాలు, కురుల నుంచి వస్తున్న వాసనలు కేశవులును మత్తెక్కేలా చేశాయి. రెప్పవేయకుండా భానుమతినే చూస్తుండిపోయాడు. భానుమతి ఓ సంచిలో టీ ఫ్లాస్కు, కప్పులు పెట్టి కేశవులకు ఇవ్వబోయింది. తనవైపే తదేకంగా చూస్తున్న కేశవులును చూసి అరవబోయింది. కానీ ఆ పని చేయలేదు. కేశవులు ముఖంలోని తేజస్సు భానుమతిని కట్టిపడేసింది. ఒక్క క్షణం తేరుకుని.. ఏమయ్యా బాబు.. ఇదిగో టీ తీసుకో అంటూ కేశవుల చేతికి సంచిని ఇచ్చింది. వేగంగా కొట్టుకుంటున్న గుండె కేశవులును తట్టిలేపినట్లైంది. భానుమతి మాటలకు కేశవులు ముఖమంతా

చెమటలు పట్టేశాయి. ఇక హడావుడిపడుతూ సంచితోపాటు జాతర దగ్గరికి బయల్దేరాడు.

నాటకం వేసే వాళ్లకు టీ ఇచ్చిన తర్వాత కేశవులు తన గ్యాంగ్ వద్దకు వెళ్లాడు. కేశవులు మనసులో ఏదో అలజడి. తన సావాసగాళ్లు మందు పార్టీ చేసుకుంటున్నారు. కేశవులు వెళ్లే సరికే అందరూ ఫుల్లుగా తాగున్నారు. కేశవులు కూడా కూర్చొని ఓ పెగ్గు కలుపుకున్నాడు. అయితే అతనికి తాగబుద్ధి కావడం లేదు. కళ్ల నిండా భానుమతి ముఖమే కనిపిస్తోంది. అప్పటి వరకూ భానుమతిని ఆ ఊర్లో ఎప్పుడూ చూడలేదు. ఇక చూసిన తర్వాత మనసు ఆగడం లేదు. తన స్నేహితులకు విషయం చెప్పాడు. తాగిన మైకంలో ఉన్నవారికి ఒక్క క్షణంలో మత్తు అంతా దిగిపోయింది. మనం తక్కువ కులం వాళ్లం.. మన ఊర్లో అమ్మాయిలనే మనువాడాలి. ప్రేమించాలి. ఆ నాయుడోళ్ల సంగతి తెలిసే నువ్వు ఇలా అంటున్నావా..అని సావాసగాళ్లు హెచ్చరించారు. ప్రేమ మైకంలో ఉన్న కేశవులు చెప్పే మాటలకు అందరూ భయపడిపోయి తాగడం మళ్లీ మొదలు పెట్టారు. కేశవులు కూడా వారితో చేయి కలిపాడు.

ఉదయం 8 గంటలు అవుతున్నా కేశవులు, వాడి గ్యాంగ్ మాత్రం నిద్ర లేవలేదు. అమ్మవారి గుడి ముందు చెత్తాచెదారం అంతా పేరుకుపోయి ఉంది. జాతరకు వచ్చిన వాళ్లంతా వెళ్లిపోతుండటం వల్ల ఆ ప్రాంతం నిర్మానుష్యంగా మారుతోంది. ఇంతలో గుడి గంటల శబ్దానికి కేశవులకు కోపం చిర్రెత్తుకొచ్చింది. ఎవర్రా అది అంటూ కోపంగా లేచి చూడగానే ఒక్క క్షణం మళ్లీ ఊపిరి ఆగినంత పనయ్యింది. భానుమతి అమ్మవారి దర్శనం చేసుకున్న తర్వాత కేశవులును నిద్రలేపడానికి గుడిగంటలు మోగిస్తోంది. భానుమతి అందం చూసి కేశవులుకు దిమ్మతిరిగినట్లైంది. నిద్రలేచిన కేశవులు వద్దకు వచ్చి చేతిలో ప్రసాదం పెట్టి భానుమతి నవ్వుతూ వెళ్లిపోయింది. ఒకటే ఆనందం.. పట్టరానంత ఆనందంతో కేశవులు ఉక్కిరిబిక్కిరైపోతున్నారు. భానుమతి చూపుల్లో కేశవులపై ఇష్టం ఉందని తెలుసుకున్నాడు. ఇక అప్పటి నుంచి ఆమె ధ్యాసలోనే మునిగిపోయాడు.

రోజూ మామిడితోపులోని బావి దగ్గరకు భానుమతి వస్తుందని తెలుసుకున్నాడు. ఓ రోజు భానుమతిని చూడాలనే ఆనందంలో బావి దగ్గరకు వెళ్లాడు. ఇంతలో భానుమతి తన స్నేహితులతో రానే వచ్చింది. కేశవులకు గుండె సడి ఎక్కువయ్యింది. భానుమతికి కనిపించకుండా చాటుకు వెళ్లాలనుకున్నాడు. చాటుకు వెళ్లే ప్రయత్నంలో పొరపాటుగా బావిలోకి దూకేశాడు. ఈత వచ్చు కాబట్టి బతికిపోయాడు. ఊపిరి బిగపట్టి బావిలో ఉంటూ భానుమతి మాటలు వినడానికి ప్రయత్నించాడు కానీ కుదరలేదు. బావిలో ఎవరో పడిపోయారని గ్రహించిన భానుమతి బావిలోకి తొంగి చూసింది. ఇక ఈత రాదన్నట్టుగా కేశవులు నటించడం మొదలుపెట్టాడు. బావిలో గిలగిలా కొట్టుకుంటున్న కేశవులును చూసి భానుమతి వెంటనే బావిలోకి దూకి కాపాడింది. ఆ రోజు జరిగిన ఆ ఘటన ఓ జ్ఞాపకంలా కేశవులు గుండెల్లో నిలిచిపోయింది.

కాలం మారుతూ వస్తోంది. వేసవిలో ఆకులను కోల్పోయిన చెట్లు వసంతంలో చిగురించడం మొదలుపెట్టాయి. మామిడితోపులోని బావి సాక్షిగా భానుమతి, కేశవులు ప్రేమలో మునిగిపోయారు. వాళ్లిద్దరూ ప్రేమించుకుంటున్నట్లు కేశవులు సావాసగాళ్లకు మాత్రమే తెలుసు. పలమనేరులో డిగ్రీ చదువుతోన్న భానుమతిని కేశవులు రోజూ కలిసేవాడు. కొన్ని రోజుల తర్వాత వారి ప్రేమ విషయం ఊర్లో ఒక్కొక్కరికీ తెలిసిపోయింది. తక్కువ కులంవాడ్ని ప్రేమిస్తోందన్న మాట రంగయ్య చెవిలో పడటంతో కోపంతో ఊగిపోయాడు. కేశవులను చంపేయాలని కోపంగా బయల్దేరాడు.

రంగయ్య వస్తున్నాడన్న విషయం తెలుసుకుని కేశవులు.. భానుమతిని పెళ్లి చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిపోయాడు. పోలీసుల సమక్షంలో గొడవలు సద్దుమణిగాయి. భానుమతి ఇష్టప్రకారమే పెళ్లి జరిగిందని తెలుసుకుని పోలీసులు అందరికీ సర్దిచెప్పారు. కానీ రంగయ్య మాత్రం కిరాతకంగా మారిపోయాడు. రంగయ్య కూతురు తక్కువ కులస్తుడిని పెళ్లి చేసుకుందనే విషయం నాయుడివల్లిలో ఎవరినీ నిద్రపోనివ్వడం లేదు. తలకాయలు తెగాల్సిందే.. లేకుంటే ప్రతి తక్కువ నాకొడుకూ బరితెగిస్తాడు.. వాడ్ని చంపేయాల్సిందే.. తక్కువ జాతి వాడ్ని పెళ్లి చేసుకున్న దాన్ని కూడా చంపాల్సిందేనని రంగయ్య కంకణం కట్టుకున్నాడు. తెల్లారే సరికి ఇద్దరి శవాలు ఊర్లో తేలాలని పన్నాగం పన్నాడు. మనుషులను పురమాయించి చంపడానికి డబ్బులిచ్చాడు.

కేశవులు తల్లిదండ్రులకు ప్రాణ భయం పట్టుకుంది. కేశవులుకు కూడా తన భానుమతితో కలకాలం బతకాలని ఆశ కూడా ఎక్కువయ్యింది. ఎవ్వరికీ తెలీయకుండా ఆ రాత్రి

భానుమతితో కేశవులు ఊరొదిలి వెళ్లిపోయాడు. కాదు.. కాదు స్నేహితులే వారిని ఊరు దాటించేశారు. విషయం తెలుసుకున్న రంగయ్య తన మనుషులతో కేశవులు జాడ కోసం గాలించమన్నాడు. కొన్ని రోజుల పాటు ఆ ప్రయత్నాలు సాగుతూ వచ్చాయి. కేశవులు, భానుమతి దొరక్కపోవడంతో రంగయ్యలో ఆవేశం ఎక్కువయ్యింది. ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పగ ప్రతీకారం కోసం ఎదురుచూస్తోంది. నాయుడోళ్ల ఊర్లోకి వెళ్లడానికి మాలోల్లు, మాదిగోల్లు, యానాదోళ్లకు భయం వేసింది. ఎవర్నీ ఊర్లోకి రానీయకుండా రంగయ్య కట్టుదిట్టం చేయడంతో అందరూ పనుల కోసం పలమనేరుకు వెళ్ళడం మొదలుపెట్టారు. కాలం తన పని తాను చేసుకుపోతూ వచ్చింది. దళితవాడలోని కూలోల్లకు నాయుడిపల్లిలోని యజమానులు పనులు ఇవ్వకపోవడంతో కొందరు పస్తులుండాల్సి వచ్చింది. పొట్టచేత పట్టుకుని కొందరు వలసెల్లి పోవాల్సి వచ్చింది.

రెండు సంవత్సరాల తర్వాత..

భానుమతి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సొంత ఊరికి వచ్చిన కేశవులు తన ఆనందాన్ని దళితవాడ ప్రజలతో పంచుకున్నాడు. నాయుడోళ్ల పల్లిలో అల్లారుముద్దుగా పెరిగిన భానుమతి ఇప్పుడు దళితవాడలోని కేశవుల ఇంటికి చేరింది. కొడుకుకు జన్మనివ్వడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. దళితవాడలో పండగ వాతావరణం నెలకొంది. అందరూ భానుమతిని చూసి మురిసిపోతున్నారు. రెండు సంవత్సరాల తర్వాత ఇక రంగయ్య కూడా ఏం చేయలేడులే అనే ధైర్యంతో వాళ్లు సంబరాలు చేసుకుంటున్నారు. భానుమతి తన బిడ్డతో ఇంటికి వచ్చిన వేళా విశేషం కేశవులుకు పలమనేరులో మంచి పని దొరికింది. ఇక బయట ఊర్లకు వెళ్లి పనులు చేయాల్సిన అవసరం రాలేదు.

భానుమతిని, తన కొడుకును ఇంట్లో ఉంచి కేశవులు పనులకు వెళ్లడం మొదలుపెట్టాడు. ఓ రోజు బాబుకు జ్వరం రావడంతో పలమనేరులోని ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకున్నాడు. మరుసటి రోజు ఉదయం తాను భానుమతిని, బిడ్డను పలమనేరుకు తీసుకెళ్లి వైద్యం చేయించాడు. పుట్టిపెరిగిన ఊర్లో తన జీవిత భాగస్వామితో కలిసి బిడ్డను ఎత్తుకుని తిరగడం కేశవులుకు చాలా ఆనందాన్నిచ్చింది. సంతోషం వెయ్యి రెట్లు అయ్యింది. ఆటోలో భానుమతిని, బిడ్డను ఇంటికి పంపించి తాను పనికి వెళ్లాడు.

పగతో రగిలిపోతున్న రంగయ్య.. భానుమతి ఆటోలో వస్తోందన్న విషయం తెలుసుకున్నాడు. తనకు ఇంత అవమానం తెచ్చిపెట్టిన తన కూతురు ప్రాణాలతో ఉండకూడదనుకున్నాడు. రెండేళ్ల నుంచి ఎదురుచూస్తున్న సమయం వచ్చిందని పొంగిపోయాడు. వెంటనే తన మనుషులను పంపించి భానుమతిని ఎత్తుకొచ్చేయమన్నాడు. రంగయ్య మనుషులు వేటకొడవళ్లతో బయల్దేరారు. గంట సమయంలోనే మామిడితోపులోని బావి దగ్గరికి తన మనుషులు తన కూతురు భానుమతిని తీసుకొచ్చారు. కూతురును చూడగానే రంగయ్యలో ఆవేశం కట్టలు తెంచుకుంది. కోపం చల్లబడేంత వరకూ కొట్టాడు. పచ్చి బాలింత అనే కనీస కనికరం లేకుండా భానుమతిని హింసించాడు. గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్న ఏడు రోజుల పసి కందును చూసైనా దయ చూపలేదు. భానుమతిని కొడుతూ పైశాచిక ఆనందాన్ని పొందాడు. మామిడి తోటలో కూతురు గొంతును తాడుతో బిగించి నరకం చూపించాడు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత కాళ్లు, చేతులు కట్టేసి బావిలో పడేశాడు.

ప్రస్తుతం...

గతం గాయాలను, కన్నీటి బాధలను, తన ప్రేమ కథను తలుచుకున్న భానుమతికి చలనం లేదు. ఆకాశంలో ఉరుములు ఎక్కువయ్యాయి. భానుమతి కళ్ల ముందు తన జీవితం ఒక్కసారిగా తళుక్కుమనడంతో కన్నీటిధార చెంపలను తడుముతోంది. కులం చేసిన కసాయి తనానికి భానుమతి జీవితం బలైపోయింది. అందమైన జీవితాన్ని చిదిమేసింది. ఆమె కళ్లు మాత్రం ఎవరికోసమో ఎదురుచూస్తూనే ఉన్నాయి. తన ప్రేమకు గుర్తుగా పుట్టిన ఆ బిడ్డను చూడాలనుకుంటున్న ఆమె కళ్లు మెల్లమెల్లగా మూసుకుంటున్నాయి. కులం చేసిన గాయాలను తలచుకుంటూ రెప్పల నుంచి వేడి కన్నీటి ధార ఉబికి వస్తోంది. కనురెప్పలు మూసిన భానుమతి నుంచి ఊపిరి వేరయ్యింది. ఆకాశంలో ఉరుముల, మెరుపుల మధ్య నుంచి వాన చినుకులు కురవడం మొదలయ్యాయి. తల్లి మరణం వార్త తెలిసిందేమో కాబోలు.. బావి గట్టున ఉన్న చంటి బిడ్డ ఏడుపులు ఘోషించాయి. పిల్లాడి రోదనలు తల్లికి వీడ్కోలు పలికాయి.

కులహత్యను కళ్లారా చూసిన మామిడితోపు వానగాలికి వణకడం మొదలుపెట్టింది.

◆

# ఎదురు దాడి

- డా॥ బి. నాగశేషు
9985509053


కరోనా కవిత

ఓ కరోనా అరక్షణానికో ఆక్రమణ,
కోట్లమందికి నీ సంక్రమణ
హిట్లర్, ముసోలిని, నెపోలియన్ల విస్తరణా నీతి
నీ ముందు బలాదూర్
అయినా కబ్జాకు కేరాఫ్ నువు, సూదిమొనంత
సందుదొరికినా కోరలు చాస్తావు
నువు నేర్పిన సమాజపు సమానత్వపు పాఠాలు చూస్తుంటే
పాలకుల ప్రవచనాలన్నీ గాలిమాటలేకాని
గట్టిమాటలు కాలేదు
విశ్వాన్ని జయించామని విర్రవీగే వీరాగ్రేశ్వరులకు కూడా
వీడని చిక్కుముడివయ్యావు
అపుడెపుడో ఓ పెద్దాయన చెప్పాడట
పల్లెలే పట్టణానికి పట్టుకొమ్మలని
పల్లెలన్నీ పట్నంలో విలీనమైతుంటే
పెద్దాయన చెప్పింది సత్యదూరమనిపించింది
దేహానికి కట్టుబట్టల్లేకున్నా
దేశాన్ని నిర్మిస్తున్న శ్రామిక సైనికులు
నీ దుడ్డుకర్ర దొంగదెబ్బకు
పట్నం పంజరాలనుండి విడువడిన
పక్షుల్లా పల్లెబాటపట్టారు
గమ్యంఎప్పుడొస్తుందో తెలియని 'తారు' మారు దారుల్లో
చిరుపులు లేచిన శరీరం చిద్రమైనట్లున్న పాదాలతో
ఒకచేతిలోవారసత్వపు కలలపంట మరొకచేతిలో
బతుకుమూట
మార్చి మార్చి ఎత్తుకొంటూ
నడకను ఆహారంగా నములుకొంటూ
కన్నీటినే పన్నీరుగా తాగుతూ
ఆశగా ఆత్రంగా
ఎప్పుడో కూలిపోయిన
మొండిగోడల బంగారుగూడు కోసం
నడక నడక నడక
చెప్తే నువు తలదించుకోవు గానీ
ఈ నడకల్లో ఒంట్లోని రక్తమంతా
చెమట చుక్కలుగా ఆవిరై
ఎముకలతోపాటు ఆయుష్షు అరిగి
ఆకలే ఎరుగని లోకాలకు
అర్థాంతరంగా చేరినప్రాణాలెన్నో

బిడ్డల బాగోగుల నిరీక్షణకే
నిత్యం జీవితాన్ని అంకితం చేసిన తల్లులకు
అప్పుడు అలసినంత విరామమైతే దొరికిందికాని

నిశ్చింత నిద్రలోను నీ కలవరింపే
కోడిపిల్లపై పడే గద్దలా
ఎదిగిన బిడ్డలపై ఏడపడతావో అని
ఆదిమానవుని అడుగునుంచి ఆధునిక దశదాకా
పక్కోడి ఆరోగ్యం బాగుండాలని కోరుకొనే సంస్కృతి
నీ వల్లే పట్టింది
ఏ రోజూ స్టాండుదిగని గరిటెలు
సొంతింటి వంటలను ఆస్వాదిస్తున్నాయి
స్వచ్ఛమైన స్వేచ్ఛాభూమిపై మరక కనిపించినా
మరక మంచిదే అంటారుకదా గుణపాఠాలు నేర్పడానికి
నెగెటివ్ పాజిటివ్‌లు పక్కనపెట్టినా
మా బేరీజులకు నువు అందలేదు
బంధాలెంత బలహీనమో నీ పలకరింపు చెప్పింది
నువు కబళిస్తే
ఆఖరి చూపుల్లేవు, తలగొరివిల్లేవు, శవసంస్కారాల్లేవు
గిట్టుబాటుకాని పంటను బజారులో పారబోసే రైతన్నలా
మలినదేహాల మీద మట్టికప్పేస్తున్నారు
ఏ వేటగాడూ గురిచూసి కొట్టలేనంతగా
చావుదెబ్బైతే కొట్టావుకానీ
హిమాలయాలంత గుండెనిబ్బరం మాదని మర్చిపోకు
నిద్రాణ రోగనిరోధక శక్తిని కూడదీసుకొంటున్నాం
యుద్ధం మాకు కొత్తకాదు, పొరబాటు మా నైజంకాదు
ప్రతి ఇల్లు ఇపుడు సమరక్షేత్రమే
ప్రతి వంటదినుసు నీ మనుగడకు గుదిబండే
మూతికి, ముక్కుకి ముసుగేసుకొన్నాం
బెదిరిపోయామనుకొన్నావేమో
కునుకుపట్టనివ్వని కరోనా అయినా
ఈ నేలపై నీ పంజాను పచ్చడిచేశాక
నిక్కనీల్గిన నీవు నిస్సత్తువులో పెట్టే చావుకేకలు
వినడానికే రెండుచెవులను కొమ్ముల్లా వదిలేశాం చూడు ♦

## విశ్లేషణ




విజయ్ కోగంటి



# ఆలోచనాత్మక అనుభూతుల కవిత్వం


- డా. స్వర్ణలత గొట్టిముక్కల
9951095636


*ప్రకృతితో మమేకమౌతూ మనిషి ఆనందంగా జీవించాల్సిన రహస్యాలతోపాటు ఆత్మానుభవం కేంద్రంగా సమాజపు లోటుపాట్లు, మనిషి జీవితంలోని కృత్రిమత్వం, యాంత్రికత్వం, ఆధునికీకరణ, నగరీకరణ ప్రభావాలు, పరిపాలనలోని అస్తవ్యస్తతలు- ఇలా అనేక విషయాలను స్పృశిస్తూ ఆలోచింపచేస్తుంది ఈ కవితా సంపుటి.*

కవిత్వాన్ని ప్రాచ్యులు, పాశ్చాత్యులు చాలా రకాలుగా నిర్వచించారు. అయితే ఏ కవి కవిత్వాన్నైనా ఏ ఒక్క నిర్వచనానికో పరిమితం చేసి చెప్పలేము. ఎన్నో రంగులు కలిసి అందమైన ఇంద్రధనువైనట్లు ఒక కవి కవిత్వం లోని పలు పార్శ్వాలు పలు నిర్వచనాలను గుర్తు చెయ్యొచ్చు. ఒక్కోసారి కవి రాసే కవిత్వమే కొత్తగా కొన్ని నిర్వచనాలను కూడా ఇవ్వవచ్చు. ఈ మధ్య విజయ్ కోగంటి వెలువరించిన "ఒక ఆదివారం సాయంత్రం- ఇంకొన్ని కవితలు" కవితాసంపుటి పైవాక్యాలకు స్ఫూర్తి. రెండేళ్ల క్రితం నాటి తన మొట్ట మొదటి కవితా సంపుటి ఇలా రువ్వుదామా రంగులు ద్వారా మంచి గుర్తింపు, పురస్కారాన్ని, అభిమానులను సంపాదించుకున్న ఈ కవి తన తాజా సంపుటి లోనూ తమదైన ప్రతిభ చూపారు. గాఢమైన ఆత్మానుభవాలను హృద్యమైన సౌందర్యాభివ్యక్తులుగా ఆయన మలచిన తీరు ప్రశంసనీయం. Beauty is Ananda taking form అని అరవిందులు సౌందర్యాన్ని నిర్వచిస్తూ చెప్పిన మాట, ఈ సంపుటిలో చాలా కవితల మాటున ప్రతిధ్వనించడం కవిత్వ సౌందర్యాన్వేషిగా నా అనుభవం.

యాభై ఒక్క కవితలతో కూర్చబడిన "ఒక ఆదివారం సాయంత్రం ఇంకా ఇతర కవితలు", కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ముందుమాట 'బహిరంతర్ముఖంగా' తో ప్రారంభం అవుతుంది. The earth has music for those who listen అనే విలియం షేక్స్పియర్ మాటతో మొదలయ్యే ఈ వ్యాసం విజయ్ కవిత్వంలోని భిన్న స్వరాలను ఆవిష్కరిస్తుంది. విజయ్ వస్తు విస్తృతినీ, అతడి సాహిత్య దృక్పథాన్నీ విశ్లేషిస్తుంది.

కవి తన అపురూప స్పందనతో తగిన అభివ్యక్తి రూపాన్ని కలిపి ప్రతి కవితనూ ఒక శిల్పంగా చెక్కారు. వ్యక్తీకరణ విధానంలోని నవ్యత, భావలాలిత్యం, శబ్ద సౌకుమార్యం, బహుశ విజయ్ చిత్రించిన సౌందర్యానికి హేతువులు కావచ్చు. స్వయం ప్రతిభా నైపుణ్యాలతో పాటు ఆంగ్ల సాహిత్య అధ్యయనం, అధ్యాపనం, అనువాద ప్రజ్ఞ, మాతృభాష పట్ల అనురక్తి, అభినివేశం, పారంపర్యంగా వచ్చిన చక్కని సాహిత్యాభిరుచి విజయ్ కోగంటి అందమైన కవిత్వాన్ని రాయడానికి ఉపకరించిన అంశాలుగా పేర్కొనవచ్చు.

ప్రకృతితో మమేకమౌతూ మనిషి ఆనందంగా జీవించాల్సిన రహస్యాలతోపాటు ఆత్మానుభవం కేంద్రంగా సమాజపు లోటుపాట్లు, మనిషి జీవితంలోని కృత్రిమత్వం, యాంత్రికత్వం, ఆధునికీకరణ, నగరీకరణ ప్రభావాలు, పరిపాలనలోని అస్తవ్యస్తతలు- ఇలా అనేక విషయాలను స్పృశిస్తూ ఆలోచింపచేస్తుంది ఈ కవితా సంపుటి. 'పొద్దున్నే ఒక పుంజు'తో ప్రారంభమై 'ఒక ఆదివారం సాయంత్రం' తో ముగుస్తుంది. ప్రతి కవితా ఒక వైవిధ్యమే.

ప్రకృతిని ప్రాణవాయువులా కవి శ్వాసిస్తాడని చాలా కవితలు రుజువు చేస్తాయి. నీ తొలి అడుగుకై, ఇంకో

వర్షాకాలంలో, మూడు ప్రశ్నలు – ఒక మౌనం, ఒక కవితా వాక్యాన్ని కావాలి, ఎదురుచూపు మొదలైన చాలా కవితల్లో ప్రకృతితో ముడిపడ్డ కవి హృదయం పరిమళిస్తుంది. అయితే కేవలం ప్రకృతితో మమేకమయ్యే కవిగా మాత్రమే తేల్చేయడం కవిని తక్కువ చేయడమే అవుతుంది.

*ఆకుపచ్చని నీడై నిలిచిన మావూరే/ నా చిన్నతనపు జాడ ఎప్పటికీ / అంతులేని చల్లని కలలా పారుతూ వచ్చి/ తనతో కబుర్లాడమని/ కవ్వించిన ఆ ఏరు/ తలచినపుడల్లా సేదతీర్చి/ ఎగుడుదిగుడుల/ జీవితపు పాఠం చెబుతూంటుంది* (నా అసలు నీడ)

ఈ కవిత అరుదైన కవి సున్నితపు హృదయాన్ని, తాత్త్విక పరిశీలననూ, ఎగుడుదిగుడుల జీవిత ప్రవాహంలోనూ భద్రంగా కాపాడుకున్న కవితాత్మనూ ఆవిష్కరిస్తుంది. అలాగే తన మూలాలను, నీడలను, జాడలనూ కనిపెట్టాలనుకునే వారికీ అవి అందేలా చేస్తుంది. వాటిలోనే కవిత్వపు స్వచ్ఛత తేటతెల్లమవుతుంది.

కనులముందు కదలాడే దృశ్యాలతో చిక్కని శబ్ద, భావ చిత్రాలతో ప్రకృతిని, కవితాభిమానులనూ మెరిపిస్తాడు విజయ్. అందరికీ తట్టని వూహ మామూలు మాటలనే కవిత్వంగా మలిచేస్తుంది. 'మనిషి మరచిన ఆనందపు రహస్యాన్ని' ప్రకృతి ద్వారా శోధిస్తాడీ కవి.

*గంపెడు పిల్లల్ని/ ఎత్తుకున్న/ అమ్మలా నవ్వుతోంది/ మామిడి చెట్టు* (ఇంకా ఆలస్యం ఎందుకు)

అంటూ అందమైన భావ చిత్రాలతో ప్రకృతినే కాక కవితాభిమానుల మనసునీ ఆహ్లాదపరుస్తాడు. చక చకా కదిలే దృశ్యాలు కళ్ళముందు కదలాడుతాయి. చిన చిన్న మాటలతో శబ్ద చిత్రాలు సృష్టించడం విజయ్ ప్రత్యేక రహస్యంగా అనిపిస్తుంది. సరళమైన ఉపమతో మామిడి చెట్టును అమ్మను చేసిన కవి నైపుణ్యం తప్పకుండా చెప్పుకోవలసిందే. ఇలాంటి చమక్కులు ఈ కవిత్వం నిండా కోకొల్లలు. ప్రకృతినే కాదు కవి మనుషులనూ అంతే గాఢంగా ప్రేమిస్తాడు. కవుల మూల లక్షణమే అదిగదా. ప్రేమ లేని జీవితాన్ని ఊహించనట్లే కవిత్వాన్ని కూడా ఊహించలేం.

*చూపుల అవధికి అందని/ ఇంద్ర ధనువొకటి నీకై పలక నందుకూ/ నీ కోసమే అనుకున్న అడుగులు/ నీకై ఆగనందుకూ/ ఎవరు తిరగని దారిలో నీవిలా /ఎప్పటికీ ఎదురుచూసే/ మైలురాయై మిగలాల్సిందే* (కొన్నిసార్లిలా) అంటూ దిగులుపాటై పలవరిస్తారు.

ఏ భౌతిక ఆకర్షణా లేని, ఎవరూ పట్టించుకోని మైలురాయిని కూడాఎంత అందమైన భావ చిత్రంగా మార్చారో గమనిస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. ఇలాటిదే ఇంకొక కవితాత్మక వ్యక్తీకరణ:

*చలి కాచుకున్న నెగడును/ మోహంగా చేసుకుని/ గుండెకు హత్తుకున్న/ ప్రతిసారీ/ నీవిలా దహించుకు పోవాల్సిందే!* (కొన్నిసార్లిలా) అంటూ మోహాన్ని విరహంలో దహింప చేస్తారు.

*అవతలి కొసను తాకాల్సిన/ ప్రాణమొకటి/ నీళ్ల బయటి చేపై/ కొట్టుకుంటూనే ఉంటుంది/ లోపలి ఆశ మాత్రం/ అదే దారికేసే చూస్తుంటుంది* (కొన్ని దూరాలంతే)

సాధారణంగా వర్గ స్పృహతో వచ్చే కవితల్లో గాఢమైన (heightened) అభివ్యక్తులకు ఆస్కారముంటుంది. విజయ్ కోగంటి సరళమైన భావ చిత్రాలతో విరహాన్ని కూడా గాఢమైన అభివ్యక్తిగా ఆవిష్కరించడం ఆయన కలానికి ఉన్న పదునుగా అర్థం చేసుకోవచ్చు.

*చీకటి వెలుగూ నీలో ఎపుడూ సమంగా ఎలా*
*ఆవేశమూ ఆవేదనా కూడా నీకే తెలియనట్లుగా కదా*
*ఒక అద్భుత తాత్విక రహస్యమై పోవడం*
*నీకెపుడూ ఎలా తెలుస్తుంది?* (నిరుద్విగ్నంగా)

అంటూ తనకేమీ తెలియనట్లు ప్రశ్నిస్తారు. కవితలోనూ కవిత వెనుకా ప్రవహించేది ఆమె హృదయమో అలాంటి జీవనదో కవికే తెలియాలి. ఇటువంటి అస్పష్టత (ambiguity) కవిత్వానికి జీవాన్ని తీసుకొస్తుందన్న విషయం కవికి బాగా తెలుసు. ఈ 'సృజనాత్మక అస్పష్టత' మంచి కవిత్వ లక్షణంగా అనేక మంది విశ్లేషకులు భావిస్తారు.

తన బహుముఖీన కవిత్వంలో కవి అంతర్ముఖంగా ఎన్నో దారులను తీసుకున్నాడు. ఒకటి అందరికీ అభిముఖంగా, మరొకటి అందరితోటి, ఇంకొకటి తనలోకి తాను– ఇలా చాలా దారులు, చాలా అడుగులు. ఇన్ని దారుల్లోనూ మనిషినీ, సమాజాన్నీ విస్మరించడు.

*వీధికో మోహిని*
*విశృంఖలంగా తాగిస్తోంది*
*ఆనందంలో అజ్ఞానంలో*
*అసురులను చేసి*
*వెర్రిగా వూగిస్తోంది* (చక్రంలా తిరుగుతూనే)

అంటూ ప్రస్తుత సమాజాన్ని కన్నెత్తి చూడమని

మేల్కొలుపుతాడు.

*ద్రోహం తల ఎత్తి నప్పుడల్లా*
*కదపాల్సిన పెదవీ యుద్ధమే*
*న్యాయపు పిడికిలి బిగించాల్సిన*
*ప్రతి అనివార్య క్షణమూ ఒక యుద్ధమే* (యుద్ధము ఒక అనివార్య క్షణమే) అంటూ పీడనకు వ్యతిరేకంగా ప్రజలను యుద్ధోన్ముఖులను చేస్తారు. రచయిత సామాజిక స్పృహకు ఇంకా చాలా ఉదాహరణలు చెప్పుకోవచ్చు.

*వర్ణాలుగా వర్గాలుగా*
*గాజు గోడల మధ్య చీలి పోతున్న*
*నీ నా మనిషి తనపు అసలు రంగేది*
*పశువులలోనూ పక్షులలోనూ*
*మనుషులమనే మనలోనూ మానుల్లోనూ*
*ప్రవహిస్తున్న ప్రాణానికీ అసలు రంగు ఏది* (అసలు రంగు) అని తాత్వికతను కలిపి మరీ ప్రశ్నిస్తాడు. మనుషుల్లా బతకాల్సిన అవసరాన్ని చెప్తూ

*గాలికి వానకి ఎండకీ ఏటికీ లేని*
*కాల చక్రంతో ఎన్నాళ్ళు కట్టేసుకు కూచుందాం?*
*అదే పనిగా తిరుగుతూ ఉక్కిరి బిక్కిరి అయిపోదాం?*
*కొంచెంగా నైనా మనల్ని మనకోసం మిగుల్చుకుందాం ?*

*మనకిష్టమైన మనల్ని వెతుక్కుందాం !*
*కొంచెం సేపు కాలాతీతంగా మనలాగే బతికి చూద్దాం !*(కొంచెంగానైనా మనలా) అంటూ తనతో పాటు మనల్ని కూడా ఒక అర్థవంతమైన అన్వేషణకు పురికొలుపుతాడు. యాంత్రిక జీవితాన్ని ఆపి ఆటవిడుపును ఆస్వాదించ మంటాడు. యాంత్రికంగా నడుస్తున్న ఈ జీవితం గురించి చెప్తూ తన కవితా సృజన రహస్యాన్ని వెలువరిస్తాడు.

*ఈ అవాస్తవ నాటకం నుంచి /తనను తానే వెలి వేసుకున్న ఒక ఒంటరి/ తనదైన మాటకో పాటకో తచ్చాడుతూ /నిశ్శబ్దపు వీధుల్లోశబ్దపు అడుగై /తన మనసులోతుల రహస్యాలలో/ తనకై తానే శోధిస్తూ* (మరో స్వప్నాన్ని కై)

*తన మనసులోకి తానే నడిచి వెళ్లాడు.*
*చుట్టూ ఎడారి చేసే మనుషులున్నా సరే*
*నాగజెముడు పూవై నవ్వుతూండడం*
*ఇంకా మరీ ఇష్టం* (నా ఇష్టం, నా అయిష్టం)
అని జీవితం పట్ల ఒక సానుకూల దృక్పథాన్ని తెలియజేస్తారు.

చరిత్రలో నిక్షిప్తమైన తథాగతుడి కథ ఎప్పటికీ ఆసక్తిని రేకెత్తించేదే. తలచినపుడల్లాఒక విషాద వీచికేదో హృదయాన్ని కమ్ముకుంటుంది. అలాంటి కథను రెండు విభిన్న కోణాల్లో నుంచి కవి దర్శించి కవిత్వంగా మలిచిన తీరు చాలా హృద్యంగా ఉంది. సిద్ధార్థుడి అంతరంగం విజయ్ చేతుల్లో ఎలా రూపుదిద్దుకుందో చూడండి.

*ఇప్పుడా కెమ్మోవి తేనెల సోనై*
*ఊరించడం లేదు*
*యవ్వనపు పొంగులేవీ*
*కెరటాలై చుట్టేయడంలేదు*
*హంస తూలికా తల్పాన విస్తరించిన*
*సుకుమార సౌందర్య జ్వాలలో*
*దహింపబడేందుకు*
*మనసు ఏ కోరికల కట్టైనా*
*ఎగదోయడం లేదు* (ఎనిమిదో అడుగు)

అంటూ సిద్ధార్థుడి వైరాగ్యానికి ఎనిమిదో అడుగుగా కవితా రూపాన్ని తొడుగుతారు. శీర్షిక మొత్తం కథని ప్రతిఫలిస్తుంది. ఇలాంటి సార్థకమైన శీర్షికలు పెట్టడంలోనూ కవి సృజనాత్మకత తెలుస్తుంది. అంకెల పాస్ వర్డ్ , అసలు రంగు, మాకేం కావాలో మీకు బాగా తెలుసు, కల కాని వేళ తను, యుద్ధమూ ఒక అనివార్య క్షణమే లాటి కవితా శీర్షికలు వైవిధ్యభరితమే కాకుండా చాలా చక్కగా కవితా వస్తువులను ఆవిష్కరిస్తాయి. 'నీవు వినని నా ప్రశ్నలు' కవితలో యశోధర సిద్ధార్థుడి నిర్లక్ష్యానికి గురైన స్త్రీ లా కాకుండా బుద్ధుడి మహాభినిష్క్రమణం తరువాత కూడా ఆమెను అతడి సహధర్మచారిణిగా కొత్తగా ఆవిష్కరిస్తాడు. ఆమె అంతరంగాన్ని ప్రశ్నలతో బుద్ధుడి ముందుంచుతాడు.

*నీవు వదిలి వెళ్ళిన సుఖమో సంతోషమో*
*అకాల శిశిరపు జీవచ్ఛవమై నిలిచిన*
*నేనేమీ*
*మోహంతో*
*చుట్టుకు తిరగడం లేదు*
*బంధాలను వదిలించుకు*
*భగవానుడైన బుద్ధుడివై నీవు*
*బంధాన్ని చుట్టుకుని*
*నీ అడుగుల లోనే భిక్షువునై నేనూ*

*సమ్యగ్ద్రష్టా*

*నీ ధర్మ మార్గం నాది కూడా కదా?*

అంటూ యశోధర గాయపడిన హృదయాన్ని, బుద్ధమార్గాన్ని వీడిపోలేని తనాన్నీ, ఒక కొత్త దృక్కోణం నుంచీ ఊహించారు. ఈ కవితలోని ప్రతి పదమూ ఒక తేనె బిందువై గొప్ప రూప సౌందర్యాన్ని సాధిస్తుంది. నిజానికి విజయ్ కవిత లన్నిటిలో ఒక ప్రత్యేక రూపాపేక్ష కనిపిస్తూ, కవిత పట్ల ఒక ఆసక్తిని రేకెత్తిస్తూ ఆసాంతం చదివి వస్తువును అవగతం చేసుకొమ్మంటూ ఆహ్వానిస్తుంది. అందమైన మనిషికి అందమైన మనసు ఆభరణం అయినట్లు మంచి కవితకు రసజ్ఞుడైన పాఠకుడూ అవసరమే కదా.

స్త్రీపట్ల కవి దృక్పథం రెండు విభిన్నమైన కవితల్లో బయట పడుతుంది. అమ్మనూ, ప్రేమనూ, చిన్న తల్లినీ అపురూపంగా వర్ణిస్తారు. అనేక రూపాలుగా మన ముందు నిలిచే ఆమెను వర్ణిస్తూ

*పలకరించకుండానే / నిన్నో పులకింతల ఆకాశాన్ని చేసే చిన్న తల్లి/ మాటై తాకితే చాలు/ నీకై ఇన్ని నవ్వులూ కన్నీరూ రాల్చే/ పూల చెట్టు* అంటూ చివరి రెండు పంక్తుల్నీ కొస మెరుపులా ప్రయోగించి కవితని మరింత ప్రకాశవంతం చేస్తారు.

*మిత్రమా/ ఇంకా కన్ను తెరిచి చూడగలిగితే/ ఆమె నీ అస్తిత్వపు చిరునామా* (ఆమె) అంటూ స్త్రీని ఆరాధిస్తారు. ఇలాగే ఇంకొక కవితలో–

*ఎందుకమ్మా విచక్షణారహిత/ మృగారణ్యంలో/ ఇలా జన్మిస్తారు?/ మీరూ మనుషులనీ/ వాత్సల్యానికి మారు రూపులనీ/ మేము మరుస్తూనే ఉంటాం/ తొమ్మిది రోజులు/ మీ రూపులకు హారతి లెత్తి/ పదో రోజు నుంచి పశువులై ప్రవర్తిస్తాం* (మమ్మల్ని క్షమించకండి) అనే కవిత సమాజంలోని స్త్రీ పరిస్థితిని అద్దం పడుతూనే ఆమె ఉదాత్తతను, కవిహృదయపు సున్నితత్వాన్నీ అవగతం చేస్తుంది. మగవాని కాముక ప్రవృత్తినీ, కర్కశత్వాన్నీ చాటుతుంది. కవిత ముగింపు చూడండి:

*మిమ్మల్ని పట్టి పీడించే/ మా యీ సిగ్గులేని జాతిని పుట్టించేటపుడే/ ఏ తనమూ లేకుండా చూడండి/ప్రకృతిని అర్థం చేసుకోలేని/ పురుషుడు ఉంటే ఎంత? పోతే ఎంత?*

అంటూ తీవ్ర ఆగ్రహ స్వరాన్ని వినిపిస్తుంది. సహానుభూతితో సున్నిత ప్రకంపనలతో మొదలైన ఈ కవిత క్రమక్రమంగా ఆరోహణ క్రమంలో వెళ్లడం విజయ్ శిల్పాపేక్షను సూచిస్తుంది. ఇలా చెప్పుకుంటూ వెళితే ప్రతి కవితా ఏకకాలంలో ఆనందదాయకమూ ఆలోచనాత్మకమూ కూడా. అలాగే గాడితప్పుతున్న పరిపాలనా వ్యవస్థను సమాజాన్ని వ్యంగ్యంగా మందలిస్తాడు.

సాధారణంగా కథల్లో కొసమెరుపు గురించి చెప్పుకుంటాం. విజయ్ కవితల్లో చాలా వాటిలో ఇలాంటి లక్షణం కనిపిస్తుంది. వేమన పద్యంలోని మూడోపాదం లోక రీతిని వర్ణిస్తూ శక్తివంతంగా హృదయాన్ని తాకినట్లు, కవితలలోని చివరి పంక్తులు కాచి వడపోసిన సారంలా మనసును గాఢంగా హత్తుకుంటాయి.

అన్నీ తెలిసి రాయడం విజయ్ కున్న మరో సానుకూల అంశం. కవిత్వ అధ్యయనం, కవితా వస్తువు, శైలి పట్ల గల అవగాహన కవికి అదనపు శక్తి. అది విజయ్ కవిత్వం లో ప్రస్ఫుటంగా కానవస్తుంది. వస్తువుకు గొప్ప ద్రవ భాషను అనుసంధానించడం వల్ల ఒకే కవిత ఒకసారి ఒకలా, మరొకసారి మరోలా మారుతూ లోతులు తెలుసుకొమ్మని శోధిస్తుంది. మామూలుగా వుండే మాటలతోనే ఎలా కవిత్వీకరిస్తాడో చూడండి:

*మెరిసి మాయమయ్యే సంతోషానికీ*
*మెరవక కురిసే దుఃఖానికీ*
*అసలు రంగేది?* (అసలు రంగు)

...

*కాసింత దాహమే కానీ*
*అది నిను కరిగించే*
*నీటి సరసుకు చేరుస్తుంది* (కొంచెంగానే మొదలై)

కవితకు ద్రవ స్థితిని కలిగించడం ద్వారా పాఠకుడు తన స్థాయిని బట్టి (ద్రవ స్థితిలో ఉన్న) కవిత్వానికి తన అనుభవాన్ని జోడించుకొని ఘనస్థితికి తీసుకెళ్ళేలా చేస్తాడు. మంచి కవిత్వ లక్షణమూ, కవి ప్రత్యేకతా ఇదే. మంచి కవిత్వాన్ని రాయడానికి కవికి కొన్ని అర్హతలు ఎంత అవసరమో పాఠకులకు కూడా దాన్ని ఆస్వాదించగల యోగ్యతను కోరుతుంది విజయ్ కవిత్వం. డా.పాపినేని కూడా అభిప్రాయ పడ్డట్లు 'విజయ్ కవిత కొన్ని ఆలోచనలను మనలో రేకెత్తిస్తుంది. కొన్ని అనుభూతుల్ని శుభ్రపరుస్తుంది'. ♦

## కవిత

## పురిటి మట్టి

- శ్రీనివాస్ అంకే
9652471652



మట్టి విత్తనమవుతుంది
చెట్టై ఆకాశాన్నందుకుంటుంది
తిరిగి విత్తనమై మట్టిలో కలిసిపోతుంది!
మట్టిలో విత్తనం కలిసిందా ?
విత్తనంలో మట్టి కలిసిందా ?
మట్టి గుడ్డవుతుంది
పక్షై పైకెగురుతుంది
దిగంతాల దాకా ఎగిరి
సోలి రాలి మట్టిపాలవుతుంది!
గుడ్డు మట్టి పాలయిందా ?
మట్టి గుడ్డు పాలయ్యిందా ?
మట్టికి పుడతాడు
ఎవర్నో ప్రేమిస్తాడు
ఎవర్నో ద్వేషిస్తాడు
మట్టిని తింటూ పెరుగుతాడు
అంతరిక్షంలో అడుగులు వేస్తాడు.
చివరికి మట్టిలో లయమైపోతాడు.
మట్టిలో మనిషి లయమయ్యాడా ?
మనిషిలో మట్టి లయమయ్యిందా ?
నీళ్ళంతా మట్టితో
ఈ గోళం ఎక్కడెక్కడో తిరుగుతుంది.
మూడు భాగాలు నీళ్లు
ఒక భాగమే నేల !
నీళ్లనాశ్రయించుకొని మట్టి వుందా ?
మట్టినంటుకొని నీళ్లున్నాయా ?

♦

బొగ్గులా నల్లగా,
బంగారంలా పచ్చగా,
ముత్యంలా తెల్లగా,
ఒక్క మట్టిమాత్రమే నవ్వగలదు.
భిన్నరూపాలుగా
తనను తాను పునః సృష్టించుకొనే
ఒకే ఒక ప్రాణి మట్టి !

రెండు హైడ్రోజన్ పరమాణువులు
ఒక ఆక్సిజన్ పరమాణువూ
కలిస్తే నీళ్ళని చెప్పినవాడు,
ఎన్ని మూలకాలు కలిస్తే
ఈ నేల ఏర్పడిందని
ఎందుకు చెప్పలేదు !

మనిషంతా ఎంత !
పిడికెడు మట్టి ...

♦

## జ్ఞాపకాలు

- సింహాద్రి పద్మ
9290174624




ప్రతి సమయాన్ని సందర్భాన్ని
కవిత్వమయం చేసి,
ఎన్నో కవి కలాలలో...
వెలుగు సిరా నింపిన 'అక్షర సూరీడివి'!
'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతి సమాఖ్య' సభలను
దేశ వ్యాప్తంగా నిర్వహించిన 'కార్యశీలివి'!
నాలుగు దశాబ్దాలకు పైగా
వేనవేలుగ 'యువ సాహితీ వికాస వేదికలు'
కల్పించిన 'కార్తవీర్యుడవు'
స్నేహాన్ని నమ్ముతూ, కవిత్వ దాహం తీర్చి
క్రొత్త స్వరాలకు ఊతమిచ్చిన '
ప్రియ బాంధవుడవు'
సమాంతర సాహిత్య సంస్థలన్నింటికీ
అనుభవాల 'దారి దీపానివి'!
అద్దేపల్లి ఆదర్శాల అడుగుజాడల్లో
పయనించిన నిరంతర 'కవిత్వ సంచారివి'!
సెల్‌ఫోన్ సందళ్ళు లేనప్పుడు
ఉత్తర ప్రత్యుత్తరాలైన మీ అక్షర తూణీరాలు
ఎంతోమందికి ఎన్నో ముచ్చట్ల కానవాళ్ళు
ఠాగూర్ లైబ్రరీలోని కవి సమ్మేళనాలు
స్వరాజ్యమైదాన్ పుస్తకావిష్కరణ సభలు
ప్రెస్‌క్లబ్‌లో చేసిన సత్కారాలు
రాష్ట్రవ్యాప్త కవుల సమాహారాలు... మరువరానివి
విజయవాడ వేదికలు.. శిరీష్ గారితో తీపి గుర్తులు
కవులకు అండదండైన 'సాంస్కృతీ సమాఖ్య'
మంచులా మౌనమవుతుంటే...
మనస్సు కరుగుతోంది...
దాచుకున్న సంగతులన్నీ జ్ఞప్తికి తెచ్చుకొని
కన్నీళ్ళను తుడుచుకుంటూ...
నీడలా పరుచుకున్న మీ స్నేహ పరిమళం
నిరంతరం శ్వాసిస్తాను

***(నాలుగు దశాబ్దాలకు పైగా సాహిత్య సేవ చేసిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతి సమాఖ్య (రి) విజయవాడ, యువసాహితి వికాస వేదిక వ్యవస్థాపకులు కార్యదర్శి వి. శిరీష్‌కుమార్ గారి 09.08.2020 న మరణానంతర స్మృతిలో)***

♦

## నచ్చిన రచన




# రాయలసీమ మట్టిపరిమళం


- కొత్తపల్లి సురేష్
9493832470


*ఈ కథలన్నీ యిక్కడి జీవితాన్ని అందులోని ఇక్కట్లని, ఇబ్బందుల్ని నమోదు చేసుకున్నాయి. రేపటికి అవి తొలగిపోయే మార్గాలనీ, ఆలోచనలనీ పాఠకులకు అందజేస్తున్నాయి. ఈ కథల్లో కర్నూలు జీవితాన్ని పరోక్షంగా మొత్తంగా రాయలసీమ జీవితాన్ని చిత్రించారు. ఇది అక్షర సత్యమైన మాట.*

రాయలసీమ కథా ప్రస్థానం 19వ శతాబ్దంలో మొదలైందని ఇటీవల పరిశోధనలు తెలుపుతున్నాయి. రచయిత ఎవరో తెలియని స్పష్టతలేని కథలు మినహాయిస్తే 1926 నాటి మత భేధం తొలి రాయలసీమ కథగా నిర్ధారణ అయ్యింది. ఇంకాస్త ముందుకెళ్తే సంతోషం తర్వాత తొలిసీమ కథగా చెప్పబడుతున్న రామకృష్ణ 'చిరుజీవులు' కథ ఇప్పుడు పూర్వపక్షమైంది. ఆ తర్వాత అనేకులు రాయలసీమ వ్యాప్తంగా కథా రచనకు పూనుకొని కృతకృత్యులయ్యారు. రారా, సభా, సింగమనేని నారాయణ, మధురాంతకం రాజారాం లాంటి లబ్ధప్రతిష్ట కథకులు సీమవ్యాప్తంగా కథాపీఠాన్ని అధిరోహించి సీమ కథాకీర్తిని దశదిశలా చాటారు..ఇనుమడింపజేశారు.

అయితే ఇక్కడి కథాచైతన్యం సంకలనరూపం తీసుకోవడం అదికూడా సీమ అస్తిత్వ భూమికగా కథారచనకు శ్రీకారం చుట్టడం దాన్ని సంకలించి సీమగుండె ఘోషను స్పష్టంగా ప్రకటించడం మాత్రం 1992లో వచ్చిన సీమకథలు సంకలనం చేయగలిగింది. దీని సంపాదకులు సింగమనేని నారాయణ. ఇందులో 18 కథలున్నాయి. అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు 6 చొప్పున అందులో స్థానం సంపాదించుకున్నాయి. అయితే ఇందులో కర్నూలు జిల్లా కథకులకు స్థానం ఇవ్వలేదు. అప్పుడది విమర్శకు దారితీయగా సీమ అవసరాలు, యిక్కడి వాస్తవ జీవిత చిత్రణ, సీమ అస్తిత్వ గొంతుక కర్నూలు కథలో ధ్వనించలేదని, అందుకే స్థానం లేదని సంపాదకులు కుండబద్ధలు కొట్టారు. ఆ తర్వాత ఏ కారణం చేతోగాని సీమనాలుగు జిల్లాల్లో ఏ జిల్లాలోనూ రానన్ని కథలు కేవలం కర్నూలు నుంచే వచ్చాయి. కథాసమయం, హంద్రీకథ, కర్నూలు కథ, గుర్నూలుపూలు, విభజనరేఖలు సంకలనాలు ఒక శరపరంపరలా వచ్చాయి. యివన్నీ కేవలం ఆ జిల్లాకే చెందిన కవుల కథలే కావడం గమనార్హం. ఈ పరంపరలోనే ఇప్పుడు 'నీళ్ళింకని నేల' సంకలనం కర్నూలు నుంచే వచ్చింది. రాయలసీమ ప్రచురణలు పేరుతో తీసుకొచ్చిన ఈ సంకలనం సంపాదకులు సీనియర్ కథకులు ఇనాయతుల్లా-కెంగార మోహన్‌లు.

ఇందులో మొత్తం 13 కథలున్నాయి. ఒక్కోకథ ఒక్కోరుచిని, ఒక్కోదృక్కుని చూపెడతాయి. భిన్న దృక్పథాల కూడలిగా ఈ సంకలనం భాషిస్తూ వుంది. తలపండిన కథారచయితల నుండి అప్పుడే కథా కలం పట్టిన తొలి కథకులూ ఉన్నారు. కొన్ని కథలు పేలిపోతే కొన్ని కథలు తేలిపోతాయి. అయితే తొలిసారి కలంపట్టిన కథకుల కథలూ, వారి కథా విన్యాసాలు విస్మయ పరచడం, సీనియర్ కథలపై పెట్టుకున్న ఆశలు వమ్ముకావడం ఇక్కడ చూస్తాము. మొత్తానికిది అన్ని రకాల కూరలు వంటకాలతో విందుభోజనం చేసిన తృప్తిని మాత్రం కలిగించడం మాత్రం సత్యం.

రాయలసీమ మిగిలిన మూడు జిల్లాల్లోనూ కథారచన కుంటు పడింది. ఒకనాటి కథా గోపురం అనంతపురం, ఇప్పుడు

కవిత్వ క్షేత్రమై వర్ధిల్లుతోంది. విమర్శానిలయం కడప పరిశోధనాగారమైంది. కథాయంత్రం మధురాంతకం నడియాడిన నేల నేడు నెమ్మదించింది. కర్నూలు కథా వాహిని మాత్రం నిత్య కథావసంతమవుతున్నది.

కరవు తరిమితే పొట్టచేత పట్టుకుని వలసపోయే బీదాబిక్కి ఇప్పుడు రోడ్ల మీద వేలమైళ్ళు కాలినడకన సాగిపోతుండడం మనం చూస్తూ వున్నాం. ఆకలితో అలమటిస్తూ, కాళ్ళు బొబ్బలెక్కుతున్నా ఊపిరిబిగపట్టి వారు చేస్తున్న ఎడతెగని యాత్ర. ఎంతటి వారికైనా కంటనీరు తెప్పిస్తుంది. ఈ వలసకూలీ జీవిత నేపథ్యంలోంచి ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించారు మారుతి పౌరుహితం. అదొక మానవీయకోణం కావడం చేత మనగుండెను కదిలిస్తుందా కథ! తొలికథగా ఇందులో పొందుపరచిన 'నీళ్ళింకని నేల' కథ. ఇదే సంకలనానికి పేరుగా తీసుకోవడం జరిగింది. వలసకూలీ పని ప్రదేశంలో జరిగిన ప్రమాదంలో మరణించిన భార్య అస్థికల్ని తన మట్టిలో కలపాలని తపన పడిన  ఒక భర్త కన్నీటిగాథ ఈ కథ. చివరిదాకా పాఠకున్ని మామూలుగా నడుపుకుంటూ చివర్లో ఒక్కసారిగా విస్మయపరిచే మెరుపు ఆ విన్యాసం మారుతి చాలా చక్కగా చేశారు. ఆ కథా యాత్రలో కృతకృత్యులయ్యారు. వర్షాలు రాక, పనులు దొరక్క ఊర్లకు ఊర్లు ఖాళీ అయ్యే సీమ జిల్లాల గ్రామ దైన్యం కథలో జీవం పోసుకుంది.

సీమ అస్తిత్వమొకవైపు దేశాన్ని కబళిస్తున్న ఫాసిస్ట్ శక్తులపై వేసిన చురక ఒకవైపు బ్యాలెన్స్ చేస్తూ నేర్పుతో నడిపిన కథ నిమజ్జనం. దీన్ని అక్షరీకరించినది సీనియర్ కథకులు జి.వెంకటకృష్ణ. కాషాయీకరణ ఈ దేశాన్ని ఎంత వెనక్కి తీసుకుపోతుందో అర్థంకాని మూర్ఖపు యువతను మతం మత్తు ఎంత దిగజారుస్తుందో చెబుతూ ఇక్కడ తాగడానికి గుక్కెడు నీళ్ళు లేవని ప్రజలు గగ్గోలు పెడితే నీళ్ళివ్వరని, అయితే నిమజ్జనం పేరుతో జరిగే ప్రహసనానికి మాత్రం నీళ్ళు తరలిరావడమేంటనే గొప్ప సెటైర్ కథలో ధ్వనిస్తుంది. సంకలనానికి తూకం పెంచే కథ యిది.  కాషాయాన్ని తెరమరుగుచేసే నీలం రంగు తెరపడటంతో కథ ముగుస్తుంది. ఈ కథా శిల్పం భిన్నమైంది.

పల్లెలు స్వచ్ఛమైనవి. కాకపోతే కలుషితమై పోయాయి..కాదు కాదు..కలుషితం చేశారు. యిక్కడి రైతులకు కొత్త వ్యవసాయ పద్ధతులు తెలీవు. పెద్దమొత్తంలో యాంత్రీకరణ చేతకాదు. పెట్టుబడులు పెట్టలేరు. ఒకే పద్ధతి. వాన మీద నమ్మకంతో నేలను కౌగిలించుకోవడం, మట్టిలోకి కొన్ని గింజల్ని నాటుకోవడం, మొలకల కోసం చినుకుల కోసం, రెండుకళ్ళతో ఎదురుచూడటం, నిరాశతో ప్రాణాలు తీసుకోవడం లేదా ఇల్లు వదిలి సుగ్గికిపోవడం.  ఆత్మాభిమానం ఉన్నవాళ్ళు మాత్రం నేలను నమ్ముకొని అక్కడే ఉండిపోవడం ఎలాగోలా అంతే! కానీ, ఊరిమీదుగా ఒక కాలువ వస్తేనో, డ్యామ్ కడితేనో ఎక్కడి వాడో వచ్చి ఇక్కడ భూమి కొంటాడు. పెద్ద పెద్ద యంత్రాలు వాడతాడు. నేలంతా రూకలు చల్లుతాడు. వీడి భూమిలో వీడినే కూలీ చేస్తాడు. ఇదో వైచిత్రి. మట్టిమనిషి కథలో కెంగార మోహన్ వీటిని సృష్టించాడు. భూమిని నమ్ముకోక సుగ్గికి పోతానని చెప్పే కొడుకొకవైపు బోర్ల మీద బోర్లు వేయిస్తూ అప్పుల మూటను మోస్తూ కూడా నేలపై మమకారం చావని తండ్రి మరొక వైపు కథను మోస్తారు. ముగింపు శీర్షికలో నవ్యత లోపించకుంటే ఈ సంకలనంలో మరో గొప్ప కథగా మిగిలేది. అయితే సీమ అస్తిత్వంతో సీమ వెనుకుబాటు తనాన్ని స్పష్టంగా చూపే కథ ఇది. తొలి కథే ఇంత బాగా రావడం కేవలం యాదృచ్ఛికం కాదు. రచయిత వాడిన కర్నూలు జిల్లాకు పశ్చిమ ప్రాంతమైన ఆదోని ఆలూరు మాండలికం నాగప్ప గారి సుందర్రాజ్‌ను గుర్తుకు తెస్తుంది. మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుంది.

సీమలో నిత్యం తాండవం చేసే కరవు కథ పోతన గారి బతుకుపటం. మరో గొప్ప కథ. చదువుతున్నంత సేపూ మనమూ అందులో పాత్రదారులమై పోయేలా చేసే ఉదాత్త ఉన్నత శైలి వారి సొంతం. కాడెద్దు పేరుతో జంధ్యాల రఘుబాబు రచించిన కథ. గ్రామీణ రైతు జీవన చిత్రణే. పశువును సొంతమనుషుల్లా చూసుకున్న గ్రామీణ శ్రమైక జీవన దృశ్యం. ఆ కథ ట్రాక్టర్లు, ఎద్దుల పోటీలో నేడు ఎద్దులు ఓడి అదృశ్యమై పోయాయి. కేవలం ట్రాక్టర్లదే విజయం. ఇదొక మూగ ప్రేమ కథగా నిలిచిపోతుంది.

గ్రామ పెద్దల ముసుగులో, పెద్ద మనుషుల ముసుగులో స్త్రీలపై జరిగే దాష్టీకాలు మామూలివి కాదు. అయితే ఆమె తిరగబడితే తోకముడిచిన మగ మృగాలు ఎక్కడని ప్రవేశించే కథ దుర్గి. సీనియర్ కవి ఇనాయతుల్లా అసాంతం రక్తి గట్టించారు.

'మీటూ' ఉద్యమం పేరుతో ఇటీవల స్త్రీలు బయటికొచ్చి తమపై జరిగిన దాడులను బయటపెట్టడం అందులో పెద్ద

# మేం నిద్రపోతున్నాం

హిందీ మూలం: మంగలేశ్ డబరాల్
తెలుగు: పాయల మురళీకృష్ణ
6300396530

నది మీద
అరణ్యం నీడ కురుస్తోంది
మేం నిద్రపోతున్నాం

ఒడ్డు మీద
బోడిరాయి మెరుస్తోంది
మేం నిద్రపోతున్నాం

చీకటి రాత్రి
తెల్లగా పుష్పిస్తోంది
మేం నిద్రపోతున్నాం



మా పంటపొలాల్ని
వరద ముంచెత్తింది
మేం నిద్రపోతున్నాం

మా పిల్లలు వాళ్ళ కాపీ పుస్తకాల్లో
చనిపోయిన వారి ముఖాలు చిత్రిస్తున్నారు
మేం నిద్రపోతున్నాం ◆

పెద్ద పురుషపుంగవులు వుండటం చూస్తాం. ఈ నేపథ్యంలోంచి మరింత ముందుకు వెళ్ళి సమాజానికి భయపడి నోరు విప్పలేని మధ్య తరగతి మహిళల మనస్తత్వాన్ని, ఇబ్బందుల్ని 'ముసుగు' కథలో చెప్పారు. నాగమణి గారి తొలికథే అయినా ప్రభావవంతంగా కనిపిస్తుంది. భవిష్యత్తుకు బాసట కాగలిగే కథనం వీరిది.

సీమ ప్రతి గ్రామంలోనూ రాళ్ళపై చెక్కిన వీరుల చిత్రాలను వీరగల్లులంటారు. వాటిని ఆయా గ్రామాల చరిత్రకు, ఆ వీరులు, ఆ వీరగల్లులు ఆధారభూతాలు. అట్లాంటి ఒక వీరగల్లు కథే గొర్రెడ్డి హరిశ్చంద్రారెడ్డి పొలిముద్ద కథ.

మరో చారిత్రక కథ యస్డీవి అజీజ్ అస్పష్ట రూపాలు. కర్నూలు నగర చారిత్రక దృశ్యమాలిక ఈ కథ. దళిత బహుజన స్పృహతో నాగమ్మపూలె రాసిన కథ చెదరంగం. ఒక సినిమాను తలపిస్తుంది. ఎన్నికల సందర్భంలో ఉన్నత వర్గాలు నిమ్న వర్గాలపై చేసే దాష్టీకం కథ నిండా అల్లుకుపోయారు. అదొక చెదరంగంగా అభివర్ణిస్తారు. భావితరానికొక ఆశారేఖను బహుజన వాదులకు అందించిన కథ ఇది.

కల్యాణదుర్గం స్వర్ణలత ఆశలపల్లకి ఒక నోస్టాల్జిక్ స్టోరీ. ఒక సరదా కోరికను ప్రేమగా తీర్చే స్నేహబంధం నిజంగా ఆశల పల్లకినే కదా!

ప్రముఖ పరిశోధకులు వెల్దండి శ్రీధర్ పుందు కథ కాల్‌మనీ నేపథ్యంలో సాగే కథ. అధిక వడ్డీలు మోపి ప్రజల్ని దోచుకునే జలగల కథ. అందులో ఆ చట్రంలో బంధీలై నలిగిపోయే అమాయక పేద ప్రజల కథ ఇది. కథ బాగా పండింది. మరో సీనియర్ కథకులు జి. ఉమామహేశ్వర్ కథ రహస్యం. ఆస్తి పంపకాలలో, ధన సంపాదనలో రహస్యంగా లుప్తమయిపోతున్న విలువలను పట్టి చూపుతారు. రచయిత చలం గారి కథల్లోలాగానే మెరుపు ముగింపు అందరినీ కుదుపుతుంది. అనుమానం వచ్చి ముగింపుని మరోసారి చదువుకుంటాం. మరోసారి ఆశ్చర్యపోతాం. ఈసారి తొలిసారంత కాదు.

ఈ కథలన్నీ యిక్కడి జీవితాన్ని అందులోని ఇక్కట్లని, ఇబ్బందుల్ని నమోదు చేసుకున్నాయి. రేపటికి అవి తొలిగిపోయే మార్గాలనీ, ఆలోచనలనీ పాఠకులకు అందజేస్తున్నాయి. సంపాదకుల కృషి సఫలమైంది. ముందుమాటలో ప్రముఖకవి కాశీభట్ల వేణుగోపాల్ అన్నట్లుగా "కథలన్నీ వారి వారి జీవితాల్లో ఎప్పుడో ఎక్కడో సంభవించినవో, విన్నవో అయివుంటాయి. వాటికి కొద్దిగా వారి వారి వైయక్తిక అభిప్రాయాలు జోడించి మన ముందుంచారు" సంపాదకులు అన్నట్లు ఈ కథల్లో కర్నూలు జీవితాన్ని పరోక్షంగా మొత్తంగా రాయలసీమ జీవితాన్ని చిత్రించారు. ఇది అక్షర సత్యమైన మాట.

అయితే ఇందులో కొన్ని కథలకి రీడబులిటీ లేదు. కొన్ని కథలు తొలగించి ఉండాల్సింది. కేవలం ప్రాంతీయ అస్తిత్వానికి పరిమితమై ఉంటే సంకలనం మరింత చిక్కనయ్యేది. ఏది ఏమైనప్పటికీ రాయలసీమ మిగిలిన మూడు జిల్లాల్లోనూ కథా రచన కుంటు పడిందని చెప్పవచ్చు. ఒకనాటి కథాగోపురం అనంతపురం ఇప్పుడు కవితా క్షేత్రమై అలరారుతోంది. కర్నూలు కథా బురుజు వాహిని మాత్రం నిత్య వసంతమాడుతోంది. అన్ని సీమ జిల్లాలను కలుపుకొని సీమసమస్యల నేపథ్యంగా మరో సీమ కథలకు త్వరలో శ్రీకారం చుట్టాలన్న ఆకాంక్ష మాత్రం బలంగా ఉంది. ◆

కథ



# అనూహ్యం

- పి.ఎల్.ఎన్. మంగరత్నం
9701426788

చాలా రోజులుగా...

చెవిని ఇల్లు కట్టుకుని పోరుతున్న స్నేహితుడు మహీపాల్ మాటను కొట్టెయ్యలేక, ఓ ఆదివారం రోజున కొడుకు చరణ్ ని తీసుకుని పెళ్ళి చూపులకని బయలుదేరాడు శివరావు.. ఉప్పలగుప్తానికి.

ఉప్పలగుప్తం మండల హెడ్ క్వార్టరు... వాళ్లుండే పాత గన్నవరానికి ఎంతో దూరం కాదు. కారులో అయితే ముప్పావు గంట ప్రయాణం.

మహీపాల్ స్కూల్ టీచరు. స్వంత ఊరు అదే కావడంతో ఉప్పలగుప్తం చుట్టుప్రక్కల గ్రామాలలోనో, మండలాల్లోనో పోస్టింగులు వేయించుకుని సుఖప్రదమైన జీవితం గడుపుతున్నాడనే చెప్పొచ్చు.

చిన్ననాటి స్నేహితుల్లో ఒకడైన శివరావు, తనలాగే టీచరు కావడంతో తరచూ మీటింగుల్లో కలుస్తుండడంతో మరింత దగ్గరితనం ఏర్పడి, వాళ్ళ ఊరికే చెందిన ఓ పెళ్ళి సంబంధం తీసుకు వచ్చాడు, అతని కొడుక్కి.

మొదట్లో కొద్దిగా నాన్చాడు శివరావు "బయటి సంబంధమా! మా అక్కలు ఇద్దరు ఎదురు చూస్తున్నారు రా! వాళ్లని కాదని, నేను ముందుకు వెళితే బాధపడొచ్చు. ఆలోచించాలి" చెప్పాడు.

"మేనరికాలు వద్దు. మీ అక్కలు ఆశ పడితే మాత్రం.. ఆ చదువు తక్కువైన పిల్లలే కావలసి వచ్చారా? నా కొడుక్కి. అయినా ఒకళ్ళని కాదంటే.. మరొకళ్ళకి బాధ కదా! ఏదీ వద్దు" అంటూ తెగేసి చెప్పిన భార్య షణ్ముఖిని కాదనలేక బయలుదేరక తప్పలేదు.

కారులో ఉన్న..

ఎఫ్.ఎం రేడియో పాటలూ, జోక్స్‌తో పాటు మధ్య... మధ్యలో న్యూస్ కూడా వినిపిస్తుంది.

'కరోనా' వైరస్ అంతకంతకూ ప్రపంచ దేశాల్లో విస్తరిస్తుందనీ, జనాలు జాగ్రత్తగా ఉండాలనీ హెచ్చరిస్తుంది.

టీ.వీ. పెట్టినపుడల్లా అవే మాటలు వినిపించడంతో, మార్చేసి సినిమాలు పెట్టుకునేది షణ్ముఖి. ప్రత్యక్షంగా వినడం ఇదే మొదటిసారి.

"ఏమిటో! ఈ మాయదారి రోగాలు మలేరియా, ఫ్లూ, డెంగీ, చికెన్ గునియాలు విన్నాం.. ఇప్పుడీ కొత్త రోగం. వాటన్నిటికీ మందులొచ్చినాయ్. దీనికే ఇంకా కనిపెట్టలేదట.. కనిపెట్టేసరికి ఎంతమందికి ఆయువు చెల్లుతుందో" స్వగతంలా అనుకుంది.

చరణ్ మౌనంగానే కారు నడుపుతున్నాడు, ఈ మధ్య తరచూ వినే మాట ఇదని.

మొదటి చూపులోనే ...

కొబ్బరితోటలో ఉన్న విశాలమైన భవంతి ఆకట్టుకుంటే...

చూపులు కలిసిన శుభ వేళలో...

చక్కనైన కనుముక్కు తీరుతో.. అంతే నాజూకుగా, ఉన్న

'కీర్తన' వాళ్ళకి మరింతగా నచ్చేయ్యడంతో సంతోషపడ్డారు. డిగ్రీ చదివింది. చదువుకి చదువు. అందానికి అందం.

చరణ్, రాజోలు గవర్నమెంటు కాలేజీలో కాంట్రాక్టు లెక్చరరు. రోజూ గన్నవరం నుంచే వెళ్లి వస్తుంటాడు. జరుగుబాటుకేం ఇబ్బంది లేదు. శివరావుకి కాస్త పొలం కూడా ఉంది.

కాదనడానికి కారణం కనిపించలేదు ఇరువైపుల వాళ్ళకీ.

"మీరు చెప్పినప్పుడు ఏమో! అనుకున్నాను అన్నయ్యా! మా పిల్లాడి ప్రక్కన ఈడూ, జోడూగా బాగానే ఉంది. మిగిలిన విషయాలు కూడా చూడండి'' కారు వరకూ వచ్చి సాగనంపుతున్న మహీపాల్తో అతనికి మాత్రమే వినిపించేలా చెప్పింది షణ్ముఖి.

"నేను అదే చెప్పానమ్మా ! వాడికి. అక్కలు బాధపడతారు అంటూ కూర్చున్నాడు. ఈ ఏడాది ఎలాగైనా పిల్లకు పెళ్లి చెయ్యాలని పట్టుదలతో వీళ్ళున్నారు. నాకు చిన్నప్పటినుంచీ తెలిసిన పిల్ల, అందుకే పట్టుబట్టాను. మీకు లాగే, వాళ్ళకీ ఓ కొడుకూ, కూతురు. అతనిది ధాన్యం వ్యాపారం. ఒక్కతే కూతురు కావడంతో పెట్టుపోతల్లో ఇబ్బంది లేదు. మంచి సంబంధమనే ప్రాకులాడ్డం"

వారం తిరిగేసరికి ఆడపెళ్ళి వాళ్ళూ, అబ్బాయి ఇంటికి వెళ్లి ఇల్లు చూసి వచ్చారు.

అందరికీ అన్ని విషయాలూ నచ్చుడంతో

మహీధర్ మధ్యవర్తిత్వంలో..

దాదాపుగా ఖాయం అయిపోయింది.

పెట్టుపోతలూ, లాంఛనాలూ నిర్ణయం అయిపోయాయి.

షణ్ముఖి అయితే, సంబంధం ఎక్కడ చెయ్యి జారిపోతుందో అన్నట్లు అవతలవాళ్ళు ఏమన్నాగాని 'సరే' అంటుంది. లేకపోతే, భర్త మళ్లీ అక్కల ప్రస్తావన తేవచ్చు.

''మా పంతులు గారిని కనుక్కుని నిశ్చితార్థం పెట్టుకుందాం అమ్మా" చెప్పాడు పెళ్ళి కూతురి తండ్రి బలభద్రయ్య, షణ్ముఖితో.

"మనకు అన్నీ నచ్చితే, ఇంకా నిశ్చితార్థం ఎందుకు? అన్నయ్యగారూ. పిల్లా, పిల్లాడూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. ఒకళ్ళ పద్ధతులు, ఒకళ్ళకు నచ్చాయి. ఒకేసారి పెళ్లి ముహూర్తమే పెట్టించెయ్యండి. మంచిరోజు చూసి వినాయకుడికి ముడుపు కట్టుకుంటే..పనులు మొదలు పెట్టుకోవచ్చు" చెప్పింది షణ్ముఖి.

"అబ్బే! మాకు ఉన్నది ఒకత్తే కూతురు. మా ముచ్చట్లూ మాకు తీరాలి. మాకు బలగం ఎక్కువ, పెళ్లి మాట ఎలా ఉన్నా నిశ్చితార్థానికి అందరూ వస్తారు. వేడుకగా నిశ్చితార్థం జరగాలి" పట్టుబట్టింది పెళ్ళికూతురి తల్లి రత్నమాల.

"అవును. మా ముచ్చట్లు మాకుంటాయి" బలపరిచారు ఆమె బంధువర్గం.

వాళ్ల కోరిక మనించడం అందరికీ ఆమోదయోగ్యం అయ్యింది.

♦♦♦

ఆ తరువాత జన జీవితాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి.

అలాంటి మార్పులు కూడా ఉంటాయని ఎవరూ ఊహించలేదు. నెమ్మది నెమ్మదిగా కరోనా వైరస్ చాపక్రింది నీరులా మన దేశాన్నీ ఆవహించింది.

భౌతిక దూరం పాటించడమే తరుణోపాయమని ప్రభుత్వాలు 'లాక్డౌన్' ప్రకటించాయి.

లాక్డౌన్లో ఎవరూ, ఎక్కడికీ వెళ్ల కూడదు. కలుసుకోకూడదు.

స్కూళ్ళూ లేవు, పిల్లలకు చదువూ లేదు. విందులూ, వినోదాలకూ తావులేదు. జనజీవనం అస్తవ్యస్తం అయిపోయింది. అందరూ ఇళ్ళకే పరిమితం అయ్యారు.

లాక్డౌన్ పెట్టి మూడు నెలలు గడవడంతో...

లాక్డౌన్‌కి కొద్దిగా సడలింపు ఇచ్చారు. జిల్లాలో కొద్దిగా రాకపోకలకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం.

కొన్ని దుకాణాలూ, హాస్పిటల్స్ తెరుచుకుంటున్నాయి.

అన్నాళ్ళూ మూతపడిన తన వ్యాపార లావాదేవీలు చూసుకోవడంలో తలమునకలుగా ఉన్నాడు బలభద్రయ్య.

రాజమండ్రిలో ఉన్న కీర్తన తాతగారు ఎనభై ఏళ్ళ సోమసుందరం...

మనవరాలికి పెళ్ళి కుదిరిందని, తెలిసీ అల్లుడింటికి వచ్చాడు.

అతనికి రాజకీయాల మీద ఆసక్తి మెండు. ఆ ఉత్సాహమే అతన్ని ఆ వయసులో కూడా ముందుకు నడిపిస్తుంది. పెళ్ళి చూపుల సమయంలో... గ్రామాంతరం వెళ్లడంతో హాజరు కాలేకపోయాడు గానీ, లేకపోతే, పెద్దవాడిగా అన్నిటికీ తనే ముందు ఉండేవాడు.

వివరాలు అన్నీ తెలుసుకుని, తనూ ఒక్కసారి,

మనవరాలిని చేసుకోబోయే 'అబ్బాయిని' నిశ్చితార్థానికి ముందే ఓ సారి చూసి రావాలని నిర్ణయించుకున్నాడు.

విషయం తెలుసుకుని..

దగ్గరలోనే ఉన్న ఇద్దరు కొడుకులూ, భార్యలతో సహా బయలుదేరుతుండడంతో 'టేక్సీ' మాట్లాడుకుని బయలుదేరారు.

ఉదయపు ప్రయాణం కాలువ గట్టున చాలా ఆహ్లాదకరంగా ఉంది.

తొలకరి ప్రారంభంలో వరి నాట్లకు సిదమవుతున్నారు రైతులు.

చిన్న వయసులో ఉన్న టాక్సీ డ్రైవర్ కూడా హుషారుగా కబుర్లు చెబుతున్నాడు... సమయం తెలీనట్లు.

డ్రైవర్ ప్రక్కన కూర్చున్న సోమసుందరం "ఇప్పుడంటే.. ఈ లాక్డౌన్ సమయం ఇబ్బంది పెడుతుందనుకో. మామూలు సమయాల్లో నెలలో అన్ని రోజులూ పని దొరుకుతుందా! నీకు" అడిగాడు.

"పర్వాలేదు సార్! ఇబ్బందేం లేదు. అదీ గాక గవర్నమెంటు ఆసుపత్రిలో కాంట్రాక్టు డ్రైవర్ని అవసరం 'ఉన్నప్పుడు' కాస్త ముందుగానే తెలియచేస్తారు. అప్పుడు వెళితే సరిపోతుంది" చెప్పాడు రాజేంద్ర.

"అవసరం అంటే ఏమిటి? హాస్పిటల్ అన్న తరువాత డ్రైవర్‌కి ఎప్పుడూ పని ఉంటుంది కదా" అడిగాడు సోమసుందరం పెద్దకొడుకు.

"వేరే ఊళ్ళలో ఉండేవాళ్ళు, ఇక్కడి హాస్పిటల్లో చనిపోతే... ఆ డెడ్ బాడీని వాళ్ళ వాళ్ళకి అప్పగించి రావాలి. అలా నెలలో ఒకటి రెండు కేసులు వస్తాయి. అలాంటి అవసరం రాకపోయినా... నెల తిరిగే సరికి నా జీతం నాకు వచ్చేస్తుంది" చెప్పాడు ధీమాగా.

రోజు కిరాయికి పని చేసినా మాకూ బ్రతుకుతెరువుకి ఇబ్బందేం ఉండదన్నట్టు.

ఓపిక ఉన్న వాళ్లకి అన్నీ మంచి రోజులే... నవ్వుకున్నారు.

అయితే, అదే కొంప ముంచుతుందని అస్సలు ఊహించలేదు ఎవరూ...

పెళ్ళి కొడుకు లాగే, మర్యాదలూ, మన్ననలూ వాళ్ళను సంతోషపెట్టాయి.

ఎలా చూసుకున్నా వాళ్ల జంట కన్నుల పండుగగానే తోచింది.

శివరావుని ఉద్దేశించి "చూడండి బాబూ! పెద్దవాడిగా చెబుతున్నాను. ప్రస్తుతం కాలం మన చేతుల్లో లేదు. ఎప్పుడైనా విన్నామా! ఇలాంటి విపత్కర పరిస్థితి. కాలానికి జబ్బు చేసింది. అప్పుడే మూడు నెలలు. మన అదృష్టం బాగుండి...లాక్డౌన్ సడలించింది ప్రభుత్వం. జరగాల్సిన ఆలస్యం ఏదో జరిగిపోయింది. ఇక హంగూ ఆర్భాటాలు అంటే... ప్రస్తుత రోజుల్లో జరగవు"

"క్రీస్తు పూర్వమూ, క్రీస్తు తరువాత అన్నట్లు... కరోనాకు ముందూ, కరోనాకు తరువాత అన్న రోజులు వచ్చాయి. కాబట్టి, ఏదో ముహూర్తం పెట్టి, వాళ్ళని వెంటనే కలిపెయ్యండి"అంటూ సలహా ఇచ్చాడు సోమసుందరం.

"అవునండీ! ఇలాంటి గడ్డు కాలం ఒకటి వస్తుందని అనుకున్నామా! మొట్టమొదటి పెళ్ళి కదా అని వేడుకగా చెయ్యాలనుకున్నాం. అయ్యేటట్టు లేదు. ఇప్పుడు గవర్నమెంటు పర్మిషనుతో చాలా కొద్దిమందిని మాత్రమే పిలుచుకోవాలి" చెప్పాడు శివరావు.

"నిజమే! టీ.వీల్లో అలాగే చూపిస్తున్నారు" విచారం వ్యక్తం చేసింది షణ్ముఖి.

"అంతే, కాలం ఎవ్వరి చేతుల్లోనూ లేదు" చెప్పాడు మహీపాల్ మాష్టారు.

◆◆◆

నెమ్మదిగా దేవాలయాలూ తెరుచుకున్నాయి. దేవాదాయశాఖకు ఆదాయం కొరవడడంతో.

బేరం తగిలితే, బయలుదేరే ముందు..

ఇంటికి దగ్గరలోనే ఉన్న నూకాలమ్మ గుడికి వెళ్లి దండం పెట్టుకుంటాడు రాజేంద్ర.

ఆ రోజు..

అలాగే, వెళ్ళడంతో గుడి బాగా ఖాళీగా ఉండడమే కాదు. ఆలయ సిబ్బంది ఓ రిజిస్టరు ముందు పెట్టుకుని కూర్చున్నారు. పేరూ, సెల్ నెంబరు వ్రాసుకుంటున్నారు. అప్పటి వరకూ వచ్చిన భక్తుల పేర్లు అలాగే నమోదు అయి ఉన్నాయి. చివరిగా నుదుటి మీద ధర్మా స్క్రీనింగు లైటు కూడా వేసి చూసారు.

వాళ్ళకి ఏం తేడా కనిపించిందో గాని, ముఖముఖాలు చూసుకున్నారు.

"వొళ్ళు వేడిగా ఉన్నట్లుంది కదా"

"అయ్యో! నాకేం లేదు సార్! కాస్త జలుబు చేసిందంతే, నేను ఇప్పుడు కొత్త డ్యూటీ ఎక్కుతున్నాను కూడా" చెప్పాడు

## నాన్న

- కొత్తపల్లి మణీత్రినాథరాజు
9949389296



*నాన్న కన్నెర్ర చేస్తే*
*భయమే కాదు*
*బాధ్యతని చెప్పింది*
*బ్రతుకు పయనం నేర్పింది.*
*చేయందిస్తే*
*పడినప్పుడు లేవడం*
*నేర్పింది*
*పడిలేచి నడవడంలో*
*నేర్పు చెప్పింది.*
*చేయి లేపినప్పుడు*
*తప్పును గుర్తించమంది*
*తప్పు చేయకుండా*
*ఒప్పు నిలబెట్టింది.*
*కసురుకున్నప్పుడు*
*ఊపిరి బిగబెట్టించి*
*నిట్టూర్పులను*
*జయించడం చేతనైంది.*
*మట్టికాళ్ళతో నడుస్తుంటే*
*మట్టి విలువ కనిపించేది*
*మట్టిలో మొలకెత్తే*
*రైతు తనాన్ని నేర్పింది.*
*మాట్లాడుతుంటే*
*మనసు బయటపడేది*
*మనిషికీ మనసుకీ*
*వారధై వెలుగు చూపింది*

*పంటచేను కోస్తుంటే*
*దేశానికి వెన్నెముక*
*విలువైన పాటను పుట్టించి*
*రేపటి రైతై సాగమంది.*
*పంటని అమ్ముతున్నప్పుడు*
*కాటాకాడ దళారితనంపై*
*నిఘాని చెప్పి*
*దోపిడీని ఆపే మాట చెప్పేది*

*జీవన సారం చెబుతుంటే*
*మట్టికీ మనిషికీ మధ్య*
*బంధాలకు ఊపిరోసీ*
*ఊరంటా పంచడం నేర్పింది.*
*కన్నీళ్ళు మింగటం*
*రేపటి పంట యుద్ధానికి*
*ధైర్యమౌతూ*
*కొత్త శక్తికి వీలు వ్రాసేది*
*అందుకే నాన్న నాన్నే*
*దేశంకోసం వెన్నలా కరుగుతూ*
*కుటుంబ మెతుకు ముద్దలో*
*నెయ్యిలా కలిసి పోతున్నాడు.*

*నాన్న*
*ఆశించేది అదే*
*శ్వాసించేదీ అదే*
*ప్రేమించేదీ అదే*
*ప్రేమయ్యేదీ అదే!*

*నాన్న*
*గుప్పెడంత గుండె నాలుగు గదుల్లో*
*దేశం, కుటుంబం*
*విలువలూ, విచారణలూ*
*ప్రసరిస్తుండటం నాన్న చిరునామా*
*విశ్వ వేదికపై*
*సూర్య చంద్రులతో*
*తిరుగుతూనే ఉంటుంది.*

◆

దేవుడి వైపే చూస్తూ.

పూజారి ఒక్కడే మంత్రాలు చదువుకుంటున్నాడు. భక్తుల రాకతో తనకేం ప్రమేయం లేదన్నట్లు... భగవంతుడి సేవ ముఖ్యం అన్నట్లు.

ఉన్న చోటునే అమ్మవారి దర్శనం అయిపోయింది గనుక, వీలు దొరికితే, వెనక్కి వచ్చేయ్యాలని అనుకున్నా వీలు అవలేదు.

సంబంధితులకు ఫోన్ వెళ్ళిపోయింది.

రెండు రోజుల తరువాత..

రాజేంద్రకి కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది.

◆◆◆

విచారణలో...

చివరిగా టాక్సీ ఎక్కిన సోమసుందరం కుటుంబ సభ్యులూ తెరమీదకి వచ్చారు.

అందరికీ కరోనా పరీక్షలు జరిగాయి.

మొత్తం అందరికీ, సోమసుందరంతో పాటు కొడుకులకీ, కోడళ్ళకీ పాజిటివ్ వచ్చింది.

అందర్నీ క్వారంటైను తరలించగా వయసు పై బడిన సోమసుందరానికి మాత్రం, వెంటనే 'కాలం' చెల్లిపోయింది.

పెళ్లింట అపశృతి. అనుకోని విషాదం.

అంతా నేనే, అన్నింటా నేనే అన్నట్లు నెత్తురు చుక్క నేల రాలకుండా విజృంభిస్తుంది మహమ్మారి. అది విసిరిన వలలో చిక్కుకునే వారు ఎందరో.

◆

విశ్లేషణ



# గిరిజన సాహిత్యాన్ని నిజంగా ప్రోత్సహిస్తున్నామా?


పలమనేరు బాలాజీ
9440995010


తెలుగు సాహిత్యంలో ఆదివాసి సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. అడవులను, ప్రకృతిని నమ్ముకున్న నిరుపేద గిరిజనుల వ్యథలను అక్షర రూపంలో గిరిజన, గిరిజనేతర రచయితలు సృజనాత్మకంగా అక్షరీకరిస్తున్నారు. కొన్ని ప్రత్యేకమైన సంచికలు, వివిధ సందర్భాలలో వెలువడిన పుస్తకాలు ఆదివాసి సాహిత్యానికి పెద్ద పీట వేశాయి.

తెలుగు దిన పత్రికల సాహిత్య పేజీలలో ఆదివాసి కవిత్వానికి ఒక పేజీని పూర్తిగా కేటాయించి ఆంధ్రభూమి దినపత్రిక ప్రత్యేకతను చాటుకుంది. జయధీర్ తిరుమలరావు గారు సమన్వయం చేసిన "గిరిజన కవిత" ఆంధ్రభూమి సాహితీ పేజీలో 2012 మే 7న ప్రచురితం అయింది. గిరిజనుల సమస్యల మూలాలు, పోరాటాల గురించిన కరపత్రాలు పుస్తకాలు ప్రత్యేక సంచికలు వెలువరించటం వేరు. దినపత్రికలో పూర్తిగా సాహిత్య పేజీని గిరిజన కవితకు కేటాయించడం వేరు. ఇందులోని ఎనిమిది కవితలు గిరిజనుల జీవితాన్ని, పోరాటాన్ని ప్రతిబింబిస్తాయి.

అప్పుడప్పుడు కొన్ని ప్రత్యేక సంచికలు వెలువరించడం ద్వారా ప్రత్యేకంగా ఒక విషయం పైన, ఒక వస్తువుతో రాసిన కవితల్ని ప్రచురించడం ద్వారా పాఠకులకు సమకాలీన విషయాలు, పరిస్థితుల పైన కవుల గొంతును ఒక్కసారిగా వినిపించినట్లు అవుతుంది. తద్వారా ఒక సామాజిక అంశానికి లేదా సామాజిక సమస్యకు సంబంధించి కవుల అభిప్రాయాలు, కవుల ఆవేదన తెలుస్తాయి. సమస్యలను ఏ దృష్టితో చూశారు, ఏ రకంగా చిత్రీకరించారు, ఏ విధమైన కొత్త ప్రతిపాదనలు చేశారు, సమస్యలకు పరిష్కారాలు ఏవైనా సూచించారా అనే అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. గిరిజన జీవితానికి సంబంధించిన కథలు కవిత్వం ఎక్కువగా వచ్చినప్పటికీ వస్తువు ప్రాధాన్యత రీత్యా, మంచి శిల్పంతో రాసిన రచనలలోని వైవిధ్యం పాఠకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది. గిరిజన సాహిత్యానికి మరింత ప్రోత్సాహం అవసరం అనేది అందరూ అంగీకరించే విషయం. గిరిజన జీవితం పైన సమస్యలపైన గిరిజన సాహిత్యం పైనా పరిశీలనలు, పరిశోధనలు చర్చలు జరిగినప్పుడే, మరెంతోమంది రచయితలు మరెన్నో రచనలు రావటానికి అవకాశం ఉంటుంది. వాట్సప్ గ్రూపులలో ఒకటి రెండు చోట్ల ఆదివాసీ రచయితల సమూహాలు సంఘాలు ఉన్నప్పటికీ, ప్రధానంగా తెలుగు పత్రికలు గిరిజన రచనల పైన ప్రత్యేక దృష్టి నిలపడం లేదు. కొన్ని కథా సంకలనాలు, కొన్ని కవితా సంకలనాలు వెలువడినప్పటికీ, వస్తు ప్రధానంగా, ఒక నిర్ణీత కాల వ్యవధిలో రాసిన గిరిజన రచనలను ఒక సంకలనంగానూ, విస్తృత ప్రాతిపదికన సేకరించిన రచనలను ఒక సమగ్ర సంకలనంగా తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన, విశ్వవిద్యాలయాల పైన, సాహిత్య సంస్థల పైనా ఉన్నదని చెప్పక తప్పదు. అక్కడక్కడా అడపా దడపా కొంతమంది రచనలు చేస్తున్నప్పటికీ కథ కవిత్వం నవల విమర్శ నాటకం ఇత్యాది రంగాల్లో గిరిజన సాహిత్యం మాటేమిటి అన్నది, గిరిజన సాహిత్యం స్థానం ఏమిటి అన్నది ప్రధానమైన ప్రశ్న.

◆◆◆

గిరిజనుల సమస్యలు ప్రత్యేకమైనవి. ఈ ప్రత్యేకమైన సమస్యలను దగ్గరగా, దూరంగానూ పరిశీలించిన అనుభవించిన సామాజిక కార్యకర్తలు అన్ని భాషల్లో గిరిజన సాహిత్యాన్ని వెలువరించారు. దోపిడీకి గురవుతున్న గిరిజనుల సమస్యలు ఎంత తీవ్రమైనవో హక్కులకోసం, ఉపాధి కోసం, భూమికోసం, గుక్కెడు మంచినీళ్ల కోసం, విద్య వైద్యానికి దూరంగా వుండిపోయిన గిరిజనులు చేస్తున్న పోరాటాలు అంత తీవ్రమైనవే. అందరికీ అందుబాటులో ఉండే మంచినీరు, పౌష్టిక ఆహారం, వసతి, విద్య, వైద్యం, విద్యుత్తు, ఉపాధి అవకాశాలు ఇంకా చాలా ప్రాంతాల్లో చాలా మంది గిరిజనులకు అందుబాటులో లేకుండా పోయింది. గిరిజనుల పట్ల ప్రేమతో ఆర్తితో వారి పోరాటంలో భాగం పంచుకుంటూ గిరిజన సాహిత్యాన్ని వెలువరిస్తున్న ఎంతోమంది సాహిత్యకారుల రచనలు ఇంకా విస్తృతంగా అందరికీ అందుబాటులోకి రావాల్సి ఉంది. కేంద్ర సాహిత్య అకాడమీ లాంటి సంస్థలు వివిధ భాషల్లోని గిరిజన సాహిత్యం గురించి ఒక జాతీయ స్థాయి సదస్సును నిర్వహించడం కూడా గమనార్హం.

తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితాలకు సంబంధించిన కథా సంకలనాలు, సంపుటాలు ,నవలలు కొన్నైనా వెలువడ్డాయి కానీ గిరిజన కవిత ఆ స్థాయిలో సంకలనంగా వెలువడకపోవడం ఒక విషాదం. గిరిజనులు రాసిన రచనలతో సంకలనాలు రావాల్సిన అవసరం కూడా ఉన్నది. ఏదేమైనప్పటికీ గిరిజన సాహిత్యాన్ని గుర్తించడం ప్రోత్సహించడం ఒక చారిత్రక అవసరం.

◆◆◆

ఆంధ్రభూమి దిన పత్రికలో వచ్చిన " గిరిజన కవిత " విషయానికి వస్తే జూలూరు గౌరీశంకర్, సూర్య వంశీ, యింద్రవెల్లి రమేష్, మల్లిపురం జగదీష్, గంటేడ గౌరు నాయుడు, ఎలనాగ, సిరికి స్వామినాయుడు, డాక్టర్ దామెర రాములు ఈ ఎనిమిది మంది రాసిన కవితలు ఇందులో ప్రచురితమయ్యాయి.గిరిజన జీవితానికి అద్దం పట్టడానికి ప్రయత్నించిన ఈ కవితలను పరిశీలిద్దాం.

◆◆◆

*మానవీయ నిర్వచనం: జూలూరు గౌరీశంకర్*

*నా సమస్త ప్రపంచానికి /*
*దేహాన్నిచ్చి కాపాడుతున్నవాడు/*
*ఈ లోకాన్ని కలుషితం కాకుండా/*
*కాపాడుతున్న కాపలాదారుడు/*
*ఈ భూగోళమే నీకు దాసోహం /*
*ఎందుకంటే భూమికి నిలకడ నేర్పినవాడా /*

*నువ్వు అడవి అందమే కాదు/ అడవి సంరక్షణా నువ్వే / ధ్వంస శక్తులను ఎరకపట్టి/ తల్లికోడిలా అడవిని కాపాడుతున్న/ వెచ్చటి కౌగిలి నీది / సౌందర్యాన్ని చెరచాలని చూసే/ నాగరిక సమాజానికి శస్త్రచికిత్సవు/ గురిచూసి కొట్టేవాడివి/ గుండె ధైర్యమున్నోడివే కాదు/ అస్తిత్వ ఆత్మరక్షణ కవచానివి/ విరిసే పువ్వులా నవ్వే వాడివే కాదు/ ఎదురు తిరిగితే పౌరుషానికే పదునువు/ అడవులను మేసేవాళ్లను తన్ని /తరమడానికే/ ఆదివాసీ క్రీస్తులా గొర్రెలను కాస్తుంటావు/ కాలం మనుగడను కాపాడటానికి /ప్రకృతి వొడిలో పుట్టినోడివి/ నువ్వు జాతికి జీవం పోస్తూ/ సంపదలను కాపాడుతున్న గుమ్మివి/ మానవీయ సంస్కృతికి నిర్వచనానివి/నీ పాటలతో మా దప్పిక తీరుతుంది/ నీ మునివేళ్లతో ఈ అనాగరిక సమాజాన్ని /తాకి మేల్కొలుపు/ ఆదివాసి అనుబంధం లేని నేల/ స్తన్య మందని పసిబిడ్డ కేక*

◆◆◆

అభద్రతకు లోనవుతున్న గిరిజనులకు సాయం అందించడానికి ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు ఒకవైపు మేలు చేస్తున్నప్పటికీ ఈ కార్యక్రమాల గురించి గాని ఈ సహాయం గురించి గాని ఏమీ తెలియని ప్రపంచంలో బ్రతుకుతున్న గిరిజనులకు ఒక ఆసరా కావాలి. జనాభా లెక్కల్లో, ఓటర్ల జాబితాలో వాళ్లు ఉన్నారో లేదో కూడా తెలియని పరిస్థితులు కొన్నిచోట్ల ఉంటాయి. అలాంటి వాళ్లకు సాటి మనిషి స్నేహ హస్తం అందించాలి. గిరిజన కవిత్వం నిండా అడవి వాసనే ఉన్నదంటే .. అది ఆ స్నేహం వల్ల, ఆ ప్రేమ వల్లనే సాధ్యం.

◆◆◆

మల్లిపురం జగదీష్, పద్దం అనసూయ, గిరిజన రచయితలుగా ప్రసిద్ధులు. ఇంకొంత మంది గిరిజనుల రచనలు మరింత వెలుగులోకి రావలసి ఉంది. ఈ ప్రత్యేక సాహితీ పేజీలో మల్లిపురం జగదీష్ రాసిన స్పర్శ కవితను చూద్దాం.

*"స్పర్శ"*

*ఎక్కడో ఒకచోట /మనం స్పర్శని కోల్పోవాల్సి వస్తుంది/ నలుగురితో నడవలేనపుడో /నడిచినా గొంతెత్తి/ మాట్లాడలేనపుడో.../*

*చిక్కని చీకటితో /వెలుగుని కలగన లేనపుడో/ కలగన్నా.. నిదుర కళ్ళను/ తెరవలేనపుడో..../ ఎప్పుడో ఒకప్పుడు / మనం ప్రేమరాహిత్యాన్ని/ ఎదుర్కోవలసి వస్తుంది./ బాల్యమిత్రుడు/ ఒక సంధ్యా సాయంత్రమై /తూరుపు దిక్కుకు/ పయనమవుతూ ఎదురైనపుడు/ అతన్ని పలకరించి/ కౌగిలించుకోలేని సందర్భాన/ మనం స్పర్శని కోల్పోతాం./ భుజాలమీద చీకటి మూటను విప్పి/ వేళ్ళు కోల్పోతున్న మొక్కల్ని/ ఆత్మలేని దేహాల్ని చూపించి /వ్యవసాయం చేయాలని చెప్పిన అతన్ని/ అభినందించలేనపుడు /మనం నిర్జీవమై.../ దోషులపై నిలబడాల్సొస్తుంది /మన గాయాలన్నీ/ అతని ఒంటిమీద మననం/ చేసుకుంటున్నప్పుడో/ మన నిరసన నినాదాలన్నీ/ అతని చేతివేళ్ళుగా పిడికిలి/ బిగుసుకుంటున్నపుడో/ అతని కళ్ళలోకి సూటిగా చూడలేక/ సిగ్గుతో తల దించుకోవాల్సొస్తుంది/ సుదీర్ఘ ప్రయాణంలో/ ఏ ఎర్రటి నదినో / ఏ సరిహద్దునో దాటుతున్నప్పుడు/ చీకటి సాక్షిగా/ అర్ధరాత్రి.../అడవిని దువ్వుకుంటూన్న/ దెయ్యాల చేతిలో/ అతను నేలకొరిగినపుడు/ తెల్లవారడం అబద్ధమవుతుంది./*

*ఆకు పచ్చని వేటకు/ అర్థం తెలిసొచ్చే సమయానికి/ మనల్ని మనం కోల్పోవడం/ నిజమవుతుంది.*

♦♦♦

జీవితంలోని బీభత్సాన్ని ఇంతకంటే ఏం చెప్పాలి ? ఎలా చెప్పాలి? కఠినమైన విషయాలు వాస్తవికతతో మాట్లాడేటప్పుడు భాష కఠినంగానే ఉంటుంది. ప్రశ్నిస్తున్నట్లే ఉంటుంది. అమానవీయతను నిలదీస్తున్నట్లే ఉంటుంది.

సమానత్వం కోసం స్వేచ్ఛ కోసం గొంతు విప్పిన మరికొన్ని గిరిజన కవితలు ...

♦♦♦

ప్రతి గిరిజనుడు లేదా గిరిజన స్నేహితుడు , శ్రేయోభిలాషి కోరుకునేది ఒకటే. గిరిజనులందరికీ విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలు కల్పించడం. వారి హక్కులను కాపాడటం. సామాజిక పోరాటంలో కావచ్చు, సాహిత్యంలో కావచ్చు, గిరిజనుల కోసం నినదించే గొంతు ఒక్కటే.. చెబుతుంది. ' సమాజంలో అందరిలాగే గిరిజనులు కూడా గౌరవనీయులే ' అని. అయితే సమాజంలో అట్టడుగున ఉండిపోయిన గిరిజనులకు అందరితో సమానమైన అవకాశాలు కల్పించడం ఎలా ఉన్నా– వారిని ఇంకా కొన్ని చోట్ల కనీసం మనుషులుగా కూడా గుర్తించని దారుణమైన పరిస్థితి నెలకొని ఉండటం విషాదకరం.

రాజ్యాంగబద్ధమైన పదవుల్లో, అధికారంలో లేదా ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నప్పటికీ గిరిజనులు తక్కువగానే చూడబడుతున్నారన్నది అందరూ ఒప్పు కోవలసిన వాస్తవం. అయితే ఈ అమానవీయత గురించి, అసమానతల గురించి తెలుగులో కొంతమేరా సాహిత్యం వచ్చినప్పటికీ, ఇంకా ఎంతో సాహిత్యం రావాల్సిన అవసరం ఉన్నది. ఎన్నో జీవిత వాస్తవాలు, వాస్తవ జీవితాలు, వాస్తవాలు గిరిజన సాహిత్యంలోకి రావాల్సిన అవసరాన్ని సాహితీ విమర్శకులు గుర్తు చేస్తూనే ఉన్నారు కానీ, ఇంకా అన్ని ప్రాంతాల నుండి స్పందన ఆశించిన స్థాయిలో రావడం లేదు.

♦♦♦

జయధీర్ తిరుమలరావు గారు సమన్వయం చేసిన "గిరిజన కవిత " లో ( 2012 మే 7, ఆంధ్రభూమి దిన పత్రిక సాహిత్యం పేజి ) మరి కొన్ని కవితలను ఇప్పుడు చూద్దాం.

" అల్లూరి నుండి అబుజ్ మడ్ దాకా " అనే కవితలో సూర్యవంశి ఇలా అంటున్నారు..

*ఏదైనా కావచ్చు/ఏకత్వంలో భిన్నత్వం/ భిన్నత్వంలో ఏకత్వం/ ఏదైనా కావచ్చు/ప్రజాస్వామ్య పరిమళం /దీర్ఘకాలిక గుబాళింపు/ ఏదైనా కావచ్చు/ అడవిపై సార్వ భౌమ్యాధికారంమాత్రం/ ఆదివాసులదే!*

♦♦♦

"నమ్మకాల రెక్కల కోసమే గిరిజనుల తపన. వాళ్ల పాటలు, వాళ్ళ ఆటలు, వాళ్ళ కాయగసురులు, వాళ్ల చెట్టు పుట్టల కోసమే వాళ్ళ ఆశ, వాళ్ళ పోరాటం." అంటున్నారు యింద్రవెల్లి రమేష్ "దండం సారూ " అనే కవితలో...

*మా పాటలు మాక్కావాలి/మా ఆటలు మాక్కావాలి /మా కాయగసురులు మాక్కావాలి /మా చెట్టుపుట్టలు మాక్కావాలి/ ..మా దారులు మాక్కావాలి/మా దూరాలు మాక్కావాలి/ మా ఋతువులు మాక్కావాలి/ మా నమ్మకాల రెక్కలు మాక్కావాలి/ ..మా కలలు మాక్కావాలి/ మా బతుకులపై భరోసా మాక్కావాలి /సారులూ,*

*ఒక్కొక్కరికీ దండం/ ఇద్దరికీ దండం.*

♦♦♦

మనుషులకు ముఖ్యంగా కావాల్సింది ప్రేమ, స్వేచ్ఛ,

సమానతలే . "స్వేచ్ఛ లేని బ్రతుకు ఒక మరణం– అంటూ గిరిజనులు మరణించినా మళ్లీ మట్టిలో చిగురిస్తారని" అంటున్నారు సిరికి స్వామినాయుడు తన "పోరు మొక్కలు" కవితలో.

*గుండెలు, వాళ్ల దేహాల్లో ఉండవు/ కొండలై యీ నేలమీద కొట్లాడుతుంటాయి./శ్వాస నాళాలు, వాళ్ళ శరీరాల్లో ఉండవు/ చెట్లూ చేమై యీ అడవంతా విస్తరిస్తాయి/ బతుకంటే... ఆకాశాన పక్షి స్వేచ్ఛగా ఎగరటమే కదా / 'స్వేచ్ఛ లేని బ్రతుకు ఒక మరణం/ యిపుడు, స్వేచ్ఛకోసం వాళ్లెంతకైనా తెగిస్తారు/ శిలకోల నెక్కుపెట్టి నిర్బంధాల్ని ఛేధిస్తారు./ మరణించారా... మళ్లీ మట్టిలో పోరు మొక్కలై చిగురిస్తారు.*

( శిలకోల– బాణం మొన )

◆◆◆

ఎలనాగ రాసిన " నిగ్గులీనే నెలవులు" కవితలో నిరలంకారమైన గిరిజన జీవిత సౌందర్యం కళ్ళెదుట కనబడుతుంది.

*కొండ వాలులో కొలువుతీరిన/ ఇళ్ల గుంపుల్ని చూస్తుంటే/ అవి ఇంపైన కిరీటం మీద/ సొంపులీనే మణుల్లాగుంటాయి/ అడవి తల్లి వొడిలో/ అలుపు తీర్చుకునే/ స్థావరాల్ని చూస్తుంటే/ అవి పుడమి దేహాన్ని విసర్గ కాంతితో/తడిపే సహజాతాల/ గనుల్లా గుంటాయి.... చెట్టుతో చెలిమిచేస్తూ, గుట్టను గుడిలో నిలుపుకునే/ గూడెం మనుషుల బతుకులు/ ఓడిస్తాయి/ నగరవాసుల జీవన శైలుల్ని .*

*వెల్లివిరిసే జీవ చైతన్యానికి /వేదికలు యీ గిరిజనుల సంతలు/ ఎగుడు దిగుడుల శుష్క రోదసిలో/ కనువిందు కూర్చే పాలపుంతలు.*

◆◆◆

నాగరికత మనిషిని మనిషి కాకుండా చేస్తున్న వైనాన్ని చెబుతూ, స్వార్ధ పరుడైన మనిషిని శిక్షించమని ప్రకృతిని కోరుతున్న గంటేడ గౌరునాయుడు గారి కవిత " మన్నించు తల్లీ ".

*బతుకు పోరులో బండల కండలు కరిగిన కొండా/ నీ గుండె మీద ప్రతి సాయంత్రం ఓ సూర్యుడు/ నెత్తురోడుతున్నా పరామర్శించని/ పాషాణ హృదయం నాది/ ఆకుపచ్చ కోక హరించబడుతుంటే/ కళ్ళలో చీకటి నింపుకున్న అంధత్వం నాది/ అక్షరాన్ని "ఆస్థి"గా మార్చుకున్నానే గాని / ఆయుధంగా మలచుకోనందుకు/ కొండా.. కోనా.. వాగూ... వంకా/ తుప్పాడొంకా... పుట్టా..పిట్టల్లారా/ శిక్షించండి నన్ను/ నన్నెత్తుకుపోయిన ప్రపంచం నుండి/ విముక్తం చేయండి నన్ను.*

◆◆◆

" రెండు రాజ్యాలు... ఒక త్యాగం "కవితలో డా.దామెర రాములు గిరిజన సంస్కృతిని తెలియచేస్తున్నారు. తినటానికి సరిగ్గా తిండి గింజలు లేకపోయినప్పటికీ, తమ సంస్కృతిని కాపాడుకోవడం, ఆచారాలను పాటించడం గిరిజనుల జీవ లక్షణం.

*"తనకున్నవి రెండెద్దులు– సమ్మయ్యకు /ఎడ్లబండి, పానికె, నాగలి, పూరిల్లూ/ తనవీ ఇల్లాలువీ నాలుగు చేతులు/ నాలుగు జీవాలకు బుక్కెడు బువ్వ కోసం /ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకోవడం...*

*కానీ /ఎడ్లకొమ్ములకు రంగులు, మెడ గంటలు/ కదలుతోన్న తన పూరింటితో/ రెండేళ్లకొకమారు/ మేడారం తొవ్వపడుతడు/ సమ్మయ్య/ తన జీవితం నుంచి అవిభాజ్యం/ తాత ముత్తాతల కాన్నుంచి కొలిచిన తల్లులు/ కొంగు బంగారం, యిలవేల్పులు./ తన ఊహాకందిన కాన్నుంచి ప్రాణసమానమైన మేడారంపోని దాఖలాలేదు.*

◆◆◆

ఆధునికతకు దూరంగా ఉంటున్నప్పటికీ మానవసంబంధాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తారు గిరిజనులు. తాము నమ్మిన మనిషి కోసం ప్రాణమైనా సునాయాసంగా ఇచ్చేస్తారు. ఒక్క ప్రాంతం లోనే కాదు, దేశవ్యాప్తంగా అనేక గిరిజన జాతుల మధ్య వున్న కొన్ని పోలికలు, లక్షణాలు గిరిజన నాగరికతను తెలియచేస్తాయి. "అదే నేల"కవితా సంకలనం లోని కవితలు అందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి.

ముకుంద రామారావు గారు ఏరి కూర్చిన "అదే నేల"కవితా సంకలనం లోని భారతీయ కవితల్లో అనేక గిరిజన కవితలు అలజడిని కలిగిస్తాయి. ఆ జీవాక్షరాల ఆవేదన అంత త్వరగా మరిచిపోయేది కాదు. అరుదైన గిరిజన భాషలు, అదృశ్యమైపోయిన గిరిజన భాషలు చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే సత్యాల్ని అక్షరీకరించాయి.

గిరిజన భాషల్లో అదృశ్యమైనవి ఎన్నో. చరిత్రకు మిగలకుండా పోయిన గిరిజన పాటలు, రాతలు, రాత ప్రతులు ఎన్నో. ఒక భాష మరణించడం అంటే ఒక సంస్కృతి మరణించడం, ఒక భాష మరణించడం అంటే ఒక చరిత్ర

మరణించడం. ఇప్పటికే అరుదైపోయిన, అదృశ్యమైపోయిన గిరిజన భాషల్లోని పుస్తకాలను సేకరించి రేపటి తరాల కోసం భద్రపరచవలసి ఉన్నది. డిజిటలైజేషన్ ద్వారా మనం ముందు తరాలకు అందించవలసిన విలువైన కానుకల్లో గిరిజన సాహిత్యం కూడా ముఖ్యమైనదే. గిరిజన సాహిత్యాన్ని కాపాడుకోవటానికి ప్రోత్సహించడానికి ముందుండే సాహితీవేత్తలు అందరూ ఈ విషయమై ఒక వేదిక మీదుగా ఆలోచించి, అభిప్రాయాలను పంచుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నది.

కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో, రాచపాలెం చంద్ర శేఖర రెడ్డి గారి సూచన మేరకు పలమనేరు రచయితల సంఘం- వారు చిత్తూరు జిల్లా పలమనేరులో " తెలుగులో గిరిజన నవలలు " పేరిట టి.యస్.ఏ కృష్ణమూర్తి గారు ముఖ్యఅతిథిగా- ఒకరోజు గిరిజన నవలా సదస్సు (15.12.2019 )నిర్వహించారు.

1.అరుణ గారు రాసిన ఎల్లి నవల పైఆచార్య శ్రీమతి రాజేశ్వరి గారు

2.డాక్టర్. వి .ఆర్ . రాసాని గారు రాసిన చీకటి ముడులు నవలపై ఆచార్య మేడిపల్లి రవి కుమార్ గారు,

3.వసంతరావు దేశ్ పాండే గారి అడవి నవల పై ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ గారు,

4.అట్టాడ అప్పలనాయుడు గారు రాసిన పునరావాసం నవల పై డాక్టర్ మేడికుర్తి ఓబులేష్ గారు

5.ఏకుల వెంకటేశ్వర్లు గారు రాసిన ఎన్నెల నవ్వు నవలపై డాక్టర్ వై సుభాషిణి గారి ప్రసంగాలను ఏర్పాటు చేసారు.

ఇలాంటి సదస్సులు ఇంకా జరగాలి. కథ, కవిత్వం గురించి కూడా సదస్సులను నిర్వహించాలి. అన్ని విశ్వవిద్యాలయాల్లో గిరిజన సాహిత్య సదస్సులు, నిర్వహించాలి.

కేంద్ర సాహిత్య అకాడమి వారు ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, 2018 డిసెంబర్ 22,23 తేదిల్లో విజయవాడలో ఏర్పాటుచేసిన " తెలుగు ప్రాంతాల గిరిజన సాహిత్యాలపై రెండురోజుల సదస్సు " లో " గిరిజన గాథాసాహిత్యం , గిరిజన పాటలు, గిరిజన స్రీల అభివ్యక్తి, సమకాలీన రచనలు (కథ, నవల, కవిత్వం) , రాజ గోండుల సంప్రదాయ మౌఖిక సాహిత్యం " పేరిట ప్రత్యేకంగా గిరిజన సదస్సును నిర్వహించడం గమనార్హం.

గ్రీన్ హంట్ వ్యతిరేఖ కవితా సంకలనం " కవితా ఝుంకార్ " ( జనవరి, 2013–విరసం )లోని 81 కవితల్లో అన్నిప్రాంతాల కవులు తమ కలాలతో అడవితల్లి బిడ్డలకు మద్దతుగా నిలబడ్డారు. అందులో చల్లపల్లి స్వరూపా రాణి గారు అన్నట్లు " రాత్రంతా అడవి మేల్కొనే వుంది./ఒక ఆకు పచ్చని కల కోసం ".

వెర్రియర్ ఎల్విన్ ( Varrier Elwin ) క్రిష్టఫర్ వాక్ ఫ్యూరర్ హైమండార్ఫ్ (Christepher Vak Furer Halmandorf), వెన్నెలకంటి రాఘవయ్య గార్లు గిరిజనుల కోసం చేసిన కృషి గురించి, కే.జీ. కన్నాభిరాన్, కే. బాలగోపాల్ , వకుళాభరణం లలిత, విద్యాసాగర్, వాడ్రేవు చినవీర భద్రుడు మొదలైన వాళ్ళు గిరిజన సమాజాలకు చేసిన మేలు గురించి తలచుకోవడం, వారి కృషిని కొనసాగించడం గిరిజన రచయితల, సామాజిక కార్యకర్తల కనీస బాధ్యత.

ఆదివాసీ సాహిత్యం కోసం ఆదివాసీ రచయితల సంఘం ( ఆరసం), గుమ్మడి లక్ష్మి నారాయణ, మల్లిపురం జగదీష్ చేస్తున్న కృషి తక్కువేమీ కాదు. అయినా గిరిజన కవుల్ని రచయితల్ని, గిరిజన జీవితానికి సంబంధించిన రచనలను ప్రోత్సహించడానికి సాహిత్య సంస్థలు, విశ్వవిద్యాలయాలు, సాహిత్య పత్రికలతో పాటు ప్రభుత్వం కూడా కొత్త ఆలోచనలు చేయాల్సి ఉంది. విలక్షణమైన సంస్కృతికి నిలయమైన గిరిజన జీవితాల్ని, ఆ వెలుగు నీడల్ని, పోరాటాల్ని, దుఃఖాన్ని సాహిత్యంలోకి తీసుకు రావటానికి ఒక వేదిక అవసరమవుతున్నది. మల్లిపురం జగదీష్ అన్నట్లు సవర, కోయ, ఎరుకల కులాల నుండి వచ్చిన కథా రచయితలతో బాటూ, ఇతరత్రా తెగలనుండి గిరిజన రచయితలను గుర్తించాల్సి వుంది. గిరిజన సాహిత్యం గురించి గతవారం కవి సంగమంలో చర్చించిన మీదట కొంతమంది కవులు వారి వివరాల్ని తెలియచేసారు. గిరిజనులు ఏ ప్రాంతాల్లో ఎవరెవరు రాస్తున్నారో చాలా వివరాలు ఇంకా సేకరించాల్సిన అవసరం ఎంతైనా వున్నది. రాం ప్రసాద్, రమేష్ కార్తీక్ నాయక్ ( బల్దేర్ బండి కవితా సంపుటి –నిజామాబాద్) లాంటి యువ గిరిజన కవులకు ప్రోత్సాహం అవసరం .

కథకు సంబంధించి డాక్టర్ వి.ఆర్.రాసాని గారు 2011 జూన్ 16,17 తేదిల్లో తిరుపతి లో నిర్వహించిన

" తెలుగు కథ– దళిత , మైనారిటీ , గిరిజన, బహుజన

కవిత

# దిగులు మబ్బు

- తిరునగరి శరత్ చంద్ర
6309873682

*దిగులు మబ్బొకటి
బతుకు ఆకాశంలో పరుచుకుంది
చీకటి తన జుట్టును విరబోసి
నల్లదనాన్ని అంతటా అద్దుతోంది
నా స్వేచ్ఛను ఆవిరి చేసి
గుబులుపక్షి నా ఒంట్లో స్వేచ్ఛగా విహరిస్తోంది
ఇంట్లో కాదు కాని
నా ఒంట్లో
ఆకలి పొయ్యిలా మండుతోంది
చిటపట అంటూ కడుపులో కాలుతోంది
కాలం
నాపై కన్నెర్ర జేసి
తాను మాత్రం
కంటిరెప్పలు మూసి నిద్రలోకి జారుకుంది.
ఇప్పుడు లోకమంతా చీకటే
తెల్లారితే లోకానికి వెలుగొస్తుంది
నా బతుకు మాత్రం చీకట్లోనే తెల్లారిపోయేట్టుంది.
నాకైతే కంటికి కునుకు లేదు
ఒంటికి ఓపిక లేదు*



*కష్టాల కౌగిలింతలు తప్ప
ఆనందపు ఆనవాళ్ళు ఆవగింజంతైనా లేవు.
కులాసా కాసింత కాలక్షేపం
చేద్దామని
నన్నిడిచిపెట్టి వెళ్ళి ఎన్నేళ్ళయిందో?
నా గుండెను చిరునామాగా చేసుకుని
ఈ గుబులు గులాంగిరీ చేస్తుంది.
కష్టాలు, కన్నీళ్ళు, చీకట్లు, ఆకళ్ళు
సైన్యంగా మారి
పగటిపూట ఎండలాగా నాపై పగబట్టాయి.
నేను మాత్రం నిశ్శబ్దంగా ప్రవహిస్తూనే ఉన్నాను..
మరి –
ఈ దిగులుమబ్బు ఎప్పుడు దిగిపోతుందో?
గుబులుపక్షి రెక్క ఎప్పుడు తెగిపోతుందో?
స్వేచ్ఛాసంతోషం నా ఇంటిలో
ఎప్పుడు వెలుగుతుందో?*

◆

---

జీవితం ” జాతీయ సదస్సులో భాగంగా కొమరం భీం పేరిట ఏర్పరచిన వేదిక నుండి గిరిజన సాహిత్యానికి సంబంధించిన విలువైన ప్రసంగాలను వ్యాస సంకలనంలో ముద్రించడం గొప్ప ప్రయత్నం. గిరిజన కవిత్వానికి సంబంధించి కూడా ఇలాంటి ప్రయత్నం ఎక్కడోచోట జరగాల్సి వుంది.

విశాలాంధ్ర వారు డాక్టర్ యస్వీ. సత్యనారాయణ, డాక్టర్ పెన్నా శివరామకృష్ణ గార్ల సంపాదకత్వం లో ప్రచురించిన “దశాబ్ది కవిత 2001–2010 ” ( నవంబర్, 2014 రెండు వందల కవితలు ), సారంగ బుక్స్ వారు అఫ్సర్, వంశీ కృష్ణ గార్ల సంపాదకత్వంలో ప్రచురించిన “ అనేక ” పదేళ్ళ కవిత్వం 2000–2009 ( 182 కవితలు –డిసెంబర్, 2010), వచ్చి పదేళ్ళు దాటినాయి. ఇంకో దశాబ్ది సంకలనం రూపొందే కాలం ఇది. ఈ మధ్య కాలంలో అనేక వార్షిక కవితా సంకలనాలు, కవి సంగమం వారి కవితా సంకలనం , వంగాల సంపత్ గారి సంపాదకత్వంలో సాహితీ గోదావరి కవిత్వ ప్రత్యేక సంచిక (116 కవితలు – 2017), సాహితీ మిత్రులు విజయవాడ వారి కవితా! ప్రత్యేక సంచికలు, ఎన్నో ప్రాంతాలనుండి ఇంకా ఎన్నెన్నో కవితా సంకలనాలు వచ్చాయి. అంతర్జాల పత్రికలూ వైభవంగా వెలువడుతున్నాయి. తెలుగునుండి పొరుగులోకి, పొరుగు నుండి తెలుగులోకి కవిత్వం అనువాదాలు జరుగుతున్నాయి. గత దశాబ్దితో పోలిస్తే ఈ దశాబ్దిలో గిరిజన చైతన్యం పెరిగింది, గిరిజన సమస్యలపై స్పందించే గిరిజనేతరులు పెరిగారు. కథా సంకలనాలు, కవితా సంపుటాలు, ప్రత్యేక రచనలు, పుస్తకాలు అనేకం వచ్చాయి.

ప్రత్యేకంగా గిరిజన కవితా సంకలనం తీసుకు రావాల్సిన తరుణం ఇది. ఇప్పటికే చాల ఆలస్యం అయింది. అయినా ఇక్కడ ఇప్పుడ నిలబడి ఎక్కడ నుండి, ఎంత బలంగా, సున్నితంగా గిరిజన కవిత్వం వచ్చిందో, ఆ కవిత్వం ఏ వెలుతురు పువ్వులు తెచ్చిందో చూడటం ఒక చారిత్రక సందర్భం. అప్పుడే రేపటి రోజున మరిన్ని అడవి పువ్వులు అక్కడక్కడా విరివిగా పూస్తాయి. అలాంటి మేలిరకం అడవి పువ్వులు గొప్ప వెలుగుతో విరివిగా పూయాలని ఒక కోరిక, ఒక ఆశ.!

***(కవితావరణం శీర్షిక : కవి సంగమం ఫేస్‌బుక్ వాల్ నుండి)***

◆

విశ్లేషణ



# అద్దేపల్లి కవిత్వంలో ప్రపంచీకరణ ప్రస్తావన

- ఎస్.ఆర్. పృథ్వీ
9492704750

1960 దశకం నుండి నిరంతర చైతన్యశీలిగా ప్రజల పక్షాన నిలబడి 2015 సంవత్సరం చివరి వరకు అక్షర గొంతుక వినిపించిన ప్రజాకవి డా॥అద్దేపల్లి రామమోహనరావు. ప్రజా పక్షం వహించడమంటే, ప్రజల సమస్యలు అవగాహన చేసుకొంటూ, వాటి చిక్కుముడులను ప్రజల ముందు విప్పి చెప్పటం. ఆ బాధ్యతను జీవితానికి ముడివేసుకున్న కవి అద్దేపల్లి.

అనేకానేక సామాజికాంశాల మీద దృష్టి సారించిన అద్దేపల్లి, మినీ కవితను ప్రోత్సహించటం, యువతను కవులుగా మలచటంతో పాటు స్త్రీవాదం, దళితవాదం వంటి వాటిని సమర్థించటం, సంఘ వ్యతిరేకతల మీద అక్షర పోరు సలపటం వంటి వెలుగురేఖలెన్నో వారి కలంలో కనిపిస్తాయి. వీటితో పాటు అద్దేపల్లి 1990వ దశకంలోనే ప్రపంచీకరణ నేపథ్యాన్ని పసికట్టి, భవిష్యత్తులో దాని పరిణామాల గురించి ఊహించారు.

అసలు ప్రపంచీకరణ అంటే ఏమిటి అని ప్రశ్నించుకున్నప్పుడు, ఒక పేద దేశంగాని, అభివృద్ధి చెందుతున్న దేశంగాని సామ్రాజ్యవాదుల కబంధ హస్తాలలో చిక్కుకుపోవటం. ఎక్కడో ఉండి, వాడు ఇక్కడి పాలనను అజమాయిషీ చేస్తాడు. అదేమిటీ అనుకోవచ్చు. మనిషికైనా, దేశానికైనా అభివృద్ధి పథంలో నడవాలంటే, ఆర్థిక పరిస్థితి బాగుండాలి. అది పెట్టుబడిదారుడి చేతిలో ఉంటుంది. అందువలన, పెట్టుబడిదారుడు యావత్రపంచాన్ని తన కనుసన్నలలో నిలుపుకుని వ్యవహరిస్తాడు.

ప్రజలు అనుకుంటూ ఉంటారు. ఈ ప్రభుత్వం మంచిది; ఈ ప్రభుత్వం చెడ్డది అని. అదంతా మనకున్న అపోహ; వట్టి భ్రమ. ఈ నాయకులు, పెట్టుబడిదారీ వర్గం చేతిలో కీలుబొమ్మలు. ఇది కనిపించని దృశ్యం. ఈ ప్రపంచీకరణలోంచి జనించే అనేక రూపాలను అద్దేపల్లి వారు ముందుగానే గమనించారు. చూచిన ప్రతి అంశం మీద తన అక్షర శరాన్ని ఎక్కుపెట్టి వదిలారు. ప్రజలను హెచ్చరించారు.

సంస్కృతి పతనం కూడా ప్రపంచీకరణలో ఒక భాగమే అంటారు అద్దేపల్లి. సంస్కృతిని కోల్పోతే జాతి తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లే అంటారు. ఈ దేశం గ్లోబలైజేషన్‌లో ఎలా యిరుక్కు పోతున్నదో అద్దేపల్లి అక్షరాల్లోంచి చూద్దాం.

*"సముద్రం ఇప్పుడు/దేశ సంస్కృతుల అక్రమ రవాణాల వాహికగా మారిన జలయంత్రం"* అంటారు.

సముద్రమొక జలయంత్రంగా మారిపోయింది. దేశ సంస్కృతుల్ని అక్రమ రవాణా చేస్తా ఉంది అంటారు. మానవ జాతి తలమీద అంతర్జాతీయ పాదముద్రల్ని పసికట్టే పనిలో ఉన్నారు కవి.

*"డాలర్ బాట్‌తో బాదిన/నిర్ నిషిద్ధ చిత్రవిచిత్రాల్ని/ చిన్న పెద్ద తెరల మీద/ వికెట్లన్నీ పడగొడుతున్నై/ వ్యాపారానికి పూర్వం ధర్మ వస్త్రాలైనా ఉండేవి/ఇప్పుడు బట్టలే లేవు"* అంటారు.

డాలర్ ఆధిపత్యంలోకి వ్యాపారం అడుగు పెట్టాక స్వేచ్ఛ

పెరిగి, వంటి మీద దుస్తులు ఉన్నాయో లేవో గమనించే స్థితిని దాటిపోవడం దురదృష్టకరం.

విదేశీ సంస్కృతీ ఛాయలు ఈ నేలమీద పడి ఇక్కడి సంస్కృతి కళ్ళను పొడిచేస్తా ఉంది. అందుకే కవి ఆవేదన చెందుతారు.

*"పెప్సీ షవర్లతో జలకాలాడి/ పిస్టల్ ప్రింటుల చీరల కట్టుకుని/డాలర్ బిళ్ళ బొట్టు పెట్టుకుని/పాప్ నడకల ఒయ్యారాలతో/ మాతృత్వాన్ని జారవిడుస్తున్న దేశానికి/ రేపు పుట్టబోయే పిల్లలందరూ/ చనుబాల తీపి తెలియని/ పిచ్చి చూపుల అమాయకపు శిశువులే!"* అంటారు కవి. పెట్టుబడిదారీ విష సంస్కృతి అలల్లో ఈ దేశం అల్లల్లాడతా ఉంది.

డాలర్ సంస్కృతి బహు చెడ్డది. డాలర్ అంటే ఒక క్రేజీ. ప్రపంచాన్ని తన గుప్పిట్లోకి లాక్కుని, జారిపోకుండా బిగిస్తున్న ఒక మాయ. అటువంటి డాలర్ చేస్తున్న విన్యాసాల గురించి కవి యిలా అంటారు.

*'నేనెప్పుడు/ పేద దేశాన్ని గుడ్డి నమ్మకంతో/ ముంచి నంజుకునే డాలర్ హస్తాన్ని/ నేను, నేను కాని దాన్నిగా మార్చబడి/ స్వార్థ సుడిగుండాల/ నిలువెత్తు నీలి జలాల్లో పడుతున్న నీడని/ దోపిడీ వ్యాపారపు దుస్తుల్లో/ దేహమంతా/ వంకర్లు పోతున్న అభినయాన్ని/ భారతదేశం అమ్మగా పూజించే ప్రకృతిని/కీలుబొమ్మగా చేసి/ అమ్మకానికి పెట్టగలను"*

ఈ కాలంలో అడ్వర్‌టైజ్‌మెంటుకో ప్రత్యేక స్థానముంది. దేనినైనా యిట్టే ఆకర్షించగల రంగుల వల. దీనికి స్త్రీనే పెట్టుబడి. అటువంటి ప్రకటనల గురించి కవి యిలా అంటారు–

*"గ్లోబల్ మార్కెట్ మేధావులందరూ*
*బుర్రలోని గుంజునంతటినీ*
*అదే పనిగా కంప్యూటర్లలో రుబ్బి*
*తయారుచేసిన అద్భుత అపూర్వ*
*కాక్ టెయిల్ బొమ్మ – అడ్వర్టయిజ్‌మెంట్!*

ప్రపంచీకరణ నేపథ్యం స్త్రీ సౌందర్యాన్ని మార్కెట్‌గా మార్చేసింది. ఆ మార్కెట్‌లో ఏమి జరుగుతా వుందో కవి ఊహించి దాని గురించి యిలా అంటారు. –

*'తిమ్మిరెక్కిన ప్రాణశక్తి మీద*
*సౌందర్యం మూర్ఛపోతుంది.*
*మరో దేశపు మట్టిలోకి*
*నాలోని మరకల ప్రపంచాలు*
*అక్కడి చేతుల మీదుగా గొడుగు విప్పుకుంటే*
*గ్లోబల్ మార్కెట్ నడి వీధిలో*
*స్త్రీత్వం తల వంచుకు నిలబడుతుంది*
*సౌందర్య హంతకి యైన వ్యాపారం*
*ఆమె తలపైన తన జండా క్రర పాతిపెడుతుంది"*

ప్రకటనలలో స్త్రీ అందాల్ని, అర్థ నగ్నత్వాన్ని బాహాటంగా పైకి లాగుతా ఉంది. ఈ సంస్కృతి ఎక్కడి నుండి దిగుమతి కాబడింది.

*"యాడ్స్ సాంకేతిక శాస్త్రీయ మిషతో*
*ప్రజల్ని మోసుకొస్తున్నై"* అంటారు.

*"ఆవిడ పూజ చేసుకుని కాన్వెంటు కెళ్ళింది; అక్కడ పిల్లలకి పాటలు నేర్పుతూ ఒళ్ళూపాలి; ఏమిటీ పరాయీకరణ?"* అంటారు.

ప్రపంచీకరణకు వ్యాపారం ప్రశస్తమైన మార్గం. దానినే పెట్టుబడిదారుడు ఎంచుకున్నాడు. ఒక సందర్భంలో కవి –

*"వాడు మన పోరు పడలేక పోతూ పోతూ*
*దేశం మెదడులో వ్యాపార విత్తనం నాటిపోయాడు.*
*ఏభైఏళ్ళుగా అక్కణ్ణుంచి*
*ఎరువులు పంపుతూనే ఉన్నాడు*
*వాడి సముద్రాల నీళ్ళతో*
*మన పాదు తడుపుతూనే ఉన్నాడు"* అంటారు.

అంతే కాదు;

*"నా తోటలో నా చేతుల్తో పెంచిన మొక్కల వేళ్ళకి*
*సముద్రాల అవతల నించి తవ్విన వ్యాపారపు*
*పైపులైన్ల ద్వారా నీళ్ళందుతుంటే*
*నా జీవజలాలు పైపొరల్లోనే ఇంకిపోతుంటే*
*ఎలా కాలం భుజం తట్టేది?"* అని ప్రశ్నిస్తారు.

ప్రపంచీకరణ పేరు మీద మార్కెట్‌లోకి స్వేచ్ఛ ప్రవేశించింది. స్వేచ్ఛకి హద్దులుండవు. దోపిడీని అందంగా మలుస్తుంది. వినియోగదారుడిలో గర్వాన్ని పలికిస్తుంది. కవి గమనించిన ఒక అంశాన్నిలా చెబుతారు.

*"ఇక మనుషుల్ని టంకశాలలోకి తోసి/ యంత్రాలలో తలలు దూర్చి/ శరీరాలు డాలర్లుగా బయటకి లాగుతారు./ స్త్రీ పురుషుల దుకాణాలు/ శరీరాల డాలర్లు ఇచ్చి పుచ్చుకుంటె/ దేశంలో గాలి నిండా శవాలు డిస్కో డాన్సులు చేస్తై/ కంప్యూటర్ సింహాసనాలు/ శ్రమకి దహనసంస్కారాలు జరుపుతై/ దేశంలో నీటి నిండా శవాలు శవాసనాలు వేస్తై/*

## కవిత

# మనిషితనాన్ని తట్టిలేపుతూ...

- మామిడిశెట్టి శ్రీనివాసరావు
9573347744

కరోనా కవిత

అదేంటి! ప్రపంచాన్ని శాసించే అగ్రరాజ్యం
అలా భయంతో గజగజ వణికిపోతుంది
ఇదేంటి! జీవరాశులలో కెల్లా తెలివైన వాడ్ని అని
తెగ విర్రవీగిన మానవుడు కంటికి కనిపించని
ఒక సూక్ష్మక్రిమి కాళ్ళముందు మోకరిల్లాడు!
బహుశా... ప్రకృతి కన్నెర్ర జేస్తే అంతేనేమో!
పంచభూతాలు పగబడితే అంతమేనేమో!
ధనిక – పేద, రాజు – బంటు, మేడ – గుడిసె లాంటి
అడ్డుగోడలు అరక్షణంలో కూలిపోతాయి
ప్రాణాల్ని అరచేతుల్లో పెట్టుకుని
ఏ పంచనో బ్రతికేస్తే చాలనుకునే
ఒక కొత్త జీవనసూత్రం కాలం తెరమీద
ఆవిష్కృతమవుతుంది!
స్వార్థం అహంకారం విచ్చలవిడితనం విశృంఖలత్వం
తరాలు మారినా తలల్ని వీడని ఈ తలతిక్క సంస్కృతికి
పాడె కడుతున్న శబ్దాలు నిశ్శబ్ద వీధుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి
ఇన్నాళ్ళకు ... నాలుగ్గోడల మధ్య నీ హృదయాన్ని చాపలా
పరచుకుని విప్పి చూసుకునే ఒక మంచి
అవకాశమొచ్చింది!
వంటగదిలో కరిగిపోతున్న ఇంటి ఇల్లాలి సొగసు
కంటికొనలు దర్శించని చంటి పిల్లల ఆటపాటల వయసు
రాతిగోడలు ఎన్నడూ వినని అనురాగాల చప్పట్లు
గడప దరి చేరని ఇరుగు పొరుగు మంచి చెడుల ముచ్చట్లు
నీ ఆలోచనల తీరానికి దూరంగా ఉన్న
కొన్ని బ్రతుకు అలల్ని దర్శించే
ఒక సువర్ణావకాశం ఇప్పుడు తలుపు తట్టింది!
ఆకురాలి కొత్త చిగురుకు స్థానమిస్తున్నట్లే....
నేలరాలిన ఇన్ని ప్రాణాల్ని చూసాక
కొత్తగా ఎత్తుకోవలసిన బ్రతుకు రాగమేదో
నీ మదిలో పురుడు పోసుకునే ఉంటుంది
మరణించిన నీ మనిషితనాన్ని తట్టిలేపుతూ...! ◆

***హింసా కిరీట ధారి దేశాలు/ భారతదేశాన్ని పడుకోబెట్టి వృషణశోషణ చేస్తై"*** పెట్టుబడి దేశాల ఆధిపత్యంలోకి వెళ్ళిపోయిన దేశం యొక్క దుస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పే ప్రయత్నం చేసారు కవి.

అందాల పోటీలకు స్త్రీని ఆకర్షింప చేస్తుందీ మారిన సంస్కృతి. ***"బొమ్మల కొలువులన్నీ/ అందాల పోటీలుగా/ వికృత రూపాంతరీకరణ పొందుతున్నై"*** అంటారు.

దేశీయమైన సంస్కృతి క్షీణించి, విదేశీ సంస్కృతికి మనిషిని అలవాటు చేస్తుంది ప్రపంచీకరణ. కనపడని ఆకర్షణ యంత్రం యిది. మరో చోట కవి యిలా అంటారు –

***'టీ.వీల గుండా లేత లేత అవయవాల్ని/ ఆచ్ఛాదనలు తొలగించి పోగులు పొయ్యడం శాంతికోసమే/ మొగుళ్ళ కౌగిళ్ళ నుండి/ వ్యాపార ప్రేమికుల కౌగిళ్ళలోకి తోసేసి/ వికృత లైంగికతతో కుటుంబాన్ని విదేశీయం చెయ్యడం శాంతికోసమే"*** అంటారు. ఇవన్నీ ప్రపంచీకరణకి శాంతి కలిగిస్తై.

***"వాడు చెట్టు కింద నించి/ నేలను లాగేస్తున్నాడు/ వేళ్ళు కోసెయ్యడానికి / కత్తిని ఝుళిపిస్తున్నాడు"*** అంటారు.

నేలనే లాగేస్తే, చెట్టు ఉండదు. పంటలూ పండవు. ఈ దేశం యొక్క పచ్చదనాన్ని పిండి, పిప్పిచేసి, పచ్చదనంలోంచి పిండిన ధనాన్ని వాడు జేబులో వేసుకుంటాడు. చివరిగా

***"నీ దేహంతోనే నీ దేహానికి/ మంట పెడుతున్న మార్కెట్ మధ్య/ నీ ప్రతిఘటన స్వరం/ తారాస్థాయికి చేరలేదు"*** అంటారు.


నిన్ను వాడుకుంటూ, నీ నుండి వాడు డాలర్లు పోగేసుకుంటున్నాడు. వాడిని ప్రతిఘటించడం ప్రజలకి గాని, ప్రభుత్వానికి గాని చేత కావడం లేదు.

ఈ విధంగా ప్రపంచీకరణ ప్రభావంతో కనిపించకుండా దేశానికి, ప్రజలకి జరిగే కీడుని మూడు దశాబ్దాల క్రిందటే గుర్తించటం; దాని గురించి హెచ్చరికగా కవితాక్షర కాంతుల్ని సమాజం మీద చల్లటం అద్దేపల్లి చేసిన గొప్ప పని.

ప్రపంచీకరణ వల్ల కలిగే దుష్పరిణామాలు లోతుగా ఆలోచించిన వారికి మాత్రమే కనిపిస్తాయి. అందరికీ అందవవి. వాటిని అందుకోవడమంటే గొప్ప విషయం. అందుకుని ఊరుకోకుండా ఈ సమాజానికి చెప్పే ప్రయత్నం డా॥ అద్దేపల్లి రామమోహనరావు గారు చెయ్యటం జరిగింది. సమాజ శ్రేయమే అద్దేపల్లి జీవిత లక్ష్యం. లక్ష్య సాధనలో ఎన్నడూ వెనుకడుగు వేయని అక్షర ధీరుడాయన.

**(సెప్టెంబర్ 6 అద్దేపల్లి జయంతి)** ◆

## నచ్చిన రచన




డాక్టర్ దుట్టా శమంతకమణి



# సుఖము సురక్షితం .. మీ ప్రయాణం కథలు

- ఎస్ వి ఆర్ కృష్ణా రావు
9491037422

కొన్ని దశాబ్దాలు వెనుక ప్రయాణంలో జరుగుతున్న ఆలస్యాన్ని చూసి "నీవు ఎక్కాల్సిన రైలు ఓ జీవితకాలం లేటు" అని ప్రముఖ సాహితీవేత్త ఆరుద్ర రైల్వేలపై వేసిన వ్యంగ్యాస్త్రం. కానీ నేడు....నేటి ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతిక రంగాలు పురోగమించాక, డిజిటల్ యుగంలో మన జీవన వేగం పెరిగిన తర్వాత రైల్వే వ్యవస్థలో వచ్చిన మార్పులు, సౌకర్యాలు, రాయితీలు, ప్రయాణికులకు ముందస్తు సూచనలు, జాగ్రత్తలతో మనల్ని మన గమ్యాలకు సురక్షితంగా చేరుస్తూ మనజీవితంలో రైలు ప్రయాణం అంతర్భాగమై పోయింది.

రైల్వేలో ఉద్యోగైన రచయిత్రి డాక్టర్ దుట్టా శమంతకమణి "రైలుబండి కథలు అనే సంకలనం" ముప్పై కథలతో తీసుకువచ్చారు. ఈ ముప్పది కథలు మనల్ని పట్టు సడలకుండా చదివిస్తాయి. కథల్లో మమేకం చెందుతాం. మనసుల్ని స్పృశించి, మంచి అనుభూతిని .కలిగిస్తాయి. ఇవి కల్పిత కథలు కావు, వాస్తవ పరిశీలన, ప్రత్యక్ష అనుభవం నుండి వెలువడిన వాస్తవ గాథలు. ఎదగడం అంటే మర్రి చెట్టులా కాదు రావి చెట్టులా జ్ఞానోదయం అంటారు రచయిత్రి ఓ కథ లో. ఈ సంకలనం చదివిన ప్రతీ ఒక్కరూ అటువంటి తృప్తి చెందుతారు.

ఈ రచయిత్రిలో గల సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత, ఉద్యోగ నిర్వహణలో అంకిత భావం "రైలు బండి కథలు" రాయించింది ఏమో అని అనిపిస్తుంది ఈ సంకలనం ఆసాంతం చదివిన తర్వాత. ఇందులో రైల్వే వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలు, రైలు గుండె చప్పుడు, నాడు-నేడు వ్యవస్థలో జరుగుతున్న మార్పులపై ఆవేదన, ఉద్యోగ బృందాలలో గల మానవీయ సంఘటనలు, రుగ్మతలు, అలాగే ప్రయాణికుల పట్ల తపన, వారికి మార్గదర్శకత్వం, రైలు ప్రయాణంలో ఏర్పడిన సంబంధ బాంధవ్యాలు, ఉద్యోగులు, ప్రయాణీలు ప్రవర్తించే తీరు ఇంకా అనేక సంఘటనలు, అనేక అంశాలు ఈ కథలలో గోచరమవుతాయి. దేశ జనాభాలో రైలు ఎక్కని వారంటూ ఉండరు అని అనుకోవచ్చు. రైలు ఎక్కే ప్రతి ప్రయాణికుడు " రైలు గుండె చప్పుడు "అనే కథ తప్పక చదవాల్సిందే. మనకు తెలియని అనేక విషయాలు దృగ్గోచరం అవుతాయి. ఆశ్చర్య పోతాం కూడా.

బలమైన వ్యక్తిత్వం ఉన్న ఇద్దరు వ్యక్తులు కలిసి బతకాలంటే "ఆశయం" వారిని నడిపించాలి. ఈ దశలో 'సమాజం పట్ల నిబద్ధత' మనకు ఉన్నంతలో సాటి వారికి సేవ చేయాలన్న ధ్యాస ఉండాలని 'ఆలంబన' కథలో స్పృశిస్తారు.

రైలులో మానవ సహజ అవసరాలు తీర్చుకుంటూ పరిసరాల శుభ్రత పట్ల కాస్తంత విచక్షణ లేక పోవడం, నీళ్లున్నా సరిగ్గా ఉపయోగించడం రాని మనుషులు ఎప్పుడు తెలుసుకుంటారని ఓ పాత్ర ద్వారా సందేహం వ్యక్తపరుస్తారు. నిజమే మరి. మన ఇంటిని చూసుకున్న విధంగా మనం ప్రయాణించే ప్రజావాహనాలను భావించం. రైల్వే వ్యవస్థలో ప్రతి విభాగం ఔట్సోర్సింగ్ చేసేస్తూ అందిన ప్రతి వ్యవస్థను ప్రైవేట్ పరం చేయడం పట్ల "పయనం"అనే కథలో ప్రభుత్వాలు సామాజిక బాధ్యత నుండి తప్పుకోవడం పట్ల తీవ్రమైన ఆవేదన వ్యక్తపరుస్తారు.

మరో కథ 'వైకుంఠపాళి' లో గతంలో తల్లిదండ్రులు,

## నివాళి

# సాంస్కృతీ సమాఖ్య శిరీష్ కుమార్ ఇక లేరు!



నాలుగు దశాబ్దాలుకు పైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని యువకవులను ప్రోత్సహించిన సాంస్కృతీ సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి వాకాటి శిరీష్‌కుమార్ ఆగస్టు 9న విజయవాడలోని నున్నలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. ఆయన భార్య శివకుమారి పదిహేనేళ్ళ క్రితమే మరణించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రగతిశీల కవులను ప్రోత్సహించాలని ఆయన సాంస్కృతీ సమాఖ్యను ప్రారంభించారు. తాను స్వయంగా కలం పట్టకపోయినా కొత్త కలాలను ప్రోత్సహించడం ఆయనకు ఇష్టమైన సాహితీసేద్యంగా ఉండేది. విజయవాడ కేంద్రంగా ఆయన వందలాది సాహితీసదస్సులు, కవితా గోష్ఠులు నిర్వహించారు. వాటిలో పరిచయమైన కవులు, సాహితీవేత్తలు ఆ తర్వాతి కాలంలో పాత్రికేయ, సాహితీ రంగాలలో రాణించారు. వృత్తిరీత్యా శాతవాహన కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తూనే సాహితీగోష్ఠులు నిర్వహించేవారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని ఎందరో ఔత్సాహిక, సీనియర్ కవులు, రచయితలతో శిరీష్‌కుమార్‌కు అనుబంధముంది. ◆

---

ఉపాధ్యాయులు, సమాజం త్రికోణంలా ఉండి విద్యార్థుల్ని రక్షించేది. నేడు అంతర్జాలం ద్వారా ప్రజలకు సౌకర్యం కలుగుతున్నప్పటికీ, విద్యార్థి దశలో అంతర్జాలం దుష్ప్రభావం కలుగజేయడం, మీడియా సైతం చెడు మార్గాలకు ప్రేరణ అవుతుండడటాన్ని ఈ కథలో చిత్రించారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను చూసి కలత చెందిన హృదయంతో ఈ కథలో రచయిత్రి తన అసంతృప్తిని వ్యక్తపరిచారు.

ప్రేమించుకున్న జంట కలసి జీవితాన్ని పంచుకోవాలి అలా కానప్పుడు గతాన్ని మర్చి పోవాలని 'నిరీక్షణ' కథలో సుమ పాత్ర ద్వారా చెబుతారు. మనం వెళుతున్న ఈ రైలు చీకటిని చీల్చుకుంటూ గమ్యం వైపు ముందుకు నడుస్తుంది వెనక్కి వెళ్లడం లేదు జీవితం కూడా అంతే అని రచయిత్రి వ్యాఖ్యానిస్తారు. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నట్లు మానవీయత చుట్టూ తిరగాల్సిన కుటుంబ బంధాలు, అనుబంధాలు, అనురాగాలు, మమతలు వీటికన్నా ఆర్థిక వ్యవహారాల చుట్టూ మాత్రమే తిరుగుతున్నాయని 'ఆసరా' కథలో బోగీలు తుడిచే కుర్రాడి గురించి భార్య భర్తల మధ్య సంభాషణలు మన కళ్ళకు కట్టినట్లుగా కథ ఉంటుంది.

12 జీవనదులకు రొటేషన్ మీద సంవత్సరానికో పుష్కరం అంటే నది స్నానానికి మరో నది స్నానానికి మధ్య పాపాలు చేయండి ఈ స్నానంతో పునీతం కండి అంటూ ఈ వైజ్ఞానిక కాలంలో ప్రభుత్వం ప్రజలను మూఢనమ్మకం వైపు ప్రోత్సహిస్తుందని 'మరణమే జననం' అనే కథలో దీనిని తన ప్రగతిశీల దృక్పథంతో తూర్పార పడతారు. ఈ కథలోనే మంచి స్నేహితుడు లేకున్నా బతకవచ్చు కానీ మంచి పోరుగు లేకపోతే కష్టం. జీవితంలో చిన్న చిన్న విషయాలే మనసుకు హాయినిస్తాయి. వాటి విలువ తెలియని వారి సమక్షంలో జీవితం నరకప్రాయం అవుతుందని మానసిక ఉపశమనం కలిగినట్లుగా ఆ కథ ఉంటుంది.


తప్త హృదయం కథలో మనిషికో స్నేహం – మనసుకో దాహం లేనిదే జీవం లేదు. జీవితం కానేకాదు. మమతనే మధువు లేనిదే చేదు.మనకే మనకేం కావాలో తెలుసుకునే లోపల ఎవరు ఉన్నా లేకున్నా ....జీవితం గడిచిపోతుంది. బతుకుతాం... అంతే. జీవించలేము ., అని సందేశాత్మకంగా కథను తీర్చిదిద్దారు. ఎన్ని వ్యాపకాలు ఉన్నా మనిషికి మనిషి తోడు పక్కన ఉంటేనే – అసలైన తోడు. మధ్యలో ఏర్పడే ముడులు గట్టి బంధాలను ఇవ్వవు అని తన 'ఆట విడుపు' కథలో దాంపత్య జీవితం మర్మాలను నర్మగర్భంగా కథలో పాత్రల ద్వారా తెలియజేస్తారు.

రచయిత్రి జనవరి 2016 నుండి జూలై 2018 వరకూ ప్రతీ నెల ఒక కథ రాస్తూ 31 కథలను రేపటి కోసం అనే పత్రిక కోసం రాశారు. ఇవన్నీ కూడా ధారావాహికగా ఆ సంచికలో ప్రకటితమైనవి. వాటిలో ఒక కథను తప్పించి నేడు "రైలుబండి కథలు అనే కథా సంకలనం" 30 కథలతో పాఠకలోకానికి అందుబాటులోకి తెచ్చారు. వీరి సాహితీ ప్రయాణాన్ని "పయనం వెనుక ప్రయాణం" అని ముందు మాటలో పేర్కొన్నారు. ప్రముఖ నటుడు, రచయిత అమరజీవి రంగనాథ్ గారికి "ఈ రైలు బండి కథలను" అంకితం చేశారు.

ఈ సంకలనం చదవటంవలన మనలో sence of humour పెరుగుతుంది అంటే అతిశయోక్తి కాదు. దేశీయ భాషలులోకి అనువాదం పొందే అర్హత ఉన్న కథల సంపుటి ఇది. సర్వేజనా పుస్తక పఠన ప్రాప్తి రస్తు. ◆

# స్వీకారం

**రెబెల్** నవల **హెచ్చార్కె** వెల : 150/- ప్రతులకు: 7093800678





అనగనగా ఒక ఊరు. చాలా చిన్న ఊరు. ఆ ఊరి పేరు గడివేముల. అది 1961. ఒక పిల్లవాడు అప్పటికి పదేళ్ల వాడు. కొండమీద బొల్లవరంలో మేనమామల ఇంట్లో వుంటూ గడివేముల మీదుగా చదువుకు వెళ్లి వచ్చేవాడు. పెద్ద వాడయ్యాక వాడి జీవితం చాలా రఫ్‌గా గడిచింది. కాలేజీ చదువుల కోసం ఊరూరు తిరిగాడు. నానా గడ్డి తిన్నాడు. నక్సలైట్ పార్టీలో మరీ రఫ్‌గా బతికాడు.

ఆ పిల్లవాడి పేరు పవన్ కుమార్. తనను నేను అమెరికాలో పెన్నింగ్‌టన్ అనే ఊరిలో కలిశాను. అక్కడికి మా అబ్బాయి విజిటర్‌గా వెళ్లి కొన్నాళ్లున్నా నేను. నాకు ఎవర్నైనా పలకరించి కబుర్లు చెప్పుకోవాలని అనిపించింది. తాను ఎవరు ఎక్కడివాడు ఏం చేశాడు ఏమేం చేశాడు.. అడిగాను. అతడి కథ బాగుంది. సంఘటనాత్మకంగా వుంది. తన కథ వినేకొద్ది వాస్తవాలు కల్పన కన్నా విచిత్రంగావుండటం అంటే ఏమిటో నాకు తెలిసి వచ్చింది. కథ నాకు చాలా ఆసక్తికరం అనిపించింది. మీకు చెబుతున్నాను. ఇది అతడి కథ. కుంచెం 'హిస్టరీ' కూడా.

**- హెచ్చార్కె** (తొలి రెండు అధ్యాయాలలోని వాక్యాలు కొన్ని)

---



**కలగన్నది - కనుగొన్నది** మొదటి భాగం

**చెరుకూరి సత్యనారాయణ జ్ఞాపకాలు**

**వెల : 50/- పేజీలు: 216**


**ప్రతులకు : 9866115655**

నామటుకు నేనూ ఈ స్వంత కథనానికి స్వీయ చరిత్ర అని పేరు పెట్టుకోవటానికి సిగ్గుపడతాను. కనుక నా జీవితంలో కొన్ని విషయాలకు కొంత కాలానికి ఇవి జ్ఞాపకాలనే చెప్పుకుంటాను.

**- చెరుకూరి సత్యనారాయణ**

---

**కలగన్నది - కనుగొన్నది - 2**



**చెరుకూరి సత్యనారాయణ జ్ఞాపకాలు**


**వెల : 50/- పేజీలు: 180**

**ప్రతులకు : 9866115655**

కలగన్నది - కనుగొన్నది పేరుతో నేను రాసుకున్న నా జ్ఞాపకాలకు ఇది రెండో భాగం. కేవలం నా లా ప్రాక్టీసు- బార్ అసోసియేషన్ కార్యకలాపాలు - అక్కడ నాకెదురైన అనుభవాలు - నాకు తటస్థపడ్డ మిత్రులు - వీరికి చెందిన జ్ఞాపకాలతోపాటు కొద్దిపాటిగా లభ్యమయ్యే సమాచారం కూడా పొందుపరిచి ప్రచురించటమే ఈ రెండో భాగం ప్రచురణ వెనుక వున్న ఉద్దేశం.

**- చెరుకూరి సత్యనారాయణ**

---



**వివేచన**

**వర్తమాన కవుల కవితా ప్రస్థానం**

**డాక్టర్ రాధేయ**

**వెల : 180/- పేజీలు: 192**

**ప్రతులకు: 9985171411**

ఇది ఘాటైన విమర్శ కాదు. అలా అని కేవలం పుస్తక సమీక్షలూ కావు. స్నేహపూర్వక పరామర్శలు. సాటి కవిని భుజం తట్టి మెచ్చుకోవడం. వాళ్ళ కవిత్వం రాధేయని ఎలా ఆకట్టుకుందో చెప్పే ప్రయత్నం. పన్నెండు మంది ఆణిముత్యాల్లాంటి కవుల కవిత్వ విశేషాల్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు రాధేయ. ప్రతి కవిలోనూ ఒక సరికొత్త కోణాన్ని చూడ్డంలో రాధేయ వివచేన మనల్ని ఆలోచింపజేస్తుంది.

**- అనిల్ డ్యాని**

---

**ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు**

**డి.వి.వి.ఎస్. వర్మ**



**వెల :30 పేజీలు: 70**

**ప్రతులకు: 8500678977**

గత 70 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ప్రయోగాలను ఈ పుస్తకం మన ముందుంచుతుంది. ఇందులో పైకి కనిపించే అంశాల పొరలను తొలగించి వాటి నిజ స్వరూపాన్ని వెలికితీస్తుంది. పుస్తకం చిన్నదైనా విశ్లేషణ మాత్రం చిక్కనైనది. కొత్త చూపుతో కొత్త కోణాలను చూపిస్తూ కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది. రాష్ట్ర రాజకీయ పరిణామాలలో మౌలికమైన అంశాలను అర్థం చేసుకోడానికి ఉపకరించే ఒక అపురూపమైన విశ్లేషణను ఈ పుస్తకం అందిస్తుంది.

**- డా. బి. రమేష్ చంద్రబాబు**

# తాపీ ధర్మారావు


19.09.1888 – 08.05.1973



తాతాజీ అని పిలిపించుకున్న తాపీ ధర్మారావు హేతువాద భావాలుగల కవి, రచయిత, సంపాదకుడు. దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు, పెళ్లి, దాని పుట్టుపూర్వోత్తరాలు వంటి పుస్తకాలతో హేతువాదులు అనిపించారు. కొత్తపాళి, పాతపాళి, విజయవిలాసము వంటి సాహిత్య గ్రంథాలు, స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 1 ▪ SANCHIKA - 12 ▪ KRISHNA ▪ September 2020
RNI N0.APTEL/ 2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication: 29.08.2020


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



పండుగలు - ప్రజాసంస్కృతి
పేజీలు 48 రూ. 40/-

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. ఇవన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి– అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మతనమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. వాటిని ఏవిధంగా చూడాలి అన్న ప్రశ్నకు సమాధానం ఈ చిన్న పుస్తకం.

## ప్రతిభామూర్తులు పసిడి పలుకులు



పేజీలు 80
రూ.65/-

వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొందరి ప్రతిభా మూర్తుల ఇంటర్వ్యూల సమాహారం ఈ 'ప్రతిభా మూర్తులు – పసిడిపలుకులు' పుస్తకం.. నాట్యం, సినిమా, ఫొటోగ్రఫీ, శిల్పకళ, సాహిత్యం, మిమిక్రీ తదితర రంగాలలో వెలుగొందిన, వెలుగొందుతున్న వారి జీవిత అనుభవాల సారమంతా ఈ చిన్ని పుస్తకంలో లభ్యమవుతుంది.


## వేద సాహిత్యం
### ఒక చారిత్రక పరిశీలన



పేజీలు 32
రూ.25/-

15 వేల ఏళ్ల సుదీర్ఘ కాల వ్యవధిలో రూపొందిన వేద వాఙ్మయపు అభివృద్ధి గతిని గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ చరిత్రలోని తొలి ఘట్టాల వరకు వెళ్ళాలి. వీటన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది.

## గౌతమ బుద్ధుడు - బౌద్ధతత్వం




పేజీలు 32
రూ.25/-

బుద్ధుడి మూల బోధనలు, సిద్ధాంతాల నుంచి తరువాత కాలంలోని బౌద్ధధర్మం ఎంత దూరంగా మళ్ళిందో నిర్ధారించడానికి ఈ పుస్తకంలో అనేక ఉదాహరణలు పేర్కొనబడ్డాయి.

బౌద్ధతత్వంలోని ప్రయోజనకరమైన అంశాలను అధ్యయనం చేయడం, అదేవిధంగా బౌద్ధధర్మం చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ అసలు వాస్తవాలను వెలికితీసి గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతాల సారాంశం వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం.

## భారతీయ భౌతికవాదం
## లోకాయత



పేజీలు 32
రూ.25/-

భారతీయ భౌతికవాదం మొదటినుంచి ఆధునికయుగం వరకు ప్రపంచంలో అన్నిచోట్లలాగే భారతదేశంలోనూ భౌతికవాద భావస్రవంతి కొనసాగుతూనే వచ్చిందని బలమైన ఆధారాలతో ఋజువు అయ్యింది. అటువంటి భౌతికవాద భావస్రవంతిలో ఒకటైన లోకాయత గురించి వివరించేదే ఈ పుస్తకం.

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2, ఫోన్ : 0866 – 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**